జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, మార్చి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

# టీడీపీ ఆవిర్భావంతోనే మహిళా సాధికారత ప్రారంభం

- మహిళా సాధికారతతోనే సుస్థిర అభివృద్ధి
- నిన్న-నేడు-రేపు ఎప్పుడూ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- ఏడాదిలో 1.75 లక్షల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తాం.
- 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే 75 మంది ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి వస్తారు
- మే నెలలో తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలున్నా రూ.15 వేల చొప్పున ఇస్తాం
- డ్రగ్స్, గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం
- శాసనసభలో సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి: 'టీడీపీ, మహిళలది అన్నాచెల్లెళ్ల బంధం. మహిళా సాధికారతతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళా సాధికారత ప్రారంభమైంది టీడీపీతోనే ప్రారంభమైంది. నిన్న, నేడు, రేపు ఎప్పుడూ వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఆనాడు ఎన్టీఆర్ మగవారితో సమానంగా మహిళలకు ఆస్తి హక్కు కల్పించారు. నేను డ్వాక్రా స్థాపించి వారి ఆర్థిక ప్రగతికి బాటలు వేశాం. ఏడాదిలో లక్షా 75 వేలమంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం' అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళా సాధికారతపై శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

### మహిళలను దృష్టిలో పెట్టుకునే ప్రతి కార్యక్రమం

మన జనాభాలో 50 శాతం మహిళలే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా, ప్రపంచమంతా నాగరికత వైపు పయనిస్తున్నా ఇంకా మహిళా పట్ల వివక్ష కొనసాగుతుండటం బాధాకరం. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీఏ కానీ, ఏపీలోని ఎన్డీఏ కానీ ఆడబిడ్డల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. మహిళా సాధికారతతోనే ఏదైనా సాధ్యమవుతుంది. ఎన్టీఆర్ మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. ఏ కార్యక్రమం ప్రారంభించినా అందులో ప్రత్యేకంగా మహిళలను దృష్టిలో పెట్టుకునేవాళ్లం. మగవారితో సమానంగా మహిళలకు హక్కులు కల్పించడంతో పాటు, ఆర్థికంగా, సామాజికంగా వారిని పైకి తీసుకువచ్చినప్పుడే మన వ్యవస్థ బాగుపడుతుంది. చిన్నప్పుడు తల్లిదండ్రులు, పెళ్లయ్యాక భర్త, వృద్ధాప్యంలో పిల్లలపై మహిళలు ఆధారపడతారు. నేటికీ మహిళపై ఇంకా చిన్నచూపు ఉంది.

### ఆస్తి కోసం తల్లీ,చెల్లిని గెంటిన వారా మాపై విమర్శలా?

1986లో ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారు. 2005లో కేంద్రం దీన్ని చట్టం చేసింది. అయితే మన రాష్ట్రంలో తల్లికి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వని వ్యక్తి నిన్నటి వరకూ సభలో ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని తల్లినీ, చెల్లినీ గెంటేసిన వారి వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా మహిళలకు ఒనగూరేదేమీ లేదు. ఆస్తి ఇవ్వనని కోర్టుకు పోయిన వ్యక్తికి మహిళలపై మాట్లాడే హక్కు ఎక్కడిది? రాజకీయాల్లో మనం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. మనం ఆదర్శంగా ఉండి ప్రజలకు స్ఫూర్తిగా నిలవాలి. అమరావతి ఇవాళ బతికిందంటే మిగతా.. 10లో

# వీళ్లంతా పోరగాళ్లంట.. హ్వా హ్వా హ్వా!

వైసీపీ యువతపోరుపై సోషల్‌మీడియాలో పేలుతున్న సెటైర్లు

## కామెంట్



(మార్తి సుబ్రహ్మణ్యం)

కూటమి సర్కారుపై వైసీపీ సమరశంఖం పూరించింది. బాగుంది. అసలు వైసీపీ ఇప్పుడే కాదు. కొత్త సర్కారు వచ్చిన మూడు నెలల నుంచి రోడ్డెక్కింది. జగనన్న అయితే "మళ్లీ నేనే సీఎం. మీ సంగతి తేలుస్తా. అందరి లెక్కలూ రాస్తున్నాం. రిటైరయి సప్త సముద్రాల అవతల దాక్కున్నా వెంటాడి తీసుకువచ్చి శిక్షిస్తా"నని, అప్పట్లో తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడికి వార్నింగ్ ఇచ్చారు. తర్వాత కూటమి సర్కారు కూడా.. జగన్ వచ్చేదాకా సుబ్బారాయుడి సంగతి తేల్చే అవకాశం వైసీపీకి ఎందుకివ్వాలి? ఆ పనేదో మేమే చేస్తామని.. తిరుపతి ఘటనలో జగన్ బెదిరించిన అదే సుబ్బారాయుడిపై బదిలీ వేటు వేసిందనుకోండి. అది వేరే విషయం. ఇక పులివెందుల డిఎస్పీపైనా జగనన్న అగ్గిరాముడయ్యారు.

అటు వైకాపేయులు కూడా జల్లాల్లో అధికారులను బెదిరించి బతికేస్తున్నారు. సీన్ కట్ చేస్తే.. జగనన్న జమానాలో మూడేళ్ల వరకూ టీడీపీ నేతలు రోడ్డెక్కేందుకే ఫ్యాంట్లు తడిపేసుకున్నారు. ఎక్కడ కేసులు పెడతారోనని ఇళ్లలోనో, పక్క రాష్ట్రంలోనో తొంగున్నారు. అప్పటివరకూ జగన్ సర్కారుపై నిర్భయంగా యుద్ధం చేసింది సోషల్‌మీడియా సైనికులు.. రఘురామకృష్ణంరాజు, అయ్యన్నపాత్రుడు, సోమిరెడ్డి, దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, యరపతినేని శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్ర, పట్టాభి, బుద్దా వెంకన్న, మహాసేన రాజేష్ వంటి కొద్దిమంది మాత్రమే జగన్ సర్కారుకు ఎదురొడ్డి పోరాడారు. చంద్రయ్య లాంటి కరుడుగట్టిన కార్యకర్తలు, వైసీపీ బెదిరింపులకు లొంగకుండా గొంతుకోసుకుని తనువు చాలించారు.



వీరిలో రఘురామకృష్ణంరాజు చావు అంచులదాకా వెళ్లి రాగా, మరికొందరు జైలుపాలయ్యారు. పార్టీ ఆఫీసుపై వైకాపేయులు దాడి చేసిన తర్వాతనే టీడీపీ నేతల్లో చలనం, చైతన్యం వచ్చింది. అప్పటివరకూ చాలామంది పెద్ద నేతలంతా కలుగుల్లో దాక్కున్నవాళ్లే. కానీ జగన్ పార్టీ నేతలు మాత్రం మూడు నెలలకే రోడ్డెక్కి, పోలీసులను బెదిరించే ధైర్యం వచ్చేయడమే ఆశ్చర్యం. మీరు మా వెంట్రుక కూడా పీకలేరని తొడకొట్టడం మరో వింత. ఇది పాలకుల బలహీనతా? లేక జగన్ బలమా అన్నది మరో చర్చ.

ఇప్పుడు మళ్లీ వైసీపీ నిర్వహించిన యువత పోరులోకి వెళితే.. జగనన్న పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యువత పోరు జరిగింది. దీనికి భారీ సంఖ్యలోనే జన సమీకరణ జరిగింది. పోలీసులను కూడా లెక్కచేయకుండా, వారిని బె దిరించి మరీ బారికేడ్లు తోసుకుని ముందుకు వెళ్లారు. ఆ రకంగా కార్యక్రమం సక్సెస్ అయింది. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, కూటమి హామీ ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి చెల్లించాలన్న యువతరానికి సంబంధించిన డిమాండ్లతో వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళన నిర్వహించింది. అంతవరకూ బాగానే ఉంది.

మరి ఆ ప్రకారం యువత కోసం.. నిరుద్యోగుల కోసం నిర్వహించిన ఆందోళనకు సహజంగా యువకులు,విద్యార్థులు, నిరుద్యోగులే హాజరవాలి. ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఏబీవీపీ, టీఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ వంటి విద్యార్థి సంఘాలు నిర్వహించే ర్యాలీలు, ఆందోళనకు అచ్చం విద్యార్థులు, యువతే హాజరవుతారు. కానీ వైసీపీ నిర్వహించిన యువత పోరులో మాత్రం తండ్రులు, తాతయ్యలు, బాబాయిల వయసున్న వాళ్లు కూడా పాల్గొనడంతో అసలు లక్ష్యం దెబ్బతిని, వైసీపీ పరువుపోయేందుకు కారణమయింది.

వృద్ధులు కూడా పాల్గొన్న ఈ యువతపోరు దృశ్యాలు,సోషల్‌మీడియాలో తెగ హల్‌చల్ చేస్తున్నాయి. "వీళ్ల యూత్తేంట్రా బాబూ.. మిగతా.. 2లో

# థాంక్యూ పిఠాపురం

- న భూతో అనేలా జయకేతనం ఆవిర్భావ సభ
- 1600 మంది పోలీసులతో భారీగా బందోబస్తు
- రాష్ట్రం నలు వైపుల నుంచి వచ్చేవారికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఆహారం, మంచినీరు అందరికీ అందేలా చర్యలు
- సభా స్థలంలో 12 అంబులెన్సులు, మెడికల్ బృందాలు సిద్ధం
- మహిళలకు ప్రత్యేక గ్యాలరీలు, సౌకర్యాలు
- శుక్రవారం సాయంత్రం 3.30 గంటల నుంచి సభ మొదలు
- తుది దశకు వచ్చిన ఆవిర్భావ సభ ఏర్పాట్లను పరిశీలించి, వివిధ కమిటీల నాయకులు, రాష్ట్ర నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్



పిఠాపురం: 'పిఠాపురం జనసేన పార్టీకి ఎన్నో మరుపురాని జ్ఞాపకాలు ఇచ్చింది. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం జయకేతనం సభకు కూడా పిఠాపురం వేదిక అయింది. ఈ సందర్భంగా పిఠాపురం ప్రజలకు నిండు మనసుతో కృతజ్ఞతలు చెప్పుకొందాం.. థాంక్యూ పిఠాపురం' అని జనసేన మిగతా.. 2లో

# ఇది ఒక మాస్టర్ పీస్.. ఒక ఎపిక్.. ఒక బ్లాక్ బస్టర్!



ఇది ఏదో సాధారణమైన హవాలా కథ కాదు. ఇది ఒక మాస్టర్ పీస్, ఒక ఎపిక్, ఒక బ్లాక్ బస్టర్. మన రాజ్ కసిరెడ్డి కేవలం హవాలా డాన్ కాదు, ఒక ఆర్టిస్ట్, ఒక స్ట్రాటజిస్ట్!

ఎలా అంటారా? ఎందుకంటే ఈయన 7-లెవెల్స్ గేమ్ ప్లాన్ చేసి, హవాలా ను కూడా ఒక ఆర్ట్ గా మార్చేశారు. ఇంతకీ ఈయన ఏదో చిన్న పని చేసినట్టు అనుకుంటే, మీరు పప్పులో కాలేసినట్లు. ఈయన 25,000 కోట్ల నాసిరకం మద్యం డబ్బుల రక్త పిశాచాల కోసం ఐటీ అడ్వైజర్ రూపంలో వచ్చిన మనీహైస్ట్ డైరెక్టర్.


మొదటి లెవెల్ నుంచి చూద్దాం. మద్యం కంపెనీల నుంచి ప్రతినిధులను నియమించడం అంటే ఏమిటి? ఇది ఒక టాలెంట్ షో కాదు, ఇది ఒక టీమ్ బిల్డింగ్ ఎక్సర్సైజ్! ఎవరికి ఎంత నమ్మకం, ఎవరు ఎంత డబ్బు తెచ్చేస్తారు అనేది ఒక గేమ్ ఆఫ్ థ్రోన్స్ లాంటి ఎక్స్పెరిమెంట్.

రెండో లెవెల్‌లో క్యాష్ హ్యాండ్లర్స్ అంటే ఏమిటి? ఇవి కేవలం డబ్బు తెచ్చేవాళ్లు కాదు, ఇవి ఒక ఫ్యామిలీ!

మూడో లెవెల్‌లో కొరియర్లు అంటే ఏమిటి? కేవలం డబ్బు తీసుకువెళ్లేవాళ్లు కాదు, ఒక మిషన్ ఇంపాసిబుల్ టీమ్! ఒక్కో కొరియర్ ఒక్కో టామ్ క్రూజ్, ఒక్కో ట్రాన్స్ఫర్ ఒక్కో ఎక్స్పెడిషన్! ఫోన్ నంబర్లు మార్చడం అంటే ఏమిటి? ఇది ఒక సైన్స్, ఒక మ్యాథమెటిక్స్! ఎప్పుడు ఏ నంబర్ ఉపయోగించాలి, ఎప్పుడు మార్చాలి అనేది ఒక కాలిక్యులస్! మిగతా.. 2లో

# లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి

- పోర్టు వాటాల వ్యవహారాన్ని డీల్ చేసింది విక్రాంత్ రెడ్డే
- కేవీ రావు రాజకీయ బ్రోకర్
- కేవీ రావుకు, వైవీ సుబ్బారెడ్డికి సాన్నిహిత్యం
- సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతా
- జగన్ కోటరీ వల్లే వెళ్లిపోయా
- చెప్పుడు మాటలు విని తప్పుడు దారి పట్టవద్దని చెప్పా
- విరిగిన మనసు అతకదు
- అందుకే వైసీపీ నుంచి వెళ్లిపోయా
- ఘర్ వాపసీ నా మనసులో లేదు
- వైసీపీ మాజీ ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



అమరావతి: లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి. కాకినాడ పోర్టు వాటాల బదిలీ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ అన్నీ వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డేనని మాజీ మిగతా.. 2లో



జగన్ పార్టీ జెండా ఉల్టా..పల్టా! 02



అసెంబ్లీలో ఉత్తమ ఎమ్మెల్యే అవార్డులు 09



గవర్నర్ ప్రసంగంలో దశ లేదు, దిశ లేదు 03



మంగళగిరిలో 100 పడకల ఆస్పత్రి! 03

# అటవీ అధికారులది ముమ్మాటికీ తప్పే

- ప్రభుత్వానికి తెలియకుండా జరిగిన తప్పును మన్నించాలి
- కూల్చిన పలు షెడ్ల పునర్ నిర్మాణానికి సొంత నిధులిస్తా...
- ఆర్టీసీ బస్సు సర్వీస్ కల్పించేందుకు మంత్రితో మాట్లాడతా....
- కాశీనాయన ఆశ్రమం నిర్వాహకులు జీరయ్యస్వామికి మంత్రి నారా లోకేష్ హామీ
- 'మహానాడు' కథనానికి మంత్రి స్పందన

అమరావతి, మహానాడు: ప్రభుత్వానికి తెలియకుండానే అటవీ శాఖ అధికారుల అత్యుత్సాహంతో కాశీనాయన ఆశ్రమంలో పలు షెడ్ల కూల్చివేత జరిగిందని, ఇది తప్పిదమని, ఆశ్రమ నిర్వాహకులు జీరయ్య స్వామికి విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ క్షమాపణలు చెప్పారు. అటవీ భూములు, టైగర్ జోన్ కారణంతో ఇటీవల కాశీనాయన ఆశ్రమానికి సంబంధించిన పలు షెడ్లను అటవీ అధికారులు కూల్చివేశారు. దీనిపై పశ్చాత్తాపం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేష్.. ఆశ్రమ నిర్వాహకులు జీరయ్య స్వామితో ఫోన్లో నేరుగా మాట్లాడారు. మిగతా.. 2లో



జనం గుండె చప్పుడు మహానాడు www.mahanaadu.com

09 Mar 2025 - Page 1

ధర్మో రక్షతి రక్షితః

పవన్.. కేశినాయన కష్టాలు తెలుసా?

- కేశినాయన ఆశ్రమనానికి అటవీశాఖ అడ్డంకులు
- సనాతన ధర్మపరిరక్షకుల పార్టీ ఎక్కడ?
- భక్తుల గోస పట్టేదెవరికి?

జ్యోతి క్షేత్రంలో కాశినాయన ఆశ్రమ వసతి గృహాలను పడగొడుతున్న ఫారెస్ట్ అధికారులు పడగొట్టండి సార్ పడగొట్టండి.

చివరి రోజుల్లో కన్న బిడ్డలు కూడు పెట్టకపోతే ఆసరా ఇవ్వడానికి కాశినాయన ఉన్నాడనే ముసలోళ్ల నమ్మకాన్ని పడగొట్టండి.

ఆకలంటూ వెళ్లినవాడికి లేదనకుండా కుడుపునింపుతున్న దాతృత్వాన్ని పడగొట్టండి. ఎంత మంది వచ్చారు ఎన్నాళ్లుంటారు మీ కులమేంటి గోత్రమేంటి మతమేంటి ప్రాంతమేంటి అనే పట్టింపు లేకుండా జరిగే నిత్యాన్నదానాన్ని పడగొట్టండి.

అదేంటి ఆశ్రమం పేరిట అడవిని ఆక్రమిస్తే ఎలా..? అడసలే టైగర్ జోన్ అంటారేమో..! మిగతా.. 2లో

# స్టేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదు

- రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారు.
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- కేసీఆర్ ఫ్యామిలీలో జాబ్స్ పోతేనే నిరుద్యోగులకు జాబ్స్ వస్తున్నాయి
- అబద్ధాల ప్రాతిపదికన రాష్ట్రాన్ని నడపను
- ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- విద్యాశాఖలో 1532 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 1292 జూనియర్ లెక్చరర్స్, 240 పాలిటెక్నిక్ లెక్చరర్స్ పోస్టులకు నియామక పత్రాలు అందజేసిన సీఎం



హైదరాబాద్: ఇవాళ ఉద్యోగ నియామక పత్రాలు అందుకుంటున్న అందరికీ అభినందనలు. ఇది మీకు కేవలం ఉద్యోగం మాత్రమే కాదు.. ఇది ఒక భావోద్వేగం. తెలంగాణ రాష్ట్ర సాధనలో నిరుద్యోగుల పాత్ర క్రియాశీలకమైంది. కానీ గత ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధి చూపలేదు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో మీ కృషి, పట్టుదల ఉంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మీ జీవితంలో పన్నెండేళ్ళు వృథా అయింది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55163 ఉద్యోగాలను భర్తీ చేశాం

తెలంగాణ ఉద్యమానికి పునాదిగా మారిన నిరుద్యోగుల సమస్యకు మేం శాశ్వత పరిష్కారం మిగతా.. 2లో

# చర్చించుకుందాం... కలిసికట్టుగా 'ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' ప్రపంచానికి పరిచయం చేద్దాం!

- విద్యాశాఖ భారం కాదు.. నా బాధ్యత
- లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) మోడల్ తీసుకువస్తాం
- విద్యావ్యవస్థలో సంస్కరణలకు అందరం బాధ్యత తీసుకోవాలి
- పదేళ్లలో జరగని సంస్కరణలు 9 నెలల్లోనే చేపట్టాం
- గడచిన ఐదేళ్లలో 12 లక్షల మంది పాఠశాలలకు దూరమయ్యారు
- ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తాం
- వైసీపీ హయాంలో రూ.4,271 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లిస్తాం
- విద్యారంగంలో సంస్కరణలపై శాసనమండలిలో జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి నారా లోకేష్

8లో



జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 13, మార్చి 2025 ‖

## వీళ్లంతా పోరగాళ్లంట..హ్హి హ్హి హ్హి !

**మొదటి పేజీ తరువాయి..**

అసలు ఒకవైపు పరీక్షలు జరుగుతుంటే ఈ విన్యాసాలేంటి? పోనీ జనాలను తెచ్చారు. ఆ తెచ్చేదోదే ఇంకో వంద రూపాయలు ఎక్స్‌ట్రా ఇచ్చి కుర్రాళ్లనే తీసుకురావచ్చు కదా?..కొంచెం కిడ్నీలు వాడండ్రా బాబూ.. కొద్దిగా మీ జగనన్నకు చెప్పండ్రా.. అతన్నలా వదిలేయ కండ్రా.. ఎక్కడన్నా చూపించండి. ఇకనయినా మారమని చెప్పండ్రా".. అంటూ జగనన్న బొమ్మేసి తెగ ఆటపట్టిస్తున్నారు. నిజమే కదా? అబద్ధం కూడా అతికినట్లుండాలి కదా మరి?

## థాంక్యూ పిఠాపురం

**మొదటి పేజీ తరువాయి..**

పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.

గతంలో ఎన్నడూ లేనంతగా పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని న భూతో అన్న రీతిలో నిర్వహిస్తున్నామని, దీనికి పార్టీలోని ప్రతి ఒక్కరూ మమేకం కావాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం "జయ కేతనం" సభ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఆసాంతం పరిశీలించి తగు సూచనలు అందించారు. సభా ప్రాంగణం మొత్తం కలియ తిరిగి ఏ ఏ ప్రాంతాల్లో ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏ కమిటీ ఎలా పని చేయాలి? ఎక్కడ పని చేయాలి అన్న వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు. కమిటీల సభ్యులకు తగు సూచనలు అందించారు. అనంతరం రాష్ట్ర నాయకులు, వివిధ కమిటీల సభ్యులతో సభా ప్రాంగణంలోనే నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ "గతంలో ఆవిర్భావ సభ జరిపినప్పుడు బందోబస్తు కోసం కోరితే పోలీస్ శాఖ పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అంతంత మాత్రమే స్పందించేది. ఇప్పుడు ఆవిర్భావ సభ కోసం ఏకంగా 1600 మంది పోలీసులు బందోబస్తు కోసం రావడం శుభ సూచకం. కేవలం పిఠాపురం నుంచే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి, రాష్ట్రంలోని నలువైపుల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా జన సైనికులు, వీర మహిళలు తరలివచ్చే అవకాశం ఉంది. వారికి తగినంతగా మనం ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. దీనికి పార్టీ తరపున నియమించిన కమిటీలు ఎప్పటికి అప్పుడు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది.

మనమంతా నాయకుడికి నిండు మనసుతో కృతజ్ఞత చెప్పుకోవాలి

జనసేన పార్టీ ప్రస్థానంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎదుర్కొన్న అవమానాలు, అవరోధాలు దాటి ఇప్పుడు ఇంత ఘనమైన పండుగ నిర్వహించుకుంటున్నామంటే మనమంతా నాయకుడికి కృతజ్ఞులై ఉండాలి. ఆయన మనకు సమాజంలో తీసుకొచ్చిన గౌరవం, పార్టీ ద్వారా ఆయన ఆశయాలకు తోడు నిలవడం మనకు ఓ మధురానుభూతి. దీనికి మనం ఎల్లవేళలా పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలుపుతూనే ఉండాలి.

అధికారం లేనప్పుడు ప్రజల కోసం ఎలా పోరాటాలు చేశారో అధికారంలో ఉన్నప్పుడు కూడా పవన్ కళ్యాణ్ ప్రజల కోసం అంతే తపిస్తున్నారు. తన పరిధిలో ఉన్న శాఖల ద్వారా విశేషంగా ప్రజలకు సేవలు అందించాలని పాలన సాగిస్తున్నారు. ఓ గొప్ప పోరాటం తాలూకా



ఫలితం తర్వాత వచ్చిన గొప్ప సమయం ఇది. దీన్ని మనమంతా ఉత్సవంలా జరుపుకుందాం. మచిలీపట్నం తర్వాత నిర్వహించిన అతి పెద్ద సభగా ఇది నిలుస్తుంది. దేశంలో ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా నిర్వహించనంత ఘనంగా జయ కేతనం సభ ఉండబోతోంది. ఇది మనమంతా గర్వించదగ్గ సమయం.

### ఎండ పెరుగుతోంది జాగ్రత్త

జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్ ఇప్పుడే మారుతున్న వాతావరణం తాలూకా హెచ్చరికలు తెలిపారు. ఎండలు బాగా పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనికి మనం కూడా సిద్ధంగా ఉండాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. ప్రత్యేకంగా మెడికల్ కమిటీ ఏర్పాటు చేశాం. దీంతోపాటు మెడికల్ సిబ్బంది కూడా సభా స్థలంలో సిద్ధంగా ఉండాలి. మొత్తం 12 అంబులెన్సులను సిద్ధంగా ఉంచాం. అలాగే చుట్టుపక్కల ఆసుపత్రిల సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా సూచనలు చేశాం.

సభా స్థలంలో ఎవరికి ఎలాంటి అస్వస్థత చేకూరిన వెంటనే స్పందించేలా మన వాలంటీర్లు సదాసిద్ధంగా ఉండాలి. దీంతోపాటు సభకు వచ్చేవారికి మంచినీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, పుచ్చకాయలు కూడా ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాం. లక్షల్లో బిస్కెట్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయి. అలాగే భోజన ఏర్పాట్లను నాయకులు విరివిగా చేయడం అభినందనీయం. సభకు వచ్చిన వారెవరు ఆకలి లేదా దాహంతో వెళ్లకుండా తగిన ఏర్పాట్లు చేయడం అభినందనీయం. దీనిని సభ రోజు కచ్చితంగా అమలు అయ్యేలా చూసుకోవాలి. ఏ కమిటీకి ఇచ్చిన బాధ్యత ఆ కమిటీ కచ్చితంగా నిర్వహించాలి.

### పార్కింగ్ స్థలాలు, గ్యాలరీలు ప్రత్యేకంగా..

ఎటువైపు నుంచి సభకు వచ్చే వారికి అటు వైపుగా ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించాం. అలాగే ప్రత్యేకంగా గ్యాలరీలు ఉన్నాయి. మహిళలకు ప్రత్యేకంగా గ్యాలరీలు, సౌకర్యాలు కల్పించాం. సభా ప్రాంగణంలో పార్టీ తరఫు నుంచి 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎలాంటి అవాంతరం లేకుండా సభ జరిగేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభమవుతుంది. వివిధ రకాల సంస్కృతులను ప్రతిబింబించేలా కల్చరల్ ప్రోగ్రామ్స్, ఒకరి తర్వాత ఒకరు నాయకుల ప్రసంగాలు, మధ్యలో ప్రత్యేకంగా తొమ్మిది ఆడియో, వీడియో పార్టీ ప్రస్థాన కథనాలు ఉంటాయి.

అనంతరం పవన్ కళ్యాణ్ప్ర త్యేక ప్రసంగం ఉంటుంది. రోడ్డుకు నలువైపులా ఎల్ఈడి స్క్రీన్లు, నాలుగు కిలోమీటర్ల మేర ఆడియో వినిపించేలా ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటు చేసాం. అలాగే ఈసారి ప్రత్యేకంగా బాణసంచా ఏర్పాట్లు కన్నుల విందుగా ఉండబోతున్నాయి. ఈ సభ ఇప్పటివరకు ఎవరూ జరపని అతిపెద్ద సభ. ప్రతి ఒక్కరు దీని విజయవంతం చేయడానికి పాటుపడదాం.

### వాలంటీర్ల సేవలు కీలకం

పార్టీకి మొదటి నుంచి వాలంటీర్ల సేవలు చాలా కీలకం. ఇప్పుడు కూడా వారి సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి. పోరాట యాత్ర దగ్గర నుంచి వారాహి యాత్ర, తర్వాత జరిగిన ఆవిర్భావ సభల్లో పార్టీ వాలంటీర్లు చేసిన సేవలు విశేషమైనవి. ఇప్పుడు కూడా వాలంటీర్లు పోలీసులకు సహకరిస్తూ తగువిధంగా పనిచేయాలి. వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ ఎలాంటి అపశృతి లేకుండా మెడికల్ బృందాలతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలి. గ్యాలరీల్లో అందరికీ తగిన ఆహారం నీరు అందేలా వాలంటీర్లు చొరవ తీసుకోవాలి. పోలీసులతో పూర్తిగా సమన్వయం చేసుకోవాలి.

ఎవరికి ఇచ్చిన బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలి. అన్ని విభాగాలు సమన్వయం చేసుకోవడం ద్వారా ఎక్కడ ఎలాంటి అపశృతి లేకుండా సభ సజావుగా సాగడానికి వీలుంటుంది. వైసీపీకి చెందిన కార్యకర్తలు జనంలో చొరబడి అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు అప్పగించేలా చూడండి. ఏ మాత్రం చిన్న అలజడి అయినా, వెంటనే స్పందించేలా వాలంటీర్లు పని చేయాలి.

### వాలంటీర్ల సేవలు వెన్నుదన్నుగా నిలుస్తాయి : శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్

వాలంటీర్లతో ప్రత్యేకంగా జరిగిన సమావేశంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ... " పార్టీకి మొదటి నుంచి వాలంటీర్లు చేసిన సేవలు ఎనలేనివి. ఇప్పుడు అధికారంలో ఉన్న సమయంలో వాలంటీర్లు పోలీసులతో, వ్యవస్థతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలి. ఎక్కడ చట్టాన్ని చేతిలో తీసుకోవద్దు. అలాగే ఏదైనా అనుకోని ఘటన జరిగితే అపాయంలో ఉన్న వారికి వెంటనే సాయం చేసేలా ముందుకు సాగండి. ఎక్కడైనా చిన్న అలజడి రేగిన వెంటనే స్పందించేలా పని చేయండి. అందరి దగ్గర వాకి టాకీలు ఉండే అవకాశం లేదు. ఎప్పటికప్పుడు కళ్ళతోనే కమ్యూనికేషన్ చేసుకునేలా వచ్చే జన ప్రవాహాన్ని తగిన రీతిలో సర్దుబాటు చేసేలా పని చేయాలి" అన్నారు.

ఈ సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, టిడ్కో చైర్మన్ వేములపాటి ఆజయ కుమార్, కాపు కార్పోరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ తుమ్మల బాబు, పార్టీ ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, కోశాధికారి ఎ.వి.రత్నం, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, తెలంగాణ ఇంఛార్జి నేమూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ పార్టీ జెండా ఉల్టా..పల్టా!

### బారికేడ్ల అవతల కార్యకర్తలు బందీ

(మార్తి సుబ్రహ్మణ్యం)

జగన్ భాషలో చెప్పాలంటే.. వైసీపీ స్థాపించి 'పదహైదేళ్లు' పూర్తయిన సందర్భంగా.. ఈ 'సంవచ్చరం' అధినేత జగనన్న తాడేపల్లిలో పార్టీ పతకాన్ని ఎగురవేశారు. కానీ అక్కడ గత వైభవం భూతద్దం వేసినా కనిపించలేదు. గతేడాది చక్రం తిప్పిన పెద్దతలకాయలెవరూ లేరు. ఒక విజయసాయిరెడ్డి.. ఇంకో మోపిదేవి రమణ.. మరో మస్తాన్‌రావు.. ఇంకో కృష్ణయ్య.. మరో ఆళ్ల నాని.. ఒక వాసిరెడ్డి పద్మ లాంటి వాళ్లెవరూ లేరు. వారి స్థానంలో ఒక పార్వతి. ఇంకో కల్యాణి. అంతే! ఉన్న పెద్ద లీడర్లు కూడా పెద్దగా వచ్చినట్లు కనిపించలేదు. దానికి కారణం జిల్లాల్లో జరిగిన యువతపోరు కార్యక్రమం కావచ్చు. సరే.. అధికారంలో ఉంటే వచ్చి వాలిపోవడం, కూలిపోతే పక్క పార్టీల్లోకి రాలిపోవడం రాజకీయాల్లో సహజమే.

కానీ .. పార్టీ కార్యకర్తలు సగర్వంగా ఎగరవేసే పార్టీ జెండా కూడా అడ్డం తిరగడమే విచిత్రం. తలకిందులైన పార్టీ జెండాను కూడా సరిచేసుకోకుండా, జగన్ కోటరీ జగనన్నతో జెండాను ఎగురవేయించడమే వింత. పాపం ఇవేమీ తెలియని జగనన్న.. అమాయకంగా వచ్చి జెండా ఎగరవేసి, జాతినుద్దేశించి ప్రసంగించి వెళ్లిపోయారు. ఈ వింత అక్కడితో ఆగిపోతే సరిపోయేది. కానీ జెండాకు కొద్దిదూరంలోనే మరో పాత వింత కొత్తగా దర్శనమిచ్చింది.

జగనన్న సీఎంగా ఉండగా, ఆయన ఎక్కడికి వెళ్లినా పరదాలు కట్టేవాళ్లు. చెట్లు నరికేవాళ్లు. ఇప్పుడు పార్టీ ఆవిర్భావ సందర్భంగా కూడా జగనన్న వద్దకు కార్తకర్తలను రానీయకుండా, అడ్డంగా బారికేడ్లు పెట్టిన ఫొటోలు సోషల్‌మీడియాలో దర్శనమిచ్చాయి. "పార్టీ జెండా మాదిరిగానే వైసీపీ తలరాత అడ్డం తిరుగుతోంది. జగనన్న ప్రవేశపెట్టిన రివర్స్ టెండరింగ్ మాదిరిగానే, ఈ రివర్స్ జెండా కట్టి జగనన్న కళ్లలో ఆనందం చూడాలని బహుశా జగనన్న కోటరీ ముచ్చటపడి ఈ ఏర్పాటుచేసినట్లుంది' అని, సోషల్‌మీడియాలో తమ్ముళ్లు తెగ ట్రోల్ చేస్తున్నారు. అయినా.. ఇయ్యన్నీ చూసుకోబళ్లా అబ్బాయా?!



## అటవీ అధికారులది ముమ్మాటికీ తప్పే

**మొదటి పేజీ తరువాయి..**

ప్రభుత్వానికి తెలియకుండా అటవీశాఖ అధికారులు చేసిన తప్పిదానికి తమను మన్నించాలని వేడుకున్నారు.

సమాచారం తెలిసి చాలా బాధపడ్డానని వివరించారు. కూల్చిన షెడ్ల పునర్ నిర్మాణానికి సొంత నిధులిస్తానని, ఆర్టీసీ బస్సు సర్వీస్ కల్పించేందుకు రవాణా శాఖా మంత్రితో మాట్లాడతానని నారా లోకేష్ జీరయ్య స్వామికి హామీ ఇచ్చారు. కాశీ నాయన ఆశ్రమం, జ్యోతి క్షేత్రం నిర్వాహకులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనకు ఫోన్ చేయాలని, అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తామని, సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి

**మొదటి పేజీ తరువాయి..**

రాజ్యసభ సభ్యుడు వేణుంబాకవిజయసాయిరెడ్డి మీడియాకు వెల్లడించారు.

కేవీ రావు ఫిర్యాదు మేరకు విక్రాంత్ రెడ్డి, విజయసాయిరెడ్డి, శరత్ చంద్రారెడ్డి, శ్రీధర్, అరబిందో రియాల్టీ ఇన్ఫ్రాపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. విచారణకు హాజరుకావాలంటూసోమవారం ఆయనకు సీఐడీ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు మాజీ ఎంపీ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, "కేవీ రావు ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా సీఐడీ అధికారులు ప్రశ్నించారు. మొదటగా కేవీ రావు మీకు తెలుసా అంటూ ప్రశ్నించారు. ముఖ పరిచయం, అలాగే ఏదైనా సోషల్ ఫంక్షన్లలో నమస్కారం అంటే నమస్కారం అని చెప్పడం తప్ప అతనికి, నాకూ ఏ విధమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధాలు లేవని చెప్పా.

కాకినాడ పోర్టు వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఉన్నారని, ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి విక్రాంత్ రెడ్డి అని చెప్పారు. కేవీ రావుకు, వైవీ సుబ్బారెడ్డికి మంచి సాన్నిహిత్యం ఉందని.. వైవీ సుబ్బారెడ్డి అమెరికాకు ఎప్పుడు వెళ్లినా కాలిఫోర్నియాలో కేవీ రావుకు చెందిన ఒక రాజభవనంలో ఉండేవారని చెప్పారు.

ఆది నుంచి అంతం వరకు పోర్టు వాటాల వ్యవహారాన్ని డీల్ చేసింది విక్రాంత్ రెడ్డే అని, కామన్ ఫ్రెండ్స్ తో కేవీ రావు చెప్పారని.. ఈ వ్యవహారం గురించి తనకు పూర్తి అవగాహన ఉందని, సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానని అన్నారు.

అరబిందో సంస్థ నుంచి కేవీ రావుకు దాదాపు రూ.500 కోట్లు బదిలీ అయిన విషయంపై ప్రశ్నించారు. ఆ విషయం నాకు సంబంధం లేదని, అసలు నిధులు బదిలీ అయిన సంగతి కూడా తెలియదని వివరించా. అరబిందో వ్యాపార విషయాల్లో నేనెప్పుడూ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశా. నా కుమార్తెను వారికివ్వడం తప్ప, అరబిందో సంస్థతో నాకు ఆర్థిక సంబంధాలు లేవు.

విక్రాంత్ రెడ్డి గురించి అడిగితే సుబ్బారెడ్డి కుమారుడిగా తెలుసని చెప్పా. రూ.500 కోట్ల లావాదేవీలకు సంబంధించి విక్రాంత్ రెడ్డే చేశారని, చాలా మంది సాక్షులు చెప్పినట్లు సీఐడీ అధికారులు అడిగారు. జగన్ మోహన్ రెడ్డి కాపాడేందుకే మీరు, విక్రాంత్ రెడ్డి కలిసే నగదు బదిలీ చేశారా? అని ప్రశ్నించారు. ఈ డీల్ విషయం జగన్?కు తెలియదని చెప్పా. అలాగే నాకూ ఎలాంటి సంబంధం లేదని సీఐడీ అధికారులకు మరోసారి స్పష్టం చేశా.

నన్ను ఉద్దేశపూర్వకంగానే ఒక అధికారి ఈ కేసులో ఇరికించారు. గతంలో ఏ-2గా ఉన్నా కాబట్టి ఈ కేసులోనూ ఏ-2గా చేర్చారు. కేవీ రావు ఆప్త మిత్రులతో మాట్లాడితే నా పేరు ఇరికించినట్లు చెప్పారు.

రాజకీయ బ్రోకర్ కేవీ రావు. అతనంటే నాకు అసహ్యం. జగన్ మోహన్ రెడ్డికి నాకూ మధ్య ద్వితీయశ్రేణి నాయకులు గ్యాప్ తెచ్చారు. దీంతో నా మనసు విరిగిపోయింది. అందుకే వైసీపీ నుంచి బయటకు వచ్చా. విరిగిన మనసు అతకదు. అందుకే వైసీపీ నుంచి వెళ్లిపోయా. ఘర్ వాపసీ నా మనసులో లేదు. తిరిగి వైసీపీలో చేరే ఉద్దేశం లేదని" చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి చుట్టూ కోటరీ ఉందని, ఆ కోటరీ వల్లే తాను వెళ్లిపోయానని అన్నారు. నాయకుడు అనే వాడు చెప్పుడు మాటల్ని నమ్మకూడదన్నారు. అలా నమ్మడం వల్ల పార్టీ నష్టపోతుంది. నాయకుడు నష్టపోతారన్నారు. తనను జగన్ పార్టీలో కొనసాగాలని కోరారనన్నారు.

అయితే అప్పుడే తాను నేరుగా చెప్పానన్నారు. మీ చుట్టూ ఉండేవారి చెప్పుడు మాటలు విని తప్పుడు దారి పట్టవద్దని చెప్పా. ఎవరు నిజాలు చెబుతున్నారో ,ఎవరు అబద్దాలు చెబుతున్నారో తెలుసుకోవాలన్నారు. మీ చుట్టూ ఉన్న వారి ఉన్న మాటలు వినవద్దు అని ఫోన్‌లో స్పష్టంగా చెప్పానన్నారు.

తాను వ్యవసాయం చేసుకుంటున్నానని చెప్పారు. గతంలో నాయకుడిపై భక్తి ఉండేది. ఇప్పుడు దేవుడిపై భక్తి ఉందని అన్నారు. తాను ప్రలోభాలకు లొంగిపోయానని జగన్ అన్నారు. తాను ప్రలోభాలకు లొంగలేదని, భవిష్యత్తులో తనపై విమర్శలు, ఆరోపణలు చేసినా తాను పట్టించుకోనని విజయసాయిరెడ్డి అన్నారు.

## స్టేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదు

**మొదటి పేజీ తరువాయి..**

చూపామన్న సంతృప్తి మాకుంది. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది. దేశ ఆర్థిక భవిష్యత్ విద్యాశాఖతో ముడిపడి ఉంది. అలాంటి శాఖలో మీరు ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం గొప్ప విషయం. ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న టీచర్ల బదిలీలు, పదోన్నతుల సమస్యను పరిష్కరించి విద్యాశాఖను ప్రక్షాళన చేశాం. విద్యా ప్రమాణాలు తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇది తెలంగాణ రాష్ట్రానికి అవమానకరం.




అందుకే విద్య ప్రమాణాలు పెంచేందుకు మీరంతా ఒక భావోద్వేగంతో ఉద్యోగ బాధ్యత నిర్వర్తించాలి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దాలి. ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఎక్కడ లోపం ఉందో ఒక్కసారి ఆలోచన చేయండి. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు. అది వారి భవిష్యత్ కు పెట్టుబడి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో మూలాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ను నిర్మించబోతున్నాం.ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11000 కోట్లు కేటాయించాం. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం.

ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని ఏర్పాటు చేసుకుంటున్నాం. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోంది.క్రికెట్ లో రాణించిన సిరాజ్ కోసం నిబంధనలు సడలించి ఉద్యోగం ఇచ్చాం. బాక్సింగ్ లోరాణించిన నిఖత్ జరీన్ కు డీఎస్పీ ఉద్యోగం కల్పించాం. పారాలింపిక్స్ లో రాణించిన దీప్తి జీవాంజీకి ఇంటి స్థలంతో పాటు ఉద్యోగం ఇచ్చాం.

కొంతమంది స్టేచర్ స్టేచర్ అని మాట్లాడుతున్నారు. స్టేచర్ ఉందని విర్రవీగినవారు స్టేచర్ మీదకు వెళ్లారు. స్టేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదు. కెసిఆర్ మాకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కెసిఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుంది. రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారు. క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా అని అంటున్నారు. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారు? నేను వాస్తవాలు చెబుతుంటే దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారు.

కేసీఆర్ ఫ్యామిలీలో జాబ్స్ పోతేనే నిరుద్యోగులకు జాబ్స్ వస్తున్నాయి. అధికారంలో ఉన్న వాళ్ల ఉద్యోగాలు తీసేస్తే మీ ఉద్యోగాలు మీకు వస్తాయని ఆరోజే చెప్పాను. గద్దె నెక్కిన వాళ్లు విర్ర వీగుతుంటే మీరందరూ పట్టుదలతో తండ్రి, కొడుకు, బిడ్డ, అల్లుడు ఉద్యోగాలను తొలగించడం వల్లే మీరు ఈ శాశ్వత ఉద్యోగాలను అంది పుచ్చుకున్నారు.

కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్ లా అబద్ధాలు మాట్లాడుతున్నారు. అబద్దాల ప్రాతిపదికన నేను రాష్ట్రాన్ని నడపను. వాస్తవాలు మీతో పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరం.

## ఇది ఒక మాస్టర్ పీస్.. ఒక ఎపిక్.. ఒక బ్లాక్ బస్టర్!

**మొదటి పేజీ తరువాయి..**

నాలుగో లెవెల్ లో ఆర్గనైజర్ అంటే ఏమిటి? ఇది ఒక కీలక పాత్ర, ఒక మాస్టర్మైండ్! ఈయనే డబ్బు ను ఒక చోటికి చేర్చేవాడు. ఇది ఒక కేంద్రీకరణ, ఒక కన్సాలిడేషన్!

ఐదో లెవెల్ లో రాజ్ కసిరెడ్డి గారు అంటే ఏమిటి? ఇది ఒక డెస్టినేషన్, ఒక ఫైనల్ గోల్! ఈయనే డబ్బు ను పెద్దిరెడ్డి కుమారుడు మిథున్ రెడ్డికి చేర్చేవారు. ఇది ఒక ట్రాన్స్ఫర్, ఒక ట్రాన్స్మిషన్!

ఆరో లెవెల్ ఒక ఫైనల్ లింక్, ఒక కనెక్షన్! ఈయనే డబ్బు ను బిగ్ బాస్ కు చేర్చేవారు. ఇది ఒక ట్రాన్స్ఫర్మేషన్, ఒక మెటామార్ఫాసిస్!

ఏడో లెవెల్ లో బిగ్ బాస్ అంటే ఏమిటి? ఇది ఒక ఫైనల్ డెస్టినేషన్, ఒక అల్టిమేట్ గోల్! ఈయనే డబ్బు ను వివిధ రూపాల్లోకి మార్చేవారు. ఇది ఒక మ్యాజిక్, ఒక మిరాకిల్!

ఇంతకీ ఈ తెలివితేటలు స్టేట్ అభివృద్ధి పై పెడితే ఏమి అయ్యేది? ఇది ఒక హైపోథెటికల్ క్వెస్చన్! కానీ ఒక్కటి మాత్రం నిజం. ఈయన హవాలా ను ఒక ఆర్ట్ గా మార్చారు. ఈయన డబ్బు ను ఒక మ్యాజిక్ గా మార్చారు. ఈయన ఒక మాస్టర్మైండ్, ఒక జీనియస్!

రాజ్ కసిరెడ్డి ని కేవలం ఒక హవాలా డాన్ గా చూస్తే తప్పు. ఈయన ఒక లీజెండ్, ఒక మిథ్, ఒక ఫెనామినా! ఈయన హవాలా ను ఒక హీరోయిక్ ఎపిక్ గా మార్చారు. ఈయన డబ్బు ను ఒక ఫిలాసఫీ గా మార్చారు. ఈయన ఒక ఫిలాసఫర్, ఒక థింకర్, ఒక డ్రీమర్!

హవాలా థ్రిల్లర్‌కు ఎండ్ టైటిల్స్ రాసే సమయం దగ్గరపడుతోంది!


క్లైమాక్స్ దిశలో ఎ2 విజయసాయి రెడ్డి కూడా ఈ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి గురించి ఇవ్వాళ బరస్ట్ అవుతూ.. "జగన్ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాం మొత్తం, ముందుండి చేసింది కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డే. దీని వెనుక ఉన్న పాత్రధారులు ఎవరో, టైం వచ్చినప్పుడు చెప్తా.. అని జగన్ & కోటరికి ఒక టైం బాంబ్ సెట్ చేశాడు.

తనను జగన్ తిడుతుంటే.. తిట్టిస్తుంటే.. తట్టుకోలేపోతూ.. ఇంత కృతఘ్నుడా జగన్ అంటూ తాడేపల్లి ముఠా గుట్టు రట్టు చేస్తున్నాడు.

## సబ్ వేస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

### కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**ఢిల్లీ:** ఏలూరు జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు సబ్ వేస్ లు, ఫ్లై ఓవర్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ హౌస్ మంత్రి చాంబర్ రోడ్ లోని కార్యాలయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ మహేష్ కుమార్ కలిసి వినతి పత్రం అందజేశారు. గుండుగొలను నుండి పెద్దింట్లమ్మవారి దేవాలయం వరకు దాదాపు 24 కిలోమీటర్ల రహదారి కొల్లేరు సరస్సు ప్రాంతం నుంచి వెళుందని, కొల్లేటిలంక గ్రామాలకు ప్రసిద్ధ పెద్దింట్లమ్మ అమ్మవారి దేవాలయానికి ఏడాది పొడవునా యాత్రికులు సందర్శిస్తారని, పర్యాటక ప్రదేశమైన కొల్లేరుకు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి వచ్చే పక్షులను సందర్శించడానికి కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని పర్యాటకులు సందర్శిస్తారని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న సింగిల్ లేన్ సర్ఫేస్ రోడ్డు అగడలంక ఛానల్‌కు సమాంతరంగా ఉందని, ఈ రహదారిలో ప్రజలు, పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.109 కోట్లు మంజూరు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.



భీమడోలు వద్ద రెండు కి.మీ ఫ్లైఓవర్ నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కూరెళ్లగూడెం వద్ద ప్రజలు ఇంటర్‌చేంజ్ క్రాస్ పాయింట్‌ను దాటి అవతలి వైపునకు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. అంబర్‌పేట, వడ్లపట్ల జెడ్పీ రోడ్డు నుంచి అంబర్‌పేట పొలిమేరపుంత వరకు 1200 మీటర్ల మేర ఫ్లై ఓవర్ నిర్మించాలని, పి.కన్నాపురం నుండి పుల్లకి ఇంటర్‌చేంజ్ పాయింట్ వద్ద 600 మీటర్లు రాంగ్ రూట్ లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఎంపీ మహేష్ కుమార్ కేంద్రమంత్రికి వివరించారు. మరికొన్నింటిని మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళారు. ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## చెవిరెడ్డికి ప్రకాశం జిల్లా పోలీసుల నోటీసులు

### ఎర్రగొండపాలెం ఆర్వో శ్రీలేఖను బెదిరించిన కేసు

**ఎర్రగొండపాలెం:** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ నమోదైన ఐదు కేసులకు సంబంధించి, చెవిరెడ్డికి నోటీసులు ఇచ్చారు. ఐదు కేసులో ఎర్రగొండ పాలెం ఆర్వో శ్రీలేఖను బెదిరించిన కేసు కూడా ఉంది. 2024 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు నుంచి వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పోటీ చేశారు. ఎన్నికల సమయంలో ఎర్రగొండపాలెం నియోజక వర్గంలో చెవిరెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఎర్రగొండ పాలెంలో మూడు కేసులు, దోర్నాల, పెద్దారివీరుడులో ఒక్కొక్క కేసు నమోదు అయ్యింది. ఐదు కేసులపై ఎర్రగొండపాలెం పోలీసులు ఒంగోలు వైసీపీ కార్యాలయంలో చెవిరెడ్డికి నోటీసులు ఇచ్చారు.

జనం గుండె చప్పుడు

మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, మార్చి 2025 ||

# తెలంగాణ ప్రజల కలల సాకారానికే బడ్జెట్

◆ **గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**



**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి.. సభ ప్రారంభం కాగానే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ ప్రవేశ పెడుతున్నామన్నారు. ప్రజల పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు.
ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారని, జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తెలిపారు.

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించు కున్నామని, అభివృద్ధి, ప్రగతి వైపు తెలంగాణ అడుగులు వేస్తోందని జిష్ణుదేవ్ వర్మ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రానికే రైతులే ఆత్మ అని.. వారి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే వారే అన్నదాతలని.. రాష్ట్ర అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతు ఇవ్వడం, వారిని శక్తివంతులుగా తీర్చిదిద్దే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు.

దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని.. రైతులకు రుణ మాఫీ చేశామని, రైతుల రైతుల పట్ల మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని.. ఎకరానికి రూ. 12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని.. రైతు నేస్తం అమలు చేస్తున్నట్లు చెప్పారు. వరి రైతులకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాలక్ష్మి గేమ్ ఛేంజర్ పథకమని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢ సంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశం లోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు.

రూ. 2 లక్షల పంట రుణ మాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. రుణ మాఫీతో రూ. 20,616.89 కోట్లతో 25.35 లక్షల మంది రైతులకు లబ్ధి కలిగిందన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి ఎకరాకు రూ. 12 వేలకు పెంచినట్లు వివరించారు.

# తలసీమియా రోగుల్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

◆ **అసెంబ్లీలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**అమరావతి:** తలసీమియా వ్యాధితో బాధపడుతున్న రోగులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తలసీమియా రోగులకు అందుతున్న చికిత్స, ఆర్థిక సాయం వంటి అంశాలపై బుధవారం శాసనసభలో బిజెపి సభ్యుడు విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ తలసీమియా రోగి పరిస్థితి తీవ్రత, అందుతున్న చికిత్స , ప్రభుత్వ, లేదా ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారా అన్న అంశాలపై వ్యాధి చికిత్సకయ్యే వాస్తవ ఖర్చు ఆధారపడి వుంటుందని వివరించారు.

తలసీమియా రోగులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్బిటిసి, డిజిహెచ్ఎస్ మార్గదర్శకాల మేరకు అన్ని (ప్రభుత్వ, ప్రైవేట్) రక్తకేంద్రాల వద్ద అవసరమైన రక్తం యూనిట్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. అదే విధంగా రక్తమార్పిడి కోసం అవసరమైన ల్యూకో డిప్లెషన్ ఫిల్టర్ కిట్లను, ఐరన్ చిలేటింగ్ మందుల్ని కూడా వారికి ఉచితంగా అందజేస్తున్నామన్నారు. తలసీమియా రోగుల్ని ఆర్థికంగా ఆదుకునేందుకు వారికి నెలకు రు.10 వేలు పెన్షన్ అందజేస్తున్నామన్నారు. తలసీమియా రోగుల దరఖాస్తుల్ని సెర్ప్ పరిశీలించిన అనంతరం ఆర్థిక శాఖ వారికి పెన్షన్లు మంజూరు చేస్తుందని, వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా వారికి పంపిణీ చేస్తున్నామని మంత్రి వివరించారు.

ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న దాదాపు1094 మంది తలసీమియా రోగులకు రక్తమార్పిడి చికిత్సను ఉచితంగా అందిస్తున్నామన్నారు. వారు ఈ చికిత్సను మూడు వారాలకోసారి తీసుకోవాల్సి వుంటుందన్నారు. రక్త మార్పిడి కారణంగా శరీరంలో ఇనుప ధాతువు (ఐరన్ కంటెంట్) పెరుగుతుంది కాబట్టి వివిధ అవయవాలు, ముఖ్యంగా గుండె దెబ్బతినే ప్రమాదం వుందని, అందువల్ల వీరికి ఐరన్ చిలేషన్ థెరపీని కూడా ఉచితంగా చేస్తున్నామన్నారు. తలసీమియా రోగులలో వ్యాధి గ్రస్తులు, వ్యాధి వాహకులు (క్యారియర్స్) వుంటారని, వారిలో బీటాజీన్ అసాధారణ స్థితిలో వుండటం వల్ల వారికి ఈ వ్యాధి సంక్రమిస్తుందని మంత్రి వివరించారు. వీరికి పూర్తి స్థాయి చికిత్స అందించాలంటే బోన్ మ్యారో చికిత్స చేయాల్సి వుంటుందన్నారు. ఇది అత్యంత ఖర్చుతో కూడినదైనందున దీనిపై కూడా తాము ఇటీవల సమీక్షించామన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినపుడు ఆయన స్పందిస్తూ డాక్టర్ ఎన్టిఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా వారికి ఆర్థిక సాయమందించేందుకు అంగీకరించారని సభకు వివరించారు.

ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా కేవలం దారిద్ర్య రేఖకు దిగువన వున్న వారికి మాత్రమే కాక ఎగువనున్న మధ్యతరగతి వారికి కూడా సాయమందించేందుకు ముఖ్యమంత్రి ఇటీవల సంసిద్ధత వ్యక్తం చేశారని, తలసీమియా రోగుల్ని కూడా ఆదుకునేందుకు ఆయన అంగీకరించారని మంత్రి వివరించారు. గతంలో రాజకీయ కారణాలతో అనేక మందికి ఈ లబ్ది అందకుండా గత పాలకులు వ్యవహరించారని, ఇప్పుడు తమ ప్రభుత్వ ఎటువంటి వివక్షకూ తావులేకుండా అర్హులైన అందరికీ ఈ సాయమందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

తలసీమియా వ్యాధి గ్రస్తుల కోసం అనేక స్వచ్ఛంద సంస్థలు



సేవలందిస్తున్నాయని, ఇందులో భాగంగానే ఇటీవల ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలో సంగీత విభావరి నిర్వహించి నిధులు సమీకరించారని మంత్రి తెలిపారు. అదే విధంగా రెడ్ క్రాస్ సంస్థ కూడా తలసీమియా తదితర వ్యాధిగ్రస్తుల్ని ఆదుకునేందుకు అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ అంశాల్ని పరిశీలించిన తరువాత వ్యాధిగ్రస్తుల సంఖ్య తక్కువగానే వుందని, వ్యాధి వాహకుల సంఖ్య ఎక్కువగా వుందన్న విషయాన్ని తాము గుర్తించామని చెప్పారు.

ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సి వుందన్నారు. తల్లిదండ్రులు మేనరికపు వివాహాల్ని తగ్గించాల్సిన అవసరం వుందని మంత్రి అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రుల్లో ఈ వ్యాధి వుంటే వారి పిల్లలకు కూడా ఈ వ్యాధి సంక్రమించే అవకాశం వుందన్నారు. ఈ వ్యాధితో పుట్టిన చిన్నారులు రెండు, రెండున్నరేళ్ళకే మరణించే అవకాశాలున్నాయన్నారు. తలసీమియా వ్యాధి గ్రస్తులు సగటున 35-40 ఏళ్ళ వరకూ మాత్రమే జీవించే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారని మంత్రి వివరించారు.

అయితే బోన్ మ్యారో చికిత్స చేయించుకుంటే ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉఅందన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినపుడు దాదాపు 130 మంది వరకూ వ్యాధిగ్రస్తులున్నట్లు తేలిందన్నారు. సమస్య కొంత తీవ్రంగా వున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యం

◆ **దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు - గ్రామాభివృద్ధి తోనే దేశాభివృద్ధి**

◆ **త్రాగు,సాగు నీటి ఎద్దడి లేకుండా చూస్తాం.. ప్రతి సమస్యను పరిష్కరిస్తాం**

◆ **కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం.**

**కాజులూరు:** రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, గ్రామాల్లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కూటమి పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నందున మంత్రి ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో జరిగిన మన గ్రామం - మన మంత్రి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధి తోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో వేసవిలో త్రాగు, నీటికి ఇబ్బంది పడుతున్నామని, అలాగే శివారు ఆయకట్టుకు సాగునీటి ఎద్దడి కూడా ఉందని పలువురు రైతులు సత్యం దృష్టికి తీసుకువచ్చారు.

అర్హులైన వారికి పింఛన్లు, వ్యక్తిగత కుళాయిలు మంజూరు చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, సీసీ రోడ్ల నిర్మాణం



చేపట్టాలని కోరారు. త్రాగునీటికి సంబంధించి ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు వివరిస్తూ గొల్లపాలెం గ్రామానికి త్రాగునీరు కోసం జల జీవన్ మిషన్ ద్వారా రూ.1.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి ప్రస్తుతం 430 కుళాయిలు వేసామని, రెండున్నర కిలోమీటర్లు మేర పైప్ లైన్ వేయాల్సి ఉందని, పనులు వేగవంతం చేసి సమస్య వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని తెలిపారు.

సమస్యలన్నిటిని మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని సత్యం హామీ ఇచ్చారు. రైతులకు సాగు నీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జె. రాంబాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్,గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు, కూటమి నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైసీపీ యువత పోరు నిరసన ర్యాలీ.పాల్గొన్న మాజీమంత్రి విడదల రజిని,మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి, గోపిరెడ్డి, మహేష్ రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు ,శంకర్రావు, సుధీర్ భార్గవ్ రెడ్డి, చింతలపూడి అశోక్ కుమార్.**



# ఉప్పల్ స్టేడియానికి కొత్తరూపు

◆ **రూ.5 కోట్ల వ్యయంతో ముస్తాబు**

◆ **వేగంగా జరుగుతున్న ఆధునీకరణ పనులు**

◆ **హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు నేతృత్వంలో మైదానం మొత్తం పరిశీలించిన బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు**

**హైదరాబాద్:** ఉప్పల్ స్టేడియం ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు ప్రకటించారు. బుధవారం బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులతో కలిసి మైదానం మొత్తం జగన్ మోహన్ రావు పరిశీలించారు. మరో పది రోజుల్లో తొలి ఐపీఎల్ మ్యాచ్ జరగనుండడంతో పనుల్లో వేగం పెంచాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

స్టేడియం మొత్తం రంగులు వేస్తున్నామని, నార్త్ స్టాండ్స్‌లో కొత్త రెస్ట్ రూమ్స్ నిర్మిస్తున్నామని, క్రికెటర్ల డ్రెస్సింగ్ రూమ్స్, కార్పొరేట్ బాక్సుల్లో ఏసీలు, టైల్స్ మారుస్తున్నామని చెప్పారు. స్టేడియంకు కొత్త రూపు ఇచ్చేందుకు హెచ్‌సీఏ నుంచి సుమారు రూ.5 కోట్లు ఖర్చు



చేస్తున్నామని, సీఎస్ఆర్ పథకం కింద ఎస్ఆర్‌హెచ్ కూడా సహకారం అందిస్తుందని జగన్ మోహన్ రావు తెలిపారు. జగన్ మోహన్ రావుతో పాటు బీసీసీఐ నుంచి వైభవ్, యువరాజ్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం నుంచి శరవానన్, రోహిత్ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.



**దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ విజయవాడ డివిజన్‌లోని కాకినాడ-సామర్లకోట-రాజమండ్రి-నిడదవోలు-ఏలూరు సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్ మరియు ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.**

# గాంధీభవన్లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం

◆ **గత 15 నెలల పేలవమైన అట్టర్ ఫ్లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునే విధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం**

◆ **భారతదేశంలో ఏ రాష్ట్ర సచివాలయంలో కూడా జరగని అత్యంత ఘోరమైన నీచమైన సంఘటన మన సెక్రటేరియట్లో జరిగింది**

◆ **రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు**

◆ **1,62,000 కోట్లు అప్పుచేసి ఒక్కటంటే ఒక్క పథకాన్ని ప్రాజెక్టును ప్రారంభించని అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.**

◆ **పోయిన సంవత్సరం ప్రభుత్వం చెప్పిన 40000 కోట్ల రూపాయల పెట్టుబడుల్లో 40 పైసలు అయిన వచ్చాయా?**

◆ **ముఖ్యమంత్రికి దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలి?**

◆ **గవర్నర్ ప్రసంగంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం**

**హైదరాబాద్:** అసెంబ్లీలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేసిన బడ్జెట్ ప్రసంగం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రసంగం గవర్నర్ స్థాయికి తగినదిగా లేదని, గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్ మీట్‌లా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ నోటి వెంబడి అబద్ధాలు, అర్థసత్యాలు, అసత్యాలు చెప్పించి ఆయన స్థాయిని దిగజార్చిందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ కొత్త విషయాలు లేదా ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలపై బడ్జెట్ ప్రసంగంలో స్పష్టత ఇస్తారని, గత 15 నెలల పేలవమైన పరిపాలనపై ప్రాయశ్చిత్తం చేసుకుంటారని ఆశించామని, కానీ అలాంటిదేమీ జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యంతో రాష్ట్రంలో రైతులు ఆరిగోసలు పడుతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని, 480 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ గవర్నర్ ప్రసంగంలో ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చే ఒక్క మాట కూడా లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఎక్కడా 25-30 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని, ఒక్క గ్రామంలోనైనా 100 శాతం రుణమాఫీ జరిగితే బీఆర్ఎస్ నాయకులు రాజీనామా చేస్తామని సవాల్ విసిరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని కేటీఆర్ తెలిపారు. అయినప్పటికీ, గవర్నర్ నోటి ద్వారా రుణమాఫీ పూర్తయిందని, లక్షలాది రైతులు సంతోషంగా ఉన్నారని అబద్ధాలు చెప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సాయం అందక ఆగమాగుతుంటే, రైతు బంధు అందిందని, కూలీలకు సంవత్సరానికి 12,000 ఇస్తున్నామని గవర్నర్ నోటి ద్వారా అసత్యాలు చెప్పించారని కేటీఆర్ విమర్శించారు.

సాగు నీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, కేవలం కేసీఆర్ గారిపై గుడ్డి ద్వేషంతో మేడిగడ్డ బ్యారేజీని 15 నెలలుగా రిపేర్ చేయకుండా ఎండబెట్టడంతో గోదావరి పరివాహకంలో పంటలు ఎండిపోతున్నాయని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి చేతగానితనంతో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు పొలాల్లో గొర్లు, బర్లు మేపుతున్నారని, గవర్నర్ ప్రసంగంలో ఈ సమస్యలపై ఒక్క మాట కూడా లేదన్నారు.

భారతదేశంలో ఏ రాష్ట్ర సచివాలయంలోనూ జరగని ఘోర సంఘటన తెలంగాణ సచివాలయంలో జరిగిందన్న కేటీఆర్, 20 శాతం కమీషన్ ఇవ్వకపోతే బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చాంబర్ ముందు ధర్నా చేసిన సంఘటన దీనికి నిదర్శనమని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి విజన్ లేదు, కేవలం 20 శాతం కమీషన్





మాత్రమే ఉందని మండిపడ్డారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా, గురుకులాల్లో తిండి పెట్టకుండా పిల్లలను చంపుతున్న అరాచక ప్రభుత్వం రేవంత్ రెడ్డి దని మండిపడ్డ కేటీఆర్, 83 మంది విద్యార్థుల మరణాలపై గవర్నర్ ప్రసంగంలో ఒక్క సానుభూతి మాట కూడా లేదని విచారం వ్యక్తం చేశారు.

కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో 4.17 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ ఒక్క సంవత్సరంలోనే 1.62 లక్షల కోట్ల అప్పు చేసిందని, అయినా ఒక్క కొత్త పథకం లేదా ప్రాజెక్టు ప్రారంభించలేదని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో రైతుల కోసం 4.5 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్న కేటీఆర్, రైతు బంధు (73,000 కోట్లు), రుణమాఫీ (28,000 కోట్లు), ఉచిత విద్యుత్, ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలో నంబర్ వన్ స్థానం సాధించిందని తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి దీనికి సిగ్గు లేకుండా క్రెడిట్ తీసుకుంటూ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు.

దావోస్‌లో 1.79 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ ద్వారా అబద్ధాలు చెప్పించారని, గత ఏడాది చెప్పిన 40,000 కోట్లలో ఒక్క పైసా కూడా రాలేదని, ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన కేయిన్స్ (3,800 కోట్లు), కార్నింగ్ (1,000 కోట్లు), ప్రీమియర్ ఎనర్జీ (1,700 కోట్లు) వంటి పెట్టుబడులు రేవంత్ రెడ్డి అసమర్థతతో గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లకు తరలిపోయాయని విమర్శించారు. కులగణన పేరుతో %దీజ%లను మోసం చేసి, రిజర్వేషన్లపై దగా చేసిన ఈ ప్రభుత్వం, దీనిని ప్రశ్నించిన ఒక కాంగ్రెస్ ఎమ్మెల్సీని సస్పెండ్ చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్ తల్లి, రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాలను సెక్రటేరియట్‌లో, ముందు పెట్టి తెలంగాణను ఉద్ధరించినట్టు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ తల్లిని, రాహుల్ తండ్రిని తిరిగి గాంధీ భవన్‌కు పంపిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేస్తూ, అప్పుల భారం మోస్తూ, అవినీతితో రాష్ట్రాన్ని నాశనం చేస్తోందని, గవర్నర్ ప్రసంగం ఈ వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నమని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఈ మోసాన్ని గుర్తించి సమయం వచ్చినప్పుడు సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# పొలిటికల్ మెచూరిటీ లేకనే సీఎం మార్చురీ వ్యాఖ్యలు

◆ **ప్రతిపక్ష నేతల మరణాన్ని కోరుకుంటున్న నీచ బుద్ధి రేవంత్ రెడ్డిది**

◆ **బిఆర్ఎస్ లక్షా 62 వేల ఉద్యోగాలు ఇస్తే, కాంగ్రెస్ 5 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు**

◆ **సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల పట్ల మాజీ మంత్రి హరీష్ ఫైర్**



**హైదరాబాద్:** ప్రభుత్వ కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ విమర్శలకు వాడుకోవడం ఆయన దుస్థితికి నిదర్శనం. ఉద్యోగ నియా మక పత్రాలిచ్చే కార్యక్రమంలో రేవంత్ రెడ్డి తన ఉన్మాద ప్రవృత్తిని మరోసారి బయట పెట్టుకున్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికే షన్లకు నియామక పత్రాలు ఇచ్చుకుంటూ ఇంకెంత కాలం డప్పు కొట్టుకుంటావు రేవంత్ రెడ్డి?

ఏడాదిన్నరగా నువ్వు ఇస్తున్న నియామక పత్రాలు అన్ని కేసీఆర్ గారు ఇచ్చిన నోటిఫికేషన్లే కదా? ఈరోజు కూడా కెసిఆర్ ప్రభుత్వ హయంలో ఇచ్చిన పాలిటెక్నిక్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ నోటిఫికేషన్లకు, పెట్టిన పరీక్షలకు నియాక పత్రాలు ఇచ్చినవు. కేసీఆర్ హయంలో మొదలై చివరి దశకు వచ్చిన ఉద్యోగ నియామకాల ప్రక్రియ ను పూర్తి చేసి జబ్బలు చరచుకుంటే బొప్పి కట్టడం తప్ప ఒరిగేదేమి ఉండదు

తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం లక్షా 62 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది వాస్తవం. ఏడాదిన్నర కాలంలో నోటిఫికేషన్ల ద్వారా రేవంత్ రెడ్డి ఇచ్చిన ఉద్యోగాలు 5, 6 వేలు మించ లేదనేది వాస్తవం. 95% ఉద్యోగాలు స్థానిక యువతకు దక్కేలా కేసీఆర్ గారు రాష్ట్రపతి ఉత్తర్వులు సాధించారు. ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, హామీల అమలులో అట్టర్ ఫ్లాప్ అయ్యింది.

ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అయ్యింది. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ అయింది. నిరుద్యోగ భృతి తీవ్ర నిరాశను మిగిల్చింది. రేవంత్ లాంటి కుసంస్కారి కేసీఆర్ పై చిల్లర విషయాలు చెబితే నమ్మడానికి ఉద్యోగాలు పొందిన వారు అమాయ కులు కారు. 55 వేల ఉద్యోగాలిచ్చామని చెప్పిన అబద్ధాన్నే ప్రతి చోటా చెబుతూ రేవంత్ తుపాకీ రాముడిని మించిపోయారు. పాలన చేతకాక రేవంత్ 'పరనింద"నే పనిగా పెట్టుకున్నారు. సీఎం గా వచ్చిన అవకాశాన్ని రాష్ట్రం బాగు కోసం వాడక తన పదవి ఉంటుందో ఊడుతుందోనని అభద్రతా భావంతో మాట్లాడుతున్నారు.

తన పార్టీలోని అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతూ బీఆర్ఎస్‌పై నెపం నెట్టి సానుభూతి రాజకీయానికి తెర లేపుతున్నారు. హంతకుడు సంతాప సభ పెట్టినట్టు ఉంది రేవంత్ తీరు. రాష్ట్రానికి కేన్సర్ సోకిందంటూ రేవంత్ రెడ్డి ఓ ఉన్మాదిలా మాట్లాడుతున్నారు. తన చేతకాని తనాన్ని రాష్ట్ర ప్రజలకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు. అబద్ధమాడకపోతే పూట గడవదు అనే పద్ధతి లో రేవంత్ వ్యవహారం ఉంది. గ్యారంటీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి గారడీ మాటలు చెబుతున్నాడు. రేవంత్ రెడ్డి కి కాన్సిల్ జబ్బు సోకింది. ఎన్నికలపుడు తాను చెప్పినవన్నీ కాన్సిల్ అంటున్నాడు. ప్రతిపక్ష నేతలు ప్రజల పక్షాన పోరాడుతుంటే వాళ్ళ మరణాన్ని కోరుకుంటున్న నీచ బుద్ధి రేవంత్ రెడ్డి ది. పొలిటికల్ మెచూరిటీ లేకనే సీఎం మార్చురీ వ్యాఖ్యలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి నిజాన్ని నమ్ముకోలేదు నిందలనే నమ్ముకున్నాడు. కష్టాన్ని నమ్ముకోలేదు.. కుతంత్రాలనే నమ్ముకున్నాడు. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి తాను ఉన్నది సీఎం పదవిలో అన్న విషయాన్ని గుర్తు తెచ్చుకుని చిల్లర వేషాలు మానితే మంచిది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, మార్చి 2025



## జరగబోయే ప్రమాదం గురించి చర్చిద్దాం రండి

- నియోజకవర్గాల పునర్ విభజనపై అఖిలపక్ష సమావేశం
- రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ



హైదరాబాద్: కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజక వర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉంది. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిలు సంయుక్తంగా బుధవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని బహిరంగ లేఖలో తెలిపారు. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని బహిరంగ లేఖ ద్వారా వారు స్పష్టం చేశారు.



## టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్ బీసీ సంక్షేమ శాఖలోని తెలంగాణ కల్లు గీతా ఆర్థిక సహకార సంస్థకు బదిలీ

- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: నెక్లెస్ రోడ్డులో ఉన్న నీరాకేఫ్ టూరిజం శాఖ పరిధిలో ఉండడంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో పలు మార్లు చర్చలు జరిపి నీరాకేఫ్ భవనం దాని పరిధిలో ఉన్న ఆస్తులను తెలంగాణ కల్లు గీతా ఆర్థిక సహకార సంస్థకు కి బదిలీ చేస్తూ ఈరోజు ఇరు శాఖల మంత్రులు ఒప్పందాల పై సంతకాలు చేయడం జరిగింది. ఇప్పటి దాకా టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్ ఇక నుండి కల్లు గీతా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో నడవనుంది.కల్లు గీత కార్మికులకు అండగా ఉంటూ వారి ఆందోళనను తొలగిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ వారీగా అండగా ఉన్నారు. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న నీరాకేఫ్ టూరిజం నుండి టాడీటాపర్ ఫెడరేషన్‌కి బదిలీ అంశం ఒప్పందం పూర్తవడంతో బీసీ సంక్షేమ శాఖ అధికారులు మంత్రులు పొన్నం ప్రభాకర్,జూపల్లి కృష్ణారావు లకు ధన్యవాదాలు తెలిపారు.

## నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలి

- బార్స్, వైన్స్, బెల్ట్ షాపులు పెంచటంపై చర్చించాలి
- చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులపై కూడా సభలో చర్చించాలని కోరాం
- బీఏసీ సమావేశం తర్వాత హరీష్ రావు చిట్ చాట్

హైదరాబాద్: కనీసం 20రోజులు అసెంబ్లీ నడపాలని బీఏసీలో డిమాండ్ చేశాం. ప్రశ్న పత్రాలు లీక్ అయినట్లు.. అసెంబ్లీ బిజినెస్ ముందే లీక్ అవటంపై అభ్యంతరం తెలిపాం. ప్రతిపక్షాలకు మైక్ ఇవ్వొద్దని సీఎం స్వయంగా స్పీకర్ ను బుల్డోజ్ చేస్తున్న విషయాన్ని బీఏసీలో లేవనెత్తాం.

సంఖ్య బలాన్ని బట్టి బీఆర్‌ఎస్‌కు సభలో సమయం ఇవ్వాలని కోరాం. మా విజ్ఞప్తికి ఓకే అన్నారు.రైతాంగ సమస్యలు, తాగు ,సాగు నీటి సమస్యలపై చర్చించాలని కోరాం. వివిధ (సుంకిశాల,పెద్దవాగు కొట్టుకుపోవడం, vattem పంప్ హౌస్ మునిగిపోవడం,ఎస్ ఎల్ బిసి ప్రమాదం) ప్రాజక్టులు కూలిపోవటంపై అసెంబ్లీలో



చర్చించాలని డిమాండ్ చేశాం. మంత్రులు సభకు ప్రిపేర్ అయ్యి రావాలని కోరాం. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి స్పీకర్ చొరవ తీసుకుని నిధులు ఇప్పించాలని కోరాం. కృష్ణా నదీ జలాల వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సభలో చర్చించాలని బీఏసీలో చెప్పాం. ఏపీ నీళ్ళు తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూసింది. బిల్లులు చెల్లింపుకు 20 శాతం కమిషన్ విషయాన్ని అసెంబ్లీలో చర్చించాలని కోరాం. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవటం చర్చించాలి.

బార్స్, వైన్స్, బెల్ట్ షాపులు పెంచటంపై చర్చించాలి. ఎల్ఆర్ఎస్ ఉచిత హామీపై చర్చ జరపాలని డిమాండ్ చేశాం. కాళేశ్వరం ప్రాజెక్టును కూలిన పిల్లర్ ను కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని బీఏసీలో చెప్పాం,వెంటనే కాళేశ్వరం పునరుద్ధరణ పనులు చేయాలని కోరాం. నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్ పై అసెంబ్లీలో చర్చించాలి. చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులపై కూడా సభలో చర్చించాలని కోరాం

## జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై త్వరలో సమావేశం

- టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి మంత్రి దామోదర్ హామీ

హైదరాబాద్: రాష్ట్రంలో జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పథకాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు గాను త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి.దామోదర్ రాజ నరసింహ హామీ ఇచ్చారు. బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం అసెంబ్లీలోని ఛాంబర్ లో మంత్రి దామోదర్ రాజ నర్సింహాను కలిసి జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుపై చర్చించింది. అంతే కాకుండా వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ



మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాకపోవడంతో జర్నలిస్టులు అనుభవిస్తున్న కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అసలే ఆర్థిక కష్టాలతో జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు, వైద్య ఖర్చులు మరింత భారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి జర్నలిస్టులు వైద్యం పొందే పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కురి రాములు, రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

**యువత పోరు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి**



## 19న తెలంగాణ బడ్జెట్.. 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్: తెలంగాణ స్పీకర్ ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం ముగిసింది.. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 27 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. 19న ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టనుంది. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. 14న హోలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. ఈ నెల 21 నుంచి 26 వరకు వివిధ పద్దులపై సభలో చర్చ చేపట్టనున్నారు..

ఈ నెల 27వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. బుధవారం బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించారు. అనంతరం శాసన సభ రేపటికి వాయిదా పడింది. ఆ తర్వాత అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది.

శాసన సభ భవనంలోని స్పీకర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,




శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ తరఫున మాజీ మంత్రులు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, సీపీఐ నుంచి కూనమనేని సాంబశివ రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఈ నెల 19న రాష్ట్ర బడ్జెట్‌ని ప్రవేశ పెట్టేందుకు తీర్మానించారు. గురువారం (13న) గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనున్నది. 14న హోలీ పండుగ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ఉంటుంది. 15 గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటుంది.. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఉంటాయి. 16న ఆదివారం సెలవు ఉంటుంది.

17, 18 ప్రభుత్వ బిజినెస్ ఉంటుందని.. రిజర్వేషన్ల బిల్లులు ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. 19న అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెడుతారు. 20న సెలవు, 21న బడ్జెట్‌పై సాధారణ చర్చ ఉంటుంది. 22, 24, 25, 26 పద్దులపై, 27 ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరుగనున్నది.

## ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- టిడ్కో ఇళ్లు,అమృత్,ఏఐఐబీ ప్రాజెక్ట్ పనులకు ప్రథమ ప్రాధాన్యత
- వంద రోజుల్లో కొత్తగా మరో 63 అన్న క్యాంటీన్లు
- బడ్జెట్ డిమాండ్స్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మంత్రి నారాయణ

అమరావతి: రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల తాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం మంత్రి నారాయణ అన్నారు. టిడ్కో ఇళ్ల ను పూర్తి చేయడంతో పాటు తాగునీటి ప్రాజెక్ట్ లకు సంబంధించిన అమృత్ స్కీం,ఏఐఐబీ ప్రాజెక్ట్ లకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.శాసనసభలో సాధారణ బడ్జెట్ డిమాండ్స్ పై చర్చ సందర్భంగా భ్యులు లేవనెత్తిన పలు అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు.

పట్టణ ప్రాంతాల్లో జనాభా రోజురోజుకూ పెరుగుతుందని.. 2001లో 24.2 శాతం జనాభా ఉంటే 2011 నాటికి 29.6 శాతం పెరిగిందన్నారు.భవిష్యత్తులో ఇది 37 నుంచి 38 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు..ప్రస్తుతం రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో కోటీ 50 లక్షల మంది జనాభా నివసిస్తున్నారని...వారికి అన్ని రకాల మౌళిక వసతులు,ఇతర సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

అమృత్ - 1లో మిగిలిపోయిన పనుల పూర్తికి 41 కోట్లను బడ్జెట్ లో కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మరోవైపు 2019 జనవరిలో తాను ఇదే శాఖకు మంత్రిగా ఉన్నప్పుడు ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకు ద్వారా 5 శాతం వడ్డీకి 30 సంవత్సరాలలో తిరిగి చెల్లించేలా 5350 కోట్లు నిధులు ఇచ్చేలా అనుమతులు తీసుకొచ్చినట్లు మంత్రి చెప్పారు...అయితే ఈ నిధులు కూడా గత ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో నిలిచిపోగా...ముఖ్యమంత్రి చంద్రబాబు గారు చొరవ తీసుకుని కేంద్రంతో మాట్లాడి తిరిగి నిధులు తీసుకొచ్చేలా కృషిచేసారన్నారు. ఏఐఐబీ,తో పాటు కేంద్ర ప్రభుత్వ అర్బన్ డెవలప్ మెంట్ ఫండ్ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి నారాయణ సభలో ప్రకటించారు.

పాత కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని మంత్రి తెలిపారు...పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణానికి 4450 కోట్లు అవసరం అవుతాయని...హడ్కో ద్వారా రుణం ఇచ్చేందుకు అంగీకరించినప్పటికీ ఎఫ్ ఆర్ బీఎం పరిమితి వల్ల ఒకేసారి నిధుల విడుదల సాధ్యం కాలేదన్నారు...అయితే విడతల వారీగా అయినా ఈ నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. టిడ్కో ఇళ్లలో 365,430 చదరపు అడుగుల విస్తీర్ణంలో పెండింగ్ లో ఉన్న ఇళ్లను వచ్చే జూన్ 12 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు...టిడ్కో ఇళ్లకు రంగులు మార్చడం కోసం వందల కోట్లు



గత ప్రభుత్వం ఖర్చు పెట్టిందని...అసలు రంగులు ఎందుకు మార్చారో కూడా అర్థం కాలేదన్నారు.ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని అన్నారు..సీఎం చంద్రబాబు కార్పొరేట్ తరహాలో టిడ్కో ఇళ్లకు రంగులు వేయాలని సూచించడంతో ఒక్కో చోట ఒక్కో రంగును ఇళ్లకు వేసామని చెప్పుకొచ్చారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను తిరిగి పునరుద్ధరించినట్లు మంత్రి నారాయణ చెప్పారు.పేదవాడికి కేవలం ఐదు రూపాయిలకే కడుపునిండా నాణ్యమైన అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంటీన్లను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 199 అన్న క్యాంటీన్లలో ప్రతిరోజూ రెండు లక్షల 25 వేల మంది నాణ్యమైన ఆహారం తీసుకుంటున్నారన్నారు. అయితే ఎక్కడైతే అన్న క్యాంటీన్ ఉండదో అలాంటి నియోజకవర్గంలో ఒక అన్న క్యాంటీన్ కూడా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు.వచ్చే వంద రోజుల్లో కొత్తగా మరో 63 అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని అన్నారు.

## కాశిరెడ్డి నాయన ఆశ్రమంపై కసి ఎందుకు?

- అన్నం పెట్టే చేతులను అడ్డుకుంటారా?

**కాశిరెడ్డి నాయన ఆశ్రమం...**

**జ్యోతిక్షేత్రంలో కూల్చివేతలు ....**

**ఆర్తులు అన్నార్తుల ఆర్తనాదాలు ....**

కడప జిల్లాలోని బద్వేలు నియోజకవర్గంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న అవధూత కాశి నాయన సత్రం, జ్యోతి క్షేత్రంలో దశాబ్దాలుగా అన్నదాన సేవలు కొనసాగుతున్నాయి. అన్నదానమే అక్కడ భగవత్స్వరూపం..! అందుకే ఆర్తులకు అన్నార్తులకు ఇంత గూడు ఇచ్చి కడుపునిండా అన్నం పెట్టే అన్నపూర్ణగా ఆ ఆశ్రమాన్ని కొనియాడుతుంటారు.

మరి.. మానవసేవయే మాధవసేవగా కొనసాగుతున్న ఆశ్రమంపై కూల్చివేతలెందుకు?

టైగర్ జోన్ నిబంధనలు కారణమైతే.. నల్లమల అటవీ ప్రాంతంలో అనేక చెంచు పెంటలు... గ్రామాలు... ఆలయాలు... రహదారులు అన్నీ కూడా టైగర్ జోన్ పరిధిలోనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పాలమూరు, కర్నూలు, గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాలలో విస్తరించి ఉన్న నల్లమల అడవుల్లో ..

సలేశ్వరం, మల్లెలతీర్థం, లొద్ది మల్లన్న, వంటి ఏడాదికి ఒక్కసారి మాత్రమే దర్శించుకునే తీర్థాలను పక్కకు పెడితే....,

శ్రీశైలం, అహోబిలం, నెమలి గుండ్ల రంగనాథ స్వామి, వంటి మొదలగు దేవాలయాలను భక్తులు నిత్యం దర్శించుకుంటారు. ఈ ఆలయాలకు వెళ్తున్నప్పుడు దారి పొడవునా టైగర్ జోన్ అభయారణ్యం హెచ్చరికలు వినిపిస్తుంటాయి. అంటే టైగర్ జోన్ లోనే వేల కిలోమీటర్ల రహదారులు విస్తరించి ఉన్నాయి కదా!? నిత్యం రాకపోకలు జరుగుతూనే ఉన్నాయి కదా!?

మరి.. 25 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఒక్క కాశిరెడ్డి



కాశిరెడ్డినాయనతో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి

నాయన ఆశ్రమం మాత్రమే టైగర్ జోన్ అది కిందికి వస్తుందని కూల్చివేతలు జరపడం వెనక మర్మమేమిటి ?

జీవ కారుణ్యం కోసమే కూల్చివేతలు జరిగితే, ఎన్ని దేవాలయాలు.... ఎన్ని రహదారులు....ఎన్ని చెంచు పెంటలు.... తొలగింపబడాలి? జీవకారుణ్యంలో పశుపక్షాదులతో పాటుగా అనాథలు కూడా ఉండటం మానవీయ ధర్మం...! మరి ఈ ధర్మం కాశీరెడ్డి నాయన ఆశ్రమంలో ఎందుకు కాలరాయబడుతున్నది?

ఎండోమెంట్ పరిధిలో ఉన్న ప్రాచీన లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో దాదాపు 25ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాశీనాయన సత్రం, ఆలయం, టైగర్ జోన్ పరిధిలో ఉందంటూ గతంలో అటవీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పార్లమెంటు సభ్యులు అవినాష్ రెడ్డి అధికారులకు నచ్చ చెప్పి, క్షేత్రంకోసం అటవీభూమి ఎంత ఉపయోగించుకున్నారో, అంతకు రెండింతలు ప్రైవేటు భూమి టైగర్ జోన్ కిందికి అప్ప జెప్పాలని రాజీ చేసుకున్నారు.

ఇదిలా ఉండగా తాజాగా నేషనల్ గ్రీన్ ట్రిబునల్ నుండి ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో ఖాళీ చేయించడానికి వచ్చిన ఫారెస్ట్ అధికారులను.. స్థానిక గ్రామల ప్రజలు, భక్తులు పెద్దఎత్తున అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఇది పరిస్థితి.

దయచేసి ఈ క్షేత్రంపై వివక్ష వద్దు...

కక్ష అంతకన్నా వద్దు....

అనాథలు ఎందరో అక్కడ ఆవాసం ఉంటున్నారు. దయచేసి వారి గోడు వినండి...గూడు చెదర నివ్వకండి.

కాశిరెడ్డి నాయన రెడ్ల కుటుంబంలో పుట్టినప్పటికీ ఆయనకు కులం మతం ప్రాంతం లేదు. అందరూ సమానమే!

నేను దేవుడు కాదు, నన్ను మొక్క వద్దు, మానవ సేవ చేసుకోండి అని కాశిరెడ్డి నాయన నిత్యం చెప్పేవాడు. అయినా భక్తులు వినిపించుకోలేదు.

మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి మొదలుకొని ఎందరో రాజకీయ నాయకులు కాశిరెడ్డి నాయన భక్తులు.

## ఉక్కు పరిశ్రమ రంగంలో స్థిరమైన అభివృద్ధికి ప్రణాళికలు

- పునరుద్ధరించిన ఎస్ఆర్టీఎంఐ వెబ్-పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ
- ఢిల్లీ వేదికగా ప్రోత్సాహకులకు ఆహ్వానం పలికిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ఢిల్లీ: ముడి ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలో భారతదేశం రెండవ అతిపెద్ద దేశంగా అవతరించడం ఆనందంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో బుధవారం నిర్వహించిన నూతన స్టీల్ సెక్టార్‌లో పరిశోధన మరియు అభివృద్ధి (R&D), స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఆర్టీఎంఐ) వెబ్-పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ (SteelCollab) ప్లాట్ ఫారమ్ ను కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ స్టీల్ పరిశ్రమ రంగంలో సాధించిన అభివృద్ధి గురించి చర్చించడం ఆనందంగా ఉందని అన్నారు. నూతన స్టీల్ సెక్టార్‌లో పరిశోధన మరియు అభివృద్ధి (R&D), స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఆర్టీఎంఐ) వెబ్-పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ (SteelCollab) ప్లాట్ ఫారమ్‌ను విజయవంతంగా ప్రారంభించడం ద్వారా ఉక్కు తయారీలో నూతన ఆవిష్కరణలు, స్థిరత్వం, సాంకేతిక పురోగతిని ప్రోత్సహించడానికి ప్రధాన మోదీ




నాయకత్వంలో బలమైన పునాదిని వేశామని పేర్కొన్నారు.

2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఉక్కు డిమాండ్ వృద్ధి GDP వృద్ధిని అధిగమించిందని, ఇది ఆర్థిక అభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు.స్టీల్ రంగ వృద్ధిలో స్థిరత్వాన్ని సాధించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కింద ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలు ఈ రంగం అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ఎస్ఆర్టీఎంఐ వెబ్ సైట్ ద్వారా ఆసక్తిగల వాటాదారులను, ఈ రంగం అభివృద్ధికి సహకరించడానికి ఆహ్వానిస్తున్నట్టు, నూతనంగా ప్రారంభించిన మూడు ఆర్ అండ్ డి పథకాలు స్టీల్ రంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు.

పరిశ్రమ నాయకులు, విద్యా నిపుణులు, టెక్నాలజీ ప్రొవైడర్లు, స్టార్టప్‌లు వంటి వాటాదారులంతా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్టీల్ పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్, విద్యారంగం ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, మార్చి 2025



# మదనపల్లి ఫైళ్ల దహనంలో
# పెద్దిరెడ్డి అనుచరుల హస్తం!

- నిజాల్ని చెరపలేరు
- సీఐడీ దర్యాప్తు పూర్తికాగనే చర్యలు
- సీబీఐ దర్యాప్తులో విశాఖ ఓడరేవుకు కంటైనర్ల ద్వారా డ్రగ్స్ కేసు
- హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

**అమరావతి, మహానాడు:**

మదనపల్లి ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల హస్తం ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సబ్ కలెక్టక్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి కీలక ఫైళ్లను దగ్ధం చేసిన కేసులో ఇప్పటికే ఆర్డీవో మురళీ, కొత్త ఆర్డీవో హరిప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌పై ప్రాథమిక విచారణ అనంతరం సస్పెండ్ చేసినట్టు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ నేతృత్వంలో వేగంగా దర్యాప్తు జరుగుతుందన్నారు. శాసన మండలిలో ఎంఎల్సీలు తిరుమలనాయుడు, దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్ బాబు అడిగిన ప్రశ్నకు హోంమంత్రి బదులిచ్చారు. ఇప్పటికే జూనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ సహా మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులైన పీఏ తుకారం, మాధవ్ రెడ్డి తదితరులను ఏ1,ఏ2,ఏ3గా పేర్కొంటూ విచారణ జరుగుతుందన్నారు. పాత ఆర్డీవో మురళీ నేతృత్వంలో అసైన్డ్ ల్యాండ్ 79,107 ఎకరాలను ఫ్రీ హోల్డ్ కింద 22ఏ రికార్డుల నుంచి బయటకి విడుదల చేసినట్టు తెలిపారు. సబ్ కలెక్టర్ స్థాయిలో పునర్విచారణ నేపథ్యంలో 22,523 ఎకరాల భూమి విషయంలో నిబంధనలు అతిక్రమించినట్టు తేలిందన్నారు. దీనిపై ప్రాథమిక నివేదిక వచ్చిందని అధికారిక నివేదిక కూడా రావాల్సి ఉందన్నారు.



అగ్ని ప్రమాదం వెనుక దాగి ఉన్న అసలు కుట్రలను కూటమి ప్రభుత్వం బయటపెట్టిందన్నారు. అక్రమంగా భూమిని ఆక్రమించాలనుకుని నిబంధనలను అతిక్రమించిన పెద్దిరెడ్డి అండ్ కో కుట్ర వల్లే అగ్నిప్రమాదం జరిగిందన్నారు. మదనపల్లి ఆర్డీవో ఆఫీస్ లో ఫైళ్లను దగ్ధం చేయగలరేమోగానీ నిజాల్ని చెరపలేరని హోంమంత్రి అన్నారు. తప్పు చేసిన వారిని, అందుకు సహకరించిన వారిని వదలబోమని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి పేర్కొన్నారు.

2024లో విశాఖపట్నం ఓడరేవుకు కంటైనర్ల ద్వారా భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు రావడంపై ఎంఎల్‌సీలు డాక్టర్ కుంభ రవిబాబు, వరుదు కల్యాణి, చంద్రగిరి యేసురత్నం శాసనమండలిలో ప్రశ్నించారు. విశాఖపట్నం ఓడరేవుకు కంటైనర్ల ద్వారా భారీమొత్తంలో మాదకద్రవ్యాలు దొరికిన కేసు కూడా సీబీఐ పరిధిలో ఉందని హోంమంత్రి అనిత సమాధానమిచ్చారు.

# కార్మికుల భద్రతతోనే 'స్వర్ణాంధ్రప్రదేశ్'

- యజమానుల చేతిల్లో కార్మికుల ప్రాణాలు
- భద్రతా నియమాలు సరళ భాష రాసి, ప్రదర్శించాలి
- విజయవాడలో ఘనంగా 54వ జాతీయ భద్రత వారోత్సవాలు
- జండాను ఆవిష్కరించి వారోత్సవాలు ప్రారంభించిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్

**విజయవాడ, మహానాడు:** ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో మంగళవారం 54వ జాతీయ భద్రత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. రైల్వే కమ్యూనిటీ హాల్ లో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యంగా 54 వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని కార్మికులతో పాటు సామాన్య ప్రజానీకంలో కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే మహత్తరమైన బాధ్యతను తమపై వేసుకుని ఈ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించడానికి ముందుకొచ్చిన కొండపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ వారికి, అన్ని విధాల వారికి సహకరించిన కార్మిక శాఖ అధికారులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. అందరికీ భద్రత పైన అవగాహన కల్పించే ఉద్దేశంతోనే ఈ భద్రతా వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

ఈ వారోత్సవాలలో భాగంగా కేవలం కార్మికులకే కాకుండా సామాన్య ప్రజానీకానికి, విద్యార్థులందరికీ కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాం. పోటీల్లో గెలుపొందిన వారందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. 54వ జాతీయ భద్రత వారోత్సవాలు సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ కృషియల్ ఫర్ వికసిత్ భారత్ 2047 అనే నినాదం తో ప్రారంభించాం. అంటే కార్మికులు భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుంది. కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం అవుతుంది అనే స్పష్టమైన సందేశం ఇందులో ఇమిడి ఉందన్నారు. ఈ కలను నిజం చేసే బాధ్యత యాజమాన్యాల పైన కార్మికుల పైన అధికారులందరి పైన ఉందన్నారు. అయితే యాజమాన్యాలు మరింత బాధ్యత తీసుకోవాలని, కార్మికుడు మీ పరిశ్రమలో అడుగు పెట్టినప్పటి నుంచి అతడి ప్రాణం మీ చేతిలో ఉన్నట్టేనని చెప్పారు. అందుకే రోజు తప్పకుండా భద్రతా ప్రతిజ్ఞను పాటించి దానిపైన అవగాహన కలిగించాలన్నారు. అలాగే భద్రత నియమాలని చాలా సరళమైన భాషలో కార్మికులందరికీ అర్థమయ్యేలా స్థానిక భాషలలో రూపొందించాలన్నారు.

రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులందరికీ రసాయనాల పట్ల, వాటి వలన జరిగే ప్రమాదాల పట్ల శిక్షణా తరగతులను నిర్వహించాలనీ, స్మోక్ అలారం, వంటి ప్రమాదాల్ని ముందుగానే పసిగట్టి నివారించేటట్టు టెక్నాలజీని వాడుకోవాలన్నారు. అయితే, ఇందులో కార్మికుల పాత్ర చాలా కీలకమన్నారు. అందులో కార్మికులందరూ తప్పనిసరిగా సేఫ్టీ కిడ్స్ వేసుకునే పని ప్రాంతాల్లో తిరగాలి. నాకు ఒక కార్మికుడు హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు ఊడిపోతుంది అని చెప్పి పెట్టుకోవడం లేదని సమాధానం చెప్పారన్నారు. జుట్టు కన్నా ప్రాణం గొప్పదని తెలుసుకోవాలన్నారు. మీరు అశ్రద్ధగా ఉంటే మీతో పాటు చుట్టుపక్కల కార్మికుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలుసుకోవాలన్నారు.

మీరు క్షేమంగా తిరిగి రావాలని మీ కుటుంబం మీ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తుందన్న విషయాన్ని మీరు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని మంత్రి గుర్తు చేశారు. మొన్న ఒక పరిశ్రమంలోని ప్రమాదం జరిగినప్పుడు ప్రమాదం జరుగుతున్న ప్రాంతాన్ని మిగతా కార్మికులంతా సెల్ఫీ తీసుకోవడం నా దృష్టికి వచ్చిందని, ప్రాణాలతో చెలగాటం ఆడే ఇలాంటి సరదాలు చేయకూడదని కార్మికులకు హితవు పలికారు.




ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వం కొన్ని కీలక బాధ్యతలు తీసుకుంటుందని దానిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి సలహాలు ఇవ్వడానికి వసుధ మిశ్రా నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆ కమిటీ రిపోర్ట్ ఒక నెలలో వస్తుందని, ఆ కమిటీ రిపోర్ట్ ఆధారంగా అన్ని భద్రతా చర్యలను తూచా తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

యాజమాన్యాలు, కార్మికులు, ప్రభుత్వ యంత్రాంగం ,కలిసి జీరో యాక్సిడెంట్స్ అనే నినాదంతోనే ముందుకు వెళ్లాల్సిందిగా మంత్రి కోరారు. కార్మికలోకపు కల్యాణానికి శ్రామికలోకపు సౌభాగ్యానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ మంత్రి వాసంశెట్టి ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీతోపాటు కొండపల్లి ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, అసోసియేట్ ప్రతినిధి రామచంద్రరావు, రామ్స్ ప్లాంట్ హెడ్ ఆశిష్ కుమార్, కెసిపి ప్లాంట్ హెడ్ మధుసూదన్ రావు, జాయింట్ చీఫ్ ఆఫ్ ఇన్స్పెక్టర్ మోహన్ రావు, ఉషశ్రీ, డిసిఐపి శివ కుమార్ రెడ్డి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా సమైక్యత వాక్

అంతకుముందు ఉదయం విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్‌లో విద్యార్థులు కార్మికులతో కలిసి సమైక్యత నడక కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం మాక్ నిర్వహించి మంత్రికి వందనాలు తెలిపారు. ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి సంతోషం వ్యక్తం చేస్తూ కార్మికులను విద్యార్థులను అభినందించారు అనంతరం వారితో కలిసి ఫలహారం కార్యక్రమంలో పాల్గొని వారితో మాట్లాడుతూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం రైల్వే కమిటీ హాల్లో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
07
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 13, మార్చి 2025 ‖

## వైఎస్సార్ సీపీ యువత పోరు విజయవంతం



- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విశేష స్పందన
- వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

**తాడేపల్లి, మహానాడు:** విద్యార్థులు, యువత పట్ల కూటమి ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యధోరణిని ప్రశ్నిస్తూ వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరు' విజయవంతం అయ్యిందని వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు ఈ ఆందోళనల్లో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారని వెల్లడించారు. వైయస్ఆర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం అయినప్పటికీ పార్టీ ఆధ్వర్యంలో మొద్దు నిద్రలో ఉన్న పాలకుల కళ్ళు తెరిపించేలా చేపట్టిన ఈ కార్యక్రమం కూటమి సర్కార్ గుండెల్లో దడ పుట్టిం చిందని అన్నారు. ఇంకా ఏమన్నారంటే..పార్టీ ఆవిర్భావ దినోత్సవం అయిన ప్పటికీ విద్యార్థులు యువత సమస్యలపై దృష్టి సారించి ప్రభుత్వంపైన పోరాటానికి ముందడుగేశాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల్లోనూ నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి స్వచ్ఛందంగా యువత తరలిరావడం చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. 9 నెలల్లోనే ఈ ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్రమైన తిరుగు బాటును ఈ ప్రభుత్వం ఎదుర్కొంటోంది. కూటమి పార్టీలు మేనిఫెస్టోలో చేర్చిన హామీలకు కనీస గౌరవం ఇవ్వడం లేదు.

ఈ రాష్ట్రంలోని విద్యార్థులు, యువతను ప్రభుత్వం గాలికొదిలేసింది. పేదరికంతో విద్యార్థులు చదువులకు దూరమైపోతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోంది.



## ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలి

- గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదు
- అబద్ధాలనే మళ్లీ అందమైన భాషలో చెప్పే ప్రయత్నం చేశారు
- మహిళలకు 2500 ఇవ్వకుండానే మహాలక్ష్మి పథకం గేమ్‌చేంజర్ అనడం సిగ్గుచేటు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలని, హామీల అమలుపై బాధ్యత తీసుకోని సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా? అని నిలదీశారు. గాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారెంటీలను చూసే ప్రజలు ఓట్లు వేశారని, స్థానిక కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు ఓట్లు వేయలేదని, కాబట్టి బాధ్యత తీసుకొని గాంధీ కుటుంబం తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

గవర్నర్ ప్రసంగంపై స్పందిస్తూ ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని, ఎన్నికల సమయంలో గాంధీ కుటుంబం వచ్చి ఇచ్చిన హామీల అమలుపై ప్రస్తావనే లేదని విమర్శించారు. అబద్ధాలనే మళ్లీ అందమైన భాషలో చెప్పే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఎండగడుతామని స్పష్టం చేశారు. రూ. లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదని, దీని మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలకు నెలకు రూ 2500 ఇస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, ఈ హామీని అమలు చేయకుండానే మహాలక్ష్మీ పథకం గేమ్ చెంజర్ అని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రాన్ని వెనక్కి నడిపిస్తూ పురోగమిస్తుందని శుద్ధ అబద్ధాలు చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరు తనానికి అద్దంపడుతోందని తీవ్రంగా విమర్శించారు.
రైతులకు సంపూర్ణంగా రుణ మాఫీ, రైతు భరోసా అమలు చేయకుండానే గొప్పగా అమలు చేశామని చెప్పుకోవడం దారుణమని, ఇది ప్రభుత్వ అసమర్థతను తేటతెల్లం చేస్తున్నదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

## విద్యావ్యవస్థలో గౌరవింపబడే వృత్తి
# ఆచార్య దేవోభవ

- రవీంద్ర భారతిలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్:** తల్లిదండ్రులతో సమానంగా మాతృదేవో భవన్ పితృదేవో భవన్ ఆచార్య దేవోభవ అని అధ్యాపక వృత్తిలో చేరుతున్న మీ అందరికీ తెలంగాణ ప్రభుత్వం పక్షాన అభినందనలు.ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజా పాలనకు నాయకత్వం వహించి ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నారు.



విద్యార్థి నాయకుడిగా మీ ముందు మాట్లాడుతున్న గత పది సంవత్సరాలుగా విద్య వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైంది. నియామకాలు లేక కనీసం యూనివర్సిటీలకు వైస్ ఛాన్స్ లర్ లను నియమించలేని పరిస్థితి నుండి మీ అందరి ఆశీర్వాదంతో ఏర్పడిన ఈ ప్రభుత్వం అనేక సమస్యలను తొలగించింది.మొదటగా అధ్యాపక వర్గానికి అసహనాన్ని తొలగించి ప్రమోషన్లు , వారికి సంబంధించిన బదిలీలు చేపట్టి విద్యావ్యవస్థ లో ప్రాథమిక స్థాయిలో నుండి మార్పులు చేపట్టాం.
వైస్ ఛాన్సలర్ లా నియామకం ప్రొఫెసర్ ల వయస్సు పెంచడం ,ప్రభుత్వ కాలేజి ల బలోపేతం చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల విద్యా వ్యవస్థ బాగుండాలని అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించడం.హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ మెస్ ఛార్జీలు పెంచాం. 55 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ లకి 200 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు.

ఈ పవిత్రమైన వస్తున్న అధ్యాపక వర్గానికి ప్రభుత్వ సంకల్పాన్ని ఆలోచించి భవిష్యత్తులో ప్రభుత్వ సంస్థల్లో చదువుకుంటే గౌరవం అనే విధంగా నియామక పత్రాలు పొందుతున్న మీ అందరికీ శుభాకాంక్షలు.

## ఢిల్లీలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకి తప్పిన పెను ప్రమాదం!



- లోక్‌సభ సమావేశానికి హాజరై తిరిగి వెళుతుండగా మంత్రి కారును ఢీకొట్టిన మరో కారు

**ఢిల్లీ:** కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ సమావేశానికి హాజరైన అనంతరం భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యాలయానికి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వెళుతుండగా విజయ్ చౌక్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న మరో కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస వర్మ కాలికి తీవ్ర గాయమైంది. కేంద్ర మంత్రి కార్యాలయంలో వైద్య బృందం శ్రీనివాస వర్మ కు ప్రత్యేక చికిత్స అందించారు. కాలికి బలమైన గాయం కావడం వల్ల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అయితే, నరసాపురం పార్లమెంట్ పరిధిలో గురువారం పలు కార్యక్రమాల్లో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పాల్గొనవలసి ఉండటంతో ఢిల్లీ నుంచి భీమవరానికి ఆయన బయలుదేరారు.

## వైసీపీ రూ. 4,271 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్
# బకాయిలు ఎందుకు పెట్టింది?

- ఈ ప్రశ్నకు జగనే సమాధానం చెప్పాలి
- బకాయిలు పెట్టింది వైసీపీయే... ధర్నా చేస్తుందీ వైసీపీయే
- ఫీజు పోరు అని పేరు పెట్టి.. యువత పోరుగా మార్చారు
- అసలు ఏ అంశంపై పోరాడుతున్నారో వైసీపీకే స్పష్టత లేదు
- శాసన మండలిలో నారా లోకేష్ ధ్వజం



**అమరావతి, మహానాడు:** వైసీపీనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి.. ఇప్పుడు వారే ధర్నాలు చేస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మండిపడ్డారు. శాసన మండలిలో ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లింపుల అంశంపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానానికి పట్టుబట్టారు. మండలి ఛైర్మన్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ అన్ని విషయాలపై చర్చకు సిద్ధం. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, ఉద్యోగాలు, ఉపాధి కల్పనపైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వ బకాయిలపైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఫీజు పోరు అని పేరు పెట్టి.. యువత పోరుగా పేరు మార్చడం వింతంగా ఉంది. బయట నవ్వుకుంటున్నారు. ఏ విషయంపై పోరాడుతున్నారో వైసీపీకి స్పష్టత లేదు. ఒక పెద్దాయన నాతో చెప్పాడు. ఓ వ్యక్తిని హిందూపూర్ కోర్టుకు తీసుకెళ్లగా జడ్జి ముందు బోరున ఏడ్చాడు. నాకు తల్లిదండ్రులు లేరు, నాకు అన్యాయం జరుగుతోంది, నన్ను క్షమించండి అని వేడుకున్నాడు. ఎందుకు అమాయకుడిని తీసుకువచ్చి ఇబ్బందులు పెడుతున్నారని జడ్జి పోలీసులను అడిగారు. అప్పుడు తల్లిదండ్రులను చంపింది ఇతనే అని పోలీసులు చెబుతారు. జగన్ రెడ్డి తీరు కూడా ఇదేవిధంగా ఉంది. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వారే పెట్టి.. వారే ధర్నాలు చేస్తారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.4,271 కోట్లు పెట్టి వారే ధర్నా చేస్తారు. కరెంట్ ఛార్జీలు వారే పెంచి వారే ధర్నా చేస్తారు. ఎందుకు ఫీజు రీయింబర్స్ మెంట్ రూ. 4,271 కోట్లు బకాయిలు పెట్టారో సమాధానం చెప్పాలి. దీనిపై చర్చకు సిద్ధం. స్వల్పకాలిక చర్చ కూడా ఉంది. అన్ని అంశాలు చర్చిద్దాం. వైసీపీ హయాంలో ఎన్ని ఉద్యోగాలు పోయాయో చర్చిద్దామన్నారు. వైసీపీ సభ్యులు నిరసనకు దిగడంతో మండలి ఛైర్మన్ సభను పది నిమిషాల పాటు వాయిదా వేశారు.



## ఫీజు బకాయిలు అతి త్వరలోనే చెల్లిస్తాం

- మంత్రి లోకేష్

**అమరావతి, మహానాడు:** ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని కొన్ని కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నట్టు పట్టభద్రుల ఎమ్మెల్సీలు నా దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.788 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాం. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో నేను జరిపిన చర్చల్లో భాగంగా వైసీపీ ప్రభుత్వం పెట్టిన రూ.4271 కోట్లు బకాయిలు కూడా విడతల వారీగా చెల్లిస్తామని చెప్పాను. నా ప్రతిపాదనకు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అంగీకరించాయి. గత ప్రభుత్వ విధానాన్ని మార్చి ఇప్పుడు ఫీజులు నేరుగా కళాశాలలకే చెల్లిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన ఫీజు బకాయిలు అతి త్వరలోనే చెల్లిస్తాం. ఒక వేళ ఏదైనా కళాశాల యాజమాన్యం విద్యార్థుల పై ఒత్తిడి చేస్తే తల్లిదండ్రులు నేరుగా నా దృష్టికి తీసుకురండి. ఒత్తిడి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. తల్లితండ్రులు, విద్యార్థుల పై ఎటువంటి ఒత్తిడి లేకుండా చేయాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# పెద్ది రెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అనుచరుల భూ కబ్జా!

- టీడీపీకి ఓట్లు వేశారని వికలాంగుడి పింఛన్ తొలగించిన వైసీపీ నేతలు
- సెప్టిక్ ట్యాంక్‌తో వ్యాధులు వస్తున్నాయంటూ మహిళలు ఫిర్యాదు
- వినతులు స్వీకరించి అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్





**మంగళగిరి, మహానాడు:** అన్నమయ్య జిల్లా, కురబలకోటకు చెందిన బి.వి.ప్రసన్నకుమార్ బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో నేతలకు వినతి పత్రం ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని పెద్ది రెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అనుచరులు పూడు వెంకట శిద్దులు, పూడు నరసింహులు మరికొందరులు అక్రమంగా ఆన్ లైన్ చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులతో విచారించి తమకు న్యాయం చేయాలని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ లకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

- అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏటిపాక మండలం లక్ష్మీదేవి గ్రామానికి చెందిన కొర్సా చిట్టెమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన పెదనాన్న ద్వారా తనకు సంక్రమించిన భూమిని అగ్రకులాల వారు ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నారని.. దయ చేసి తమ భూమిని సర్వే చేసి హద్దులు చూపాలని కోరారు.
- ఏలూరు జిల్లా, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు చెందిన రైతులు విజ్ఞప్తి చేస్తూ.. 2017 లో పోలవరం ప్రాజెక్ట్ ముంపు భూముల్లో భాగంగా సర్వే చేసి పరిహార రివార్డ్ ప్రకటించారని.. కాని ఇంతవరకు తమకు పరిహారం



ఇవ్వలేదని.. తమకు పరిహారం ఇస్తే నిర్వాసిత కాలనీలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని.. కుంజా అప్పారావు తదితరులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- గత సర్పంచ్ ఎన్నికల్లో తమ కుటుంబం టీడీపీకి ఓట్లు వేసిందన్న కక్ష గట్టి దాదాపు పది సంవత్సరాల నుండి వస్తున్న పింఛన్ ను వైసీపీ నేతలు తొలగించారని.. దయ చేసి తనకు వికలాంగ పింఛన్ ను పునరుద్ధరించాలని సత్యసాయి జిల్లాకు చెందిన బి. అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.
- కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం గోరంట గ్రామానికి చెందిన రామశెట్టి లక్ష్మణరావు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. తమ భార్యాభార్తల మధ్య గొడవలు ఉండగా.. దాన్ని పరిష్కరిస్తామని చెప్పి పాస్టర్ జోషప్ రాజప్రసాద్ రూ. 25 లక్షలు విలువ చేసే బంగారాన్ని తీసుకొని ఇవ్వకపోవడమే కాకుండా.. తనను చంపేందుకు యత్నిస్తున్నారని.. అతనిపై చర్యలు తీసుకొని తన బంగారం తనకు ఇప్పించాలని ఫిర్యాదు చేశాడు.
- 2019న మే 15న తన ఇంట్లో దొంగలు పడి బంగారం, డబ్బులు కొట్టేశారని.. దీనిపై ఫిర్యాదు చేసినా ఎమైందో ఇప్పటికీ తెలియలేదని... అధికారులు త్వరగా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని తిరుపతి జిల్లా, పెరుమాళ్లపల్లి పంచాయతీ గాంధీపురం గ్రామానికి చెందిన ఎస్. పుష్ప గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా, అడ్డతీగల మండలం భీముడు పాకల గ్రామానికి చెందిన నక్కా వరలక్ష్మి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రికి ప్రభుత్వం ఇచ్చిన డి పట్టా భూమిని కబ్జాదారులు ఆక్రమించుకున్నారని.. వారిపై చర్యలు తీసుకొని తనకు భూమిని అప్పగించాలని వేడుకున్నారు.
- ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రామలింగేశ్వర్ నగర్ కు చెందిన పలువురు మహిళలు విజ్ఞప్తి చేస్తూ.. తమ ప్రాంతంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ ను సక్రమంగా నిర్వహించకపోవడంతో తీవ్ర దుర్వాసనతో తాము ఇబ్బంది పడుతున్నామని.. అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

# మళ్లీ వచ్చేది మనమే...

- వైయస్సార్‌సీపీ ఎప్పుడు కూడా ప్రజలకు తోడు
- ప్రజల తరపున ఎప్పుడూ గొంతుకై వారికి అండ
- వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ

**తాడేపల్లి, మహానాడు:** వైయస్సార్‌సీపీ స్థాపించి 15 ఏళ్లు అవుతోంది. 14 ఏళ్ల వైయస్సార్‌సీపీ ప్రయాణంలో మొదటి రోజు నుంచి.. ఈ పార్టీ పుట్టింది కష్టాల్లో నుంచి.. ప్రజల కష్టాలను వైయస్సార్‌సీపీ తమ కష్టాలుగా భావించి, ప్రజల తరపున వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్ కింద ప్రతి అడుగులోనూ పోరాటం చేస్తూ వస్తోంది. ఈరోజు ప్రతిపక్షంలో కూర్చోవడం కొత్త కాదు. ఈ 15 ఏళ్ల

మన ప్రయాణంలో 10 ఏళ్లు మనం ప్రతిపక్షంలోనే ఉన్నాం. అధికార పక్షానికి దీటైన సమాధానం ఇస్తూనే వస్తున్నామని వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇక్కడి వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జగన్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు.

కళ్లు మూసి తెరిచే సరికే ఇప్పటికే దాదాపు సంవత్సరం అయిపోయింది. మరో మూడు, నాలుగు సంవత్సరాల్లో మళ్లీ ఈసారి వచ్చేది వైయస్సార్‌సీపీనే. వైయస్సార్‌సీపీకి చెందిన ప్రతి కార్యకర్త కూడా గ్రామంలోని ఏ ఇంటికైనా ధైర్యంగా వెళ్లగలడు. ఏ పేద ఇంటికైనా వైయస్సార్‌సీపీ కార్యకర్త సగర్వంగా, కాలర్ ఎగరేసుకుని వెళ్లగలిగే అవకాశం ఉంది. ఆ కార్యకర్తను చూసినప్పుడు ఆ ఇంటిలోని ప్రతి అక్క, ప్రతి చెల్లి, ప్రతి సోదరుడు, ప్రతి అవ్వ, తాత, ప్రతి రైతు చక్కని చిరునవ్వుతో వైయస్సార్‌సీపీ కార్యకర్తను పలకరిస్తారు. ఎందుకంటే వైయస్సార్‌సీపీ ఎప్పుడైనా కూడా చెప్పిందంటే చేస్తుందన్న నమ్మకం ప్రతి ఇంట్లో కూడా ఉంది కాబట్టి అని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే..

విద్యాదీవెన, వసతిదీవెనకు సంబంధించి, పిల్లలకు జరుగుతున్న అన్యాయాలకు సంబంధించి నిరసన కార్యక్రమం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 10 నెలలు అవుతోంది. ఈ 10 నెలల కాలంలో, ఎన్నికల వేళ వాళ్లు చెప్పిన సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ గాలికెగిరిపోయాయి. వ్యవస్థలన్నీ కూడా చదువులు కానీ, వైద్యం కానీ, గవర్నెన్స్ కానీ, వ్యవసాయం కానీ.. ఏది చూసినా కూడా వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయి. అదే పరిస్థితి కనిపిస్తోంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి, ఒక్కొక్క క్వార్టర్‌కు రూ.700 కోట్ల చొప్పున, విద్యాదీవెన కింద ఏడాదికి నాలుగు క్వార్టర్లకు రూ.2800 కోట్లు కేటాయించాలి. వసతి దీవెన కింద ప్రతి ఏడాది ఏప్రిల్‌లో రూ.1100 కోట్లు కేటాయించాలి. అంటే గత ఏడాది ఈ రెండింటికి సంబంధించి పిల్లల చదువుల కోసం మొత్తం రూ.3900 కోట్లు కేటాయించాల్సిన పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం చేసింది ఏమిటంటే కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్న పరిస్థితి. అంటే రూ.3200 కోట్లు బకాయిలు పెండింగ్‌లో పెట్టారు.

అదే విధంగా ఈ ఏడాది 2025-26కు సంబంధించి చూస్తే, విద్యాదీవెన కింద రూ.2800 కోట్లు, వసతి దీవెన కింద మరో



రూ.1100 కోట్లు. మొత్తం మరో రూ.3900 కోట్లు. అంటే ఈ మొత్తం, గత ఏడాది పెట్టిన బకాయి రూ.3200 కోట్లు. అన్నీ కలిపి మొత్తం దాదాపు రూ.7100 కోట్లు కేటాయించి, పిల్లలను ఆదుకోవాల్సింది పోయి, కేవలం రూ.2600 కోట్లు మాత్రమే నామమాత్రంగా కేటాయించి, పిల్లల చదువులతో ఆడుకుంటున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే కార్యక్రమం పిల్లలు, వారి తల్లి దండ్రులతో కలిసి చేసే కార్యక్రమం కూడా, యాదృచ్ఛికంగా ఈరోజు జరుగుతోందని చెప్పడానికి సంతోషిస్తున్నాను.

మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ పార్వతి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి, ఇంకా పలువురు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

08

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, మార్చి 2025 ||

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ క్రీడాకారులకు సీఎస్ ఘన సత్కారం



**అమరావతి, మహానాడు:** గుజరాత్, గాంధీనగర్‌లో ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ టోర్నమెంట్లో పాడేరు మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సాయి శ్రీ పాల్గొని 50, 100 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈవెంట్లలో జాతీయ స్థాయిలో కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

అలాగే, బి. రాముడు, జూనియర్ అనలిస్ట్, విజయవాడ, ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ యోగా పోటీల్లో మూడో స్థానం సాధించి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీలు ఈ నెల 5 నుండి 8 వరకు చండీగఢ్‌లో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏ. వేరే శేఖర్ (మాజీ స్పోర్ట్స్ సెక్రటరీ), ఆనందరావు (జనరల్ సెక్రటరీ, క్యాంటీన్ కోఆపరేటివ్), డాక్టర్ డి. యుగంధర్, కృష్ణమోహన్ (టిటి ప్లేయర్), మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చించుకుందాం... కలిసికట్టుగా

# ‘ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్’ ప్రపంచానికి పరిచయం చేద్దాం!

- విద్యాశాఖ భారం కాదు.. నా బాధ్యత
- లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) మోడల్ తీసుకువస్తాం
- విద్యావ్యవస్థలో సంస్కరణలకు అందరం బాధ్యత తీసుకోవాలి
- పదేళ్లలో జరగని సంస్కరణలు 9 నెలల్లోనే చేపట్టాం
- గడచిన ఐదేళ్లలో 12 లక్షల మంది పాఠశాలలకు దూరమయ్యారు
- ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తాం
- వైసీపీ హయాంలో రూ.4,271 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లిస్తాం
- విద్యారంగంలో సంస్కరణలపై శాసనమండలిలో జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి నారా లోకేష్

**అమరావతి, మహానాడు:**

కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను ప్రపంచానికి పరిచయం చేద్దామని, విద్యాశాఖ భారం కాదు.. తన బాధ్యత అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విద్యారంగంలో సంస్కరణలపై మండలిలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విద్యాశాఖ భారం కాదు.. నా బాధ్యత. ముఖ్యమంత్రి ఏ శాఖ కావాలని అడిగినప్పుడు కఠిన శాఖ ఇవ్వాలని కోరాను. అందులో భాగంగా నేనే విద్యాశాఖ కావాలని స్వయంగా అడిగాను. అసమానతలు పోవాలంటే విద్యతోనే సాధ్యం అని చెప్పాను. నేను ఏ బాధ్యతలు తీసుకున్నా.. అసలు ప్రస్తుత పరిస్థితి ఏంటి, ఏం జరుగుతోంది, ఏం మార్పులు చేయాలనేది చూస్తాను. గతంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకున్నప్పుడు.. అది చాలా సులభమైన శాఖ. కష్టమని చాలా మంది చెప్పారు. కానీ ఆ శాఖ చాలా సులభం. డేటా ఉంది. ఆరునెలల్లో డ్యాష్ బోర్డు తయారుచేయించుకుని సులభంగా ట్రాక్ చేశాను.

### ఐదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు

నేను మంత్రి అయిన తర్వాత విద్యాశాఖ అధికారులను అడిగిన మొదటి ప్రశ్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నారని అడిగాను. ఇందుకు ఆరు నెలల సమయం పట్టింది. మళ్లీ ఎవరో రాసిన లెక్కలు చెప్పడం కాదు.. ఆన్ లైన్ లో తెలియాలని చెప్పా. అది చూసిన తర్వాత నిజంగా బాధేసింది. గడచిన ఐదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. ఇది రికార్డ్. పాఠశాల విద్య, జూనియర్ కళాశాలలను కలిపి చెప్పిన లెక్క ఇది. ఇందుకు ప్రధాన కారణం జీవో 117. మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలి. ప్రతిపక్ష నేతలు కూడా ఉంటే బాగుండేది. చర్చ జరగాలి. చర్చ జరిగితేనే వాస్తవాలు బయటకు వస్తాయి. జీవో 117 వల్ల పది మంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు టీడీపీ హయాంలో 1,215 ఉంటే.. వైసీపీ హయాంలో 5,500 పాఠశాలలకు పెరిగాయి. 20 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలు గతంలో 5,520 ఉంటే... అది 13,720కి పెరిగాయి. ఏకోపాధ్యాయ పాఠశాలలు 12,512కి పెరిగాయి. డేటా కోసం ఎందుకు ఇంత సమయం పడుతుందని మీరందరూ అడగవచ్చు. కావాలని రికార్డులను గత ప్రభుత్వం తారుమారు చేసింది. డ్రాప్ బాక్స్ లో లక్షమంది విద్యార్థులను ఉంచారు. వీరంతా 17 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సున్న వారు. ఎన్ రోల్ మెంట్ చూపించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం వాస్తవాలకు దూరంగా పనిచేసింది. దీనివల్ల 12.5 శాతానికి డ్రాప్ అవుట్ రేట్ పెరిగింది.

### వైసీపీ పాలనలో ఫౌండేషన్ న్యూమరసీ స్కిల్స్ పడిపోయాయి

ఎన్ఏఎస్ సర్వే ప్రకారం 2017 నుంచి 2021 వరకు 3వ తరగతి లాంగ్వేజ్ లో టీడీపీ ప్రభుత్వంలో మొదటి స్థానంలో ఉంటే.. 2021కి వచ్చేనాటికి 27వ స్థానానికి పడిపోయాం. పదోతరగతి మ్యాథ్స్ సబ్జెక్టుకు వస్తే.. మనం మొదటి స్థానం నుంచి 12వ స్థానానికి, సైన్స్ మొదటి స్థానం నుంచి 15వ స్థానానికి పడిపోయాం. ఇంగ్లీష్ ఏకంగా 4వ స్థానం నుంచి 14వ స్థానానికి పడిపోయాం. ఏఎస్ఈఆర్ సర్వే ప్రకారం ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠ్యపుస్తకాన్ని 2018లో 57శాతం మంది చదవగా.. అది 37శాతానికి పడిపోయింది. 8వ తరగతి విద్యార్థులు కూడా గతంలో 78 శాతం మంది రెండో తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవగా.. నేడు 53 శాతానికి పడిపోయింది. 90 శాతం మంది మూడో తరగతి విద్యార్థుల్లో ఫౌండేషన్ న్యూమరసీ స్కిల్స్ లేవు.

### సీబీఎస్ఈ విధానంపై కసరత్తు చేయలేదు

మండలిలో నిరసన తెలుపుతూ సీబీఎస్ఈ, టోఫెల్, ఐబీ గురించి మాట్లాడారు. నేను కూడా సీబీఎస్ఈ స్టూడెంట్ నే. ఇందుకు చాలా కసరత్తు అవసరం. గత ప్రభుత్వం ఎలాంటి సన్నద్ధత లేకుండా వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. విద్యార్థులను సన్నద్ధం చేయలేదు. మాక్ టెస్ట్ పెడితే 90 శాతం మంది విద్యార్థులు కనీసం ఒక సబ్జెట్ లో ఫెయిల్ అయ్యారు. అందుకే అందరినీ సన్నద్ధం చేసిన తర్వాతనే సీబీఎస్ఈ విధానానికి వెళ్లాలనేది ప్రభుత్వ లక్ష్యం. టోఫెల్ అమలుచేసేందుకు ఆ సంస్థకు రూ.59 కోట్లు చెల్లించారు. పిల్లలు ఇబ్బంది పడ్డారు. ఐబీ విషయానికి వస్తే మధ్యంతర నివేదికకే రూ.5 కోట్లు వృధా చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా అందరితో చర్చించాల్సిన అవసరం ఉంది.

### అక్రమ కేసులను ఎత్తివేస్తాం

గత ప్రభుత్వం ఉపాధ్యాయులను ఎన్నో రకాలుగా అవమానించింది. ఏకంగా మద్యం షాపుల ముందు కాపలాగా పెట్టారు. ఉపాధ్యాయులు ప్రశ్నిస్తే కేసుల పేరుతో వేధించారు. గతంలో పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. 2022లో 1,570 మంది ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారు. 45 యాప్ లు తీసుకువచ్చారు. దీంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పెట్టారు. టాయిలెట్ క్లీనింగ్ దగ్గర యాప్ తొలగించాం. మిగతా యాప్ ల భారాన్ని తగ్గిస్తాం. సింగిల్ ఫ్లాట్ ఫాం తీసుకువస్తాం.

### పారదర్శకంగా టెండర్లు

పారదర్శకంగా టెండర్లు నిర్వహించాం. ఒక్క స్కూల్ కిట్లలోనే వచ్చే ఐదేళ్లలో 300 కోట్ల రూపాయలు ఆదా చేయనున్నాం. 9.4శాతం ధరలు తగ్గించాం. ఎక్కడా రాజకీయ నేతల ఫోటోలు పెట్టలేదు. ఎవరి సందేశాలు లేవు. మంచి నాణ్యతతో రెండు వైపు ప్రింటింగ్ చేసి స్కూల్ యూనిఫామ్స్ అందిస్తున్నాం. పొలిటికల్ రంగులు ఎక్కడా లేవు. గత ప్రభుత్వం బ్యాగులను కూడా వదిలిపెట్టలేదు. జగన్ రెడ్డి పేరు రాసుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో స్కూల్ కిట్స్ అందజేస్తున్నాం. ఎక్కడా మా పార్టీ రంగులు లేవు. ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలో ఎక్కడా మా ఫోటోలు, రంగులు లేవు. ఎక్కడా రీసైక్లింగ్ అవ్వకూడదని చిక్కీల్లో కేవలం ప్రభుత్వ లోగో పెట్టాం. బెల్ట్‌పై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు ముద్రించాం.

### రాజకీయ నేతల ఫోటోలు లేవు

పుస్తకాల బరువు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నాం. మహారాష్ట్ర వెళ్లి పరిశీలన చేశాం. మొదటి తరగతి ఫస్ట్ సెమ్ కి రెండే రెండు పుస్తకాలు ఇవ్వనున్నాం. సెకెండ్ సెమ్ కు రెండు పుస్తకాలు ఇస్తాం. గతంలో ఎనిమిది పుస్తకాలు ఇచ్చేవారు. వీటిని నాలుగు చేశాం. అన్ని తరగతుల్లో తగ్గించాం. ప్రభుత్వ లోగో తప్ప ఎక్కడా రాజకీయ నేతల ఫోటోలు లేవు. చిక్కీల్లో ఐదేళ్లలో 240 కోట్ల రూపాయలు ఆదా చేస్తున్నాం. కోడిగుడ్ల రవాణలో 144 కోట్ల రూపాయలు ఆదా చేస్తున్నాం. చాలా పారదర్శకంగా చేస్తున్నాం. గత ప్రభుత్వం సుమారు రూ.352 కోట్ల బకాయిలు పెట్టారు. గుడ్లకు రూ.200 కోట్లు, చిక్కీలకు రూ.60 కోట్లు, ఆయా, నైట్ వాచ్ మెన్ లకు రూ.65 కోట్లు, క్లీనింగ్ మెటీరియల్స్ కు 22 కోట్ల రూపాయలు బకాయిలు పెట్టింది. అవన్నీ కూటమి ప్రభుత్వం చెల్లించింది. గత ప్రభుత్వం ట్యాబ్ ల కోసం రూ.1300 కోట్లు వృధా చేసింది. సూపర్ విజన్ తో ప్రభుత్వ పాఠశాలల్లో డెస్క్ టాప్ కంప్యూటర్లు అందజేస్తాం.

### మొదటి ఏడాదిలోనే ఇంటర్‌లో ప్రవేశాలు పెరిగాయి

కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదిలోనే జూనియర్ కాలేజీల్లో 16.61 శాతం ప్రవేశాలు పెరిగాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఉత్తీర్ణత 42శాతం ఉంటే వైసీపీ ప్రభుత్వంలో 30శాతానికి పడిపోయింది. రెండో ఏడాదిలో 58 శాతం ఉంటే.. వైసీపీ హయాంలో 39శాతానికి పడిపోయింది. ఇంటర్ విద్యార్థులకు స్కూల్స్ కిట్స్ ను, మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేశారు. హైస్కూల్ ప్లస్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

### జగన్ రెడ్డి కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలను వీసీలు

ఉన్నత విద్య విషయానికి వస్తే 2014 నుంచి 2019 వరకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో 200 లోపు ర్యాంకుల్లో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు 9 ఉండగా.. నేడు 5కి పడిపోయాయి. 2019లో ఏయూ యూనివర్సిటీ 29వ ర్యాంకులో ఉంటే.. నేడు 41వ ర్యాంకుకు పడిపోయింది. ఎస్వీయూ 72 నుంచి 100-150 మధ్య పడిపోయింది. ఏఎన్ యూ అసలు ర్యాంకింగ్ కు ఎంపిక కాలేదు. 2024లో 97వ స్థానానికి వచ్చింది. జేఎన్టీయూ అనంతపూర్, కాకినాడ, ఎస్కేయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీ లు ర్యాంకింగ్ కు ఎంపిక కాలేదు.



ఇందుకు కారణం జగన్ రెడ్డి, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలను ఏకంగా వీసీలుగా నియమించారు. ఏయూ యూనివర్సిటీ వీసీగా ప్రసాద్ రెడ్డి, ఎస్వీయూ యూనివర్సిటీ వీసీ ఏకపక్షంగా వ్యవహరించారు.

### వీసీల నియామకంలో పారదర్శకంగా వ్యవహరించాం

వీసీల నియామకంలో పారదర్శకంగా వ్యవహరించాం. ఐఐటీ ఖరగ్ పూర్, ఎన్ఐటీ వరంగల్ లో పనిచేసిన వారిని వీసీలుగా నియమించాం. అద్భుతమైన వైస్ ఛాన్స్ లర్స్ ను జల్లెడ పట్టి తీసుకువచ్చాం. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీకి మన వైఎస్ ఛాన్సలర్‌ను తీసుకెళ్లారు. వీసీలుగా ఉన్నవారు ఎవరూ నా బంధువులు కాదు. నా మిత్రులు కాదు. ఒక్కసారి కూడా ఫేస్ టూ ఫేస్ కలవలేదు. విశ్వవిద్యాలయాలకు పూర్వవైభవం తీసుకు వస్తాం. అందులో భాగంగానే వీసీల నియామకం చేపట్టాం. ఐఐఐటీలకు గవర్నర్ ఛాన్సలర్‌గా ఉంటారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిని చాన్సలర్‌గా చేసే ప్రయత్నం చేశారు. దానిని రద్దు చేశాం. తిరిగి గవర్నర్ కే ఆ బాధ్యత అప్పగించాం.

### కేంద్రం నిధులకు కనీసం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదు

నాడు-నేడు కింద మొదటి విడత పనులు పూర్తిచేసేందుకు రూ.881 కోట్లు అవసరం. నాడు-నేడులో బెంచ్‌లు అందించిన పాఠశాలలను 117 జీవో ద్వారా మూసివేశారు. కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.900 కోట్లు మౌలిక సదుపాయాలకు కేటాయిస్తే.. గత వైసీపీ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు కూడా ఇవ్వలేదు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది

గత ప్రభుత్వం ట్యూషన్ ఫీజు రూ.2,832 కోట్లు బకాయిలు పెట్టారు. హాస్టల్ ఫీజు రూ.989 కోట్లు బకాయిలు పెట్టారు. పీజీ ఫీజురీయింబర్స్ మెంట్ రూ.450 కోట్లు బకాయిలు పెట్టారు. మొత్తం రూ.4,271 కోట్లు బకాయిలు పెట్టారు. గత ప్రభుత్వ బకాయిల విషయంలో.. మన ప్రభుత్వం తప్పనిసరిగా దశలవారీగా ఫీజులు చెల్లించే బాధ్యత తీసుకుంటుంది. పీజీ ఫీజు రీయింబర్స్ మెంట్ తిరిగి ప్రారంభిస్తాం. ఎయిడెడ్ వ్యవస్థపై ఆనాడు కలిసికట్టుగా పోరాడాం. ఆనాడు పోలీసులను పంపి విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయించారు. జగన్ రెడ్డి నిర్వాకంతో ఎయిడెడె లో సుమారు 1,100 మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. దీనికి ప్రత్యామ్నాయం తీసుకువస్తాం.

### వైసీపీ హయాంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పడిపోయింది

ప్రైవేటు విశ్వవిద్యాలయాలు రావాలంటే జాయింట్ కొలాబరేషన్ డిగ్రీ ఉంటేనే ఇవ్వొచ్చు. అది కూడా టాప్-100 యూనివర్సిటీ ఉంటేనే ఇవ్వొచ్చని నిబంధన పెట్టారు. దీనివల్ల అనేక విదేశీ విశ్వవిద్యాలయాలు రాష్ట్రానికి రావాలంటే ఇబ్బంది పడుతున్నాయి. ఇదంతా గత ప్రభుత్వ నిర్వాకం. కేంద్ర ప్రభుత్వం సమర్థ్, స్వయం ప్లస్ తీసుకువచ్చింది. దీనిని అమలుచేయలేదు. వీటిన్నింటి వల్ల మన గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో పడిపోయింది. తమిళనాడులో 47, ఢిల్లీలో 46 శాతం ఉంటే.. ఏపీలో 36శాతానికి పడిపోయింది. రీసెర్చ్, ఇన్నోవేషన్ లో పేటెంట్ ఫైలింగ్స్ తమిళనాడులో 7,600 చేస్తే మనం కేవలం 1400 చేస్తున్నాం. పీహెచ్ డీ చదువుతున్న వారిలో తమిళనాడులో 26వేల మంది ఉంటే.. ఏపీలో కేవలం 5,600 మంది మాత్రమే ఉన్నారు.

### ఐటీఐ, పాలిటెక్నిక్‌లకు భవనాలు

పాలిటెక్నిక్‌ల విషయానికి వస్తే.. ప్రవేశాలు గతంలో 81 శాతం ఉంటే వైసీపీ హయాంలో 69శాతానికి పడిపోయాయి. పాలిటెక్నిక్ లో నాణ్యత లేకుండా పోయింది. 21 ఐటీఐలకు, 12 పాలిటెక్నిక్ లకు ప్రభుత్వ భవనాలు లేవు. కొన్నింటికి భూములు లేవు, కొన్నింటికి సిబ్బంది కొరత ఉంది. ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ లకు సొంత భూమి, భవనాలు నిర్మించి సిబ్బందిని సమకూరుస్తాం.

### లెర్నిగ్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) మోడల్ తీసుకువస్తాం

లెర్నిగ్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ మోడల్(లీప్) తీసుకువస్తున్నాం. విజన్ తో పనిచేస్తున్నాం. వాల్యూ బేస్డ్, ఫ్యూచర్ రెడీ గ్లోబల్లీ రిలవెంట్ లెర్నింగ్ ఎకో సిస్టమ్ ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. దశలవారీగా సంస్కరణలు తీసుకువస్తాం. మొదట క్లస్టర్ రీస్ట్రక్చరింగ్ పూర్తి చేశాం. జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసుకున్నాం. మీరు కూడా భాగస్వామ్యం కావాలి. చర్చించి మెరుగైన ప్రత్యామ్నాయం తీసుకువద్దాం.

### కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులమ్ బలోపేతం

ఒక్క ప్రభుత్వ పాఠశాలను కూడా మూసివేయకూడదనేది మా లక్ష్యం. ప్రతి గ్రామానికి మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుచేస్తాం. అంటే ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తాం. దీనికి లీప్ పాఠశాలలు అని పేరు పెడతాం. స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలను బలోపేతం చేస్తాం. కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులమ్ బలోపేతం చేస్తాం. ప్రతి చాప్టర్ కు క్యూఆర్ కోడ్ పెట్టాం. ప్రతి శనివారం నో బ్యాగ్ డే గా ప్రకటించాం. ఉపాధ్యాయులకు శిక్షణ అనేది పెద్ద సబ్జెక్ట్. స్కూల్ ప్రారంభానికి ముందే ట్రైనింగ్ ఉండాలనేది మా విధానం. ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతాం. ఉపాధ్యాయుల కోసం అమరావతిలో వరల్డ్ క్లాస్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

### పారదర్శకంగా సీనియారిటీ లిస్ట్

టీచర్ల సీనియారిటీ విషయంలో ఏపీ చరిత్రలో మొదటిసారి సినియారిటీ లిస్టను పారదర్శకంగా రూపొందిస్తున్నాం. ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే ఇవ్వాలి. టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్టను ఈ సమావేశాల్లోనే తీసుకువస్తాం. నేను ఐదున్నర గంటల పాటు సంఘాలతో కూర్చొని చర్చించాం. డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. ఎలాంటి అనుమానం అవసరం లేదు. వర్గీకరణపై వన్ మ్యాన్ కమిషన్ నివేదిక వచ్చింది. ప్రభుత్వ పరిశీలనలో ఉంది. చర్చ అనంతరం కేబినెట్ ఆమోదంతో ఎస్సీ కమిషన్ కు పంపి, నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. ఈ ఏడాదిలోనే ఉపాధ్యాయుల నియామకం చేపడతాం. ఇప్పటికే టెట్ నిర్వహించాం. సింగిల్ యాప్ తీసుకువస్తాం.

### విద్యార్థుల్లో నైతిక విలువల పెంపునకు కృషి

ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ గ్యారంటీడ్‌గా ఇస్తాం. మూడేళ్ల సమయం ఇవ్వాలి. అప్పుడు చెక్ చేద్దాం. పిల్లల రిపోర్ట్ కార్డ్ కూడా పారదర్శకంగా చేస్తాం. యాక్టివ్ లెర్నింగ్ విధానంతో ముందుకు వెళ్తాం. లీప్ యాప్ ద్వారా అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుస్తాం. ప్రభుత్వ విద్యపై సీరియస్ గా ఉన్నాం. మొదటిసారిగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశాం. విద్యార్థుల భవిష్యత్ విషయంలో తల్లిదండ్రులను కుడా భాగస్వామ్యం చేశాం. పాఠశాలల్లో ఒకేషనల్, స్కిల్స్ ట్రైనింగ్ కూడా చేస్తున్నాం. అపార్ ఐడీ అనివార్యం. ఇది మంచి నిర్ణయం. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు చాగంటి కోటేశ్వరరావు గారిని నియమించాం. మార్పు విద్య తీసుకువస్తుంది.

### రాజ్యాంగంపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తాం

అమర్‌చిత్ర కథ వాళ్లతో ఒప్పందం చేసుకుని బాలభారత రాజ్యాంగం పేరుతో పుస్తకాన్ని విద్యార్థులకు అందజేస్తాం. రాజ్యాంగం గురించి అవగాహన కల్పిస్తాం. స్వాతంత్ర్య సమరయోధుల గురించి వివరిస్తాం. నేను 3,132 కి.మీల మేర పాదయాత్ర చేశానంటే రాజ్యాంగం ఇచ్చిన హక్కు. నన్ను ఎంతో ఇబ్బంది పెడితే రాజ్యాంగం చూపించాను. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు కౌన్సిలింగ్ చాలా అవసరం. 280 మంది కౌన్సిలర్లను నియమించాం. ముందుగానే లక్షణాలను గుర్తిస్తాం. క్రీడలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తాం.

### గంజాయి, డ్రగ్స్‌కు ఫుల్ స్టాప్ పెడతాం

గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రణకు యుద్ధం ప్రకటించాం. గంజాయి, డ్రగ్స్‌కు ఫుల్‌స్టాప్ పెడతాం. డ్రగ్స్ వద్దు బ్రో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. ప్రతిస్కూల్‌లో ఈగల్ కమిటీలు ఏర్పాటుచేస్తాం. సైన్స్ ఫెయిర్స్, కల్చరల్ ఫెస్ట్, యాన్యువల్ డేస్ నిర్వహిస్తాం. ఈ సభలోనే స్టూడెంట్ పార్లమెంట్, స్టూడెంట్ కౌన్సిల్ నిర్వహించాలని ఆలోచన చేస్తున్నాం. మొక్కలు నాటేలా గ్రీన్ క్లబ్స్ ఏర్పాటుచేస్తాం, గ్రీన్ పాస్ పోర్ట్స్ ఇస్తాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్లు కూడా చాలా ముఖ్యం. 125 కొత్త భవిత సెంటర్ల కోసం కేంద్రానికి ప్రతిపాదించాం. ఇందు కోసం కమిటీ ఏర్పాటుచేస్తున్నాం. ఎవరికైనా ఆసక్తి ఉంటే పేర్లు ఇవ్వాలి.


మోడల్ ప్రైమరీ స్కూల్స్, హైస్కూల్స్ కు కంప్యూటర్ ల్యాబ్స్ ఇస్తాం. పిల్లల ఫెర్ఫార్మెన్స్ కోసం డ్యాష్ బోర్డు ఏర్పాటుచేస్తాం. మౌలిక వసతుల కోసం స్టార్ రేటింగ్ ఏర్పాటుచేశాం. లెర్నింగ్ అవుట్ కమ్స్ పైనా రేటింగ్స్ ఇస్తాం. పెండింగ్ పనులు పూర్తిచేస్తాం. మెగా పీటీఎం నిర్వహించాం. ప్రతి శుక్రవారం కమిషనర్ గారు సంఘాలతో సమావేశం అవుతున్నారు.

### విద్యావ్యవస్థలో సంస్కరణలకు బాధ్యత తీసుకోవాలి

అందరం కలిసికట్టుగా బాధ్యత తీసుకుంటేనే విద్యావ్యవస్థలో ఆశించిన సంస్కరణలు తీసుకురాగలగుతాం.పది నిర్ణయాలు తీసుకుంటే మూడు తప్పు అవ్వొచ్చు. సరిదిద్దుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నా, కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ రోజు అసెంబ్లీకి రావాలంటే పరదాలు లేవు. పోలీసుల సంఖ్య తగ్గింది. డిప్యూటీ డీఈవో నియామకాలు త్వరలో పూర్తిచేస్తాం. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించాం. భోజన నాణ్యత పెంచాలని చంద్రబాబు గారు చాలా స్పష్టంగా చెప్పారు. లోకల్ మెనూ ఏర్పాటుచేశాం.

### 15 ఏళ్ల తర్వాత ఇంటర్ విద్యలో సంస్కరణలు

15 ఏళ్ల తర్వాత ఇంటర్ విద్యలో సంస్కరణలు తీసుకువస్తున్నాం. అందరూ ఒప్పుకున్న నిర్ణయాలనే ముందుకు తీసుకెళ్తున్నాం. కరిక్యులమ్ టెక్ట్స్ బుక్స్ రివిజన్ చేశాం. అనవసరమైన సబ్జెక్టుల భారాన్ని తగ్గించాం. ఎంబైపీసీ తీసుకువచ్చాం. ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉండాలని నేను బలంగా నమ్ముతున్నా. అదేవిధంగా జూనియర్ కాలేజీలను కూడా బలోపేతం చేయాలి. టైమింగ్స్ పెంచాల్సిన అవసరం ఉంది. కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ కోచింగ్ తిరిగి ప్రారంభిస్తాం. మెటీరియల్ అందజేస్తున్నాం. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం అమలుచేస్తున్నాం. స్కూల్ కిట్స్ అందజేశాం.



**సమస్యలు నాకు చెప్పండి..**

hello.lokesh@ap.gov.in

ఇది నా పర్సనల్ మెయిల్ ఐడీ.

ప్రతి మెయిల్‌ని నేనే స్వయంగా చూసి..
సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

మంత్రి @naralokesh

### విశ్వవిద్యాలయాల్లో అనేక సంస్కరణలు అవసరం

విశ్వవిద్యాలయాల్లో అనేక సంస్కరణలు అవసరం. ఎవరిపాత్ర ఏంటో తెలియాలి. దీనిపై సీరియస్ గా వర్క్ చేస్తున్నాం. ఖాళీగా ఉన్న 3,282 పోస్టులు భర్తీ చేస్తాం. అడ్మినిస్ట్రేషన్ కోసం యూనిఫైడ్ యాక్ట్ తీసుకువస్తాం. డీప్ టెక్ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలని భావిస్తున్నాం. లా, స్పోర్ట్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తాం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల విషయంలో సమస్యలు పరిష్కరిస్తాం. పబ్లిక్ లైబ్రరీల విషయానికి వస్తే.. సెస్ డైరెక్ట్ గా లైబ్రరీలకు వచ్చేవిధంగా చేస్తాం. మెరుగైన లైబ్రరీలను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది.

పాదయాత్ర తర్వాత లైబ్రరీల ప్రాముఖ్యతను తెలుసుకున్నా. మండల, నియోజకవర్గ, జిల్లా, రీజనల్, సెంట్రల్ లైబ్రరీలను బలోపేతం చేస్తాం. అవకతవకలను అరికడతాం. మంచి పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం. ఏడాదిలో పబ్లిక్ లైబ్రరీస్‌లో మార్పు తీసుకువస్తాం. ప్రపంచ స్థాయి సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటుచేస్తాం. అక్కడే ఆర్కైవ్స్ ఏర్పాటుచేస్తాం. అమీర్ పేటలో నాలుగు నెలల శిక్షణ తీసుకుంటే ఉద్యోగాలు వస్తున్నాయి. కరిక్యులమ్ బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

### విద్యార్థులను ఇబ్బందిపెట్టేవారిపై కఠిన చర్యలు

కొత్త ఫీజు రీయింబర్స్ మెంట్ విధానంలో ఏప్రిల్ 24 తర్వాత నేరుగా కాలేజీ అకౌంట్ లోకి నిధులు జమచేస్తాం. ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయలు చెల్లించాం. ఇది ఆన్ గోయింగ్ ప్రోగ్రామ్. ఇందులో ఎలాంటి సందేహాలు అవసరం లేదు. కావాలని కొంతమంది కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల వద్ద బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నారని సభ్యులు నా దృష్టికి తీసుకువచ్చారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సంఘలతో ఇప్పటికే మేం మాట్లాడాం, చర్చించాం. వారు కూడా ఒప్పుకున్నారు. ప్రభుత్వం ఒప్పుకుంది. డబ్బులు విడుదల చేస్తాం. దయచేసి పిల్లలను ఇబ్బంది పెట్టవద్దు.

### ఇండస్ట్రీ కనెక్టివిటీ కరిక్యులమ్ తీసుకువస్తాం

ఒకేరాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. ఇప్పటికే అనేక కంపెనీలు వచ్చాయి. ఇండస్ట్రీ కనెక్టివిటీ కరిక్యులమ్ తీసుకువస్తాం. ఈ రోజు రెండు భాషలా, మూడు భాషలా అనే చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి గారు ఐదు కాదు.. పది భాషలు నేర్చుకుంటే తప్పేంటి అని స్పష్టంగా చెప్పారు. మన నర్సులు జర్మనీ, జపాన్ వెళ్లబోతున్నారు. వారికి జర్మన్, జపనీస్ నేర్పించి పంపిస్తున్నాం. యూరప్ లో ట్రక్ డ్రైవర్స్ నెలకు రూ.2 లక్షలు సంపాదిస్తున్నారు.

ఓంక్యాప్ ద్వారా మంచి శిక్షణ అందిస్తాం. మంగళగిరిలో స్కిల్ సైన్సెస్ పైలెట్ ప్రాజెక్ట్ చేపట్టాం. చాలా నేర్చుకున్నాం. స్కిల్ అసెస్ మెంట్ ఏవిధంగా చేయాలనే దానిపై ఇరుక్కుపోయాం. ఐటీ స్కిల్స్ అసెస్ చేయడం చాలా తేలికైంది. కార్పెంటరీ స్కిల్స్, రిపేర్స్ అంటే స్కూటర్ మెకానిక్, కార్ మెకానిక్ స్కిల్స్ ఎలా అసెస్ చేయాలనేదానిపై తర్జనభర్జన పడుతున్నాం. ఒకమార్గం దొరికింది. ముఖ్యమంత్రి గారితో చర్చించి త్వరలో అమలుచేస్తాం. స్కిల్ డెవలప్ మెంట్ అంటే లైఫ్ లాంగ్ లెర్నింగ్ అందించే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

### కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ప్రపంచానికి పరిచయం చేద్దాం

ఇదొక మిషన్‌మోడ్‌లో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. మనందరం భాగస్వామ్యం కావాలి. ఒకటికి పదిసార్లు చర్చించుకుందాం, మాట్లాడుకుందాం. కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి పరిచయం చేద్దాం. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ ఇప్పించాలని తల్లిదండ్రులు కోరినప్పుడే ప్రభుత్వ విద్య మెరుగైందని నమ్ముతారు. ఆ విధమైన ప్రమాణాలు నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మీ అందరి సహకారం అవసరం. ఇక్కడున్న సభ్యులు ఒక్కో మండలంలో ఒక పాఠశాలను దత్తత తీసుకుని, మెరుగైన విద్య అందించేందుకు కృషిచేయాలని కోరుతున్నా. ఈ యజ్ఞం వల్ల బడుగు, బలహీనవర్గాలకు చెందిన పిల్లలు, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు మెరుగైన విద్యను మనం అందించగలుగుతాం.సంపన్నులకు, నిరుపేద కుటుంబాలకు ఒకేరకమైన విద్య అందించేందుకే ఈ లీప్ మోడల్ ను తీసుకువస్తున్నాం. ఇందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకే ఎప్పుడూ లేనివిధంగా బడ్జెట్ లో 9.8శాతం నిధులు విద్యారంగానికి కేటాయించడం జరిగింది. విద్యారంగంలో పదేళ్లలో జరగని సంస్కరణలు కూటమి ప్రభుత్వ 9 నెలల కాలంలోనే చేపట్టాం.

శాసన సభ్యులు, ఉపాధ్యాయులు, సంఘాలు, సంఘ నాయకులు, అధికారులు, తల్లిదండ్రులు, పిల్లలు కలిసికట్టుగా మాట్లాడుకున్నాం కనుకనే ఇంతవరకైనా వచ్చింది. దీనివల్లే ఏపీ మోడల్ రాబోతోందని నేను బలంగా నమ్ముతున్నా. ఈ కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ సంఘాలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. జూన్ నాటికి అన్ని సంస్కరణలు పూర్తవుతాయని, వచ్చే నాలుగేళ్లు విద్యపైనే దృష్టిపెడతామని మంత్రి చెప్పారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
09
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, మార్చి 2025 ||

# రాజకీయ మార్చురీకి పోయేది కూడా రేవంత్ మాత్రమే

సి ఎం స్టేచర్ వున్నదని విర్రవీగుతున్నది రేవంత్ రెడ్డి తప్ప కేసీఆర్ కాదు.త్వరలో రాజకీయ మార్చురీకి పోయేది కూడా రేవంత్ మాత్రమే.ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి కేసీఆర్ ఏడాది నుండి రేవంత్ రెడ్డి ఎంత రెచ్చగొట్టినా,తన హోదాను మరిచి వీధి రౌడీలా అసభ్య పదజాలంతో దూషించినా కేసీఆర్ సహిస్తూ వున్నారంటే అది ఆయన బలహీనత కాదు-ఆయన రాజకీయ పరిపక్వత, హుందా తనానికి నిదర్శనం. శిశుపాలుని వందతప్పులు లెక్కించిన తర్వాతే కృష్ణుని చేతిలో కుక్క చావు చచ్చాడు.తెలంగాణ ప్రజలు ఓ అసమర్థునికి పట్టం కట్టారు.పిచ్చి కూతలు కూస్తే ప్రజలు ఊరుకోరు.

రవీంద్రభారతిలో రేవంత్ మాట్లాడుతూ తన దగ్గర డబ్బులు లేవని చెప్పడం ఆయన చేతగానితనానికి నిదర్శనం.కేసీఆర్ తన పదేళ్ళ పాలనలో ఏ రాష్ట్రంలో స్వాతంత్ర్యానంతరం భారతదేశం లో ఏ ముఖ్యమంత్రికీ సాధ్యపడని ఆర్థిక ప్రగతిని సాధించి, తెలంగాణ ఆదాయాన్ని మూడు రెట్లు పెంచారు.ఆ ప్రగతిని గమనించే వేలాది పారిశ్రామిక వేత్తలు తెలంగాణ లో పెట్టుబడులు పెట్టారు.

రేవంత్ గత పదిహేను నెలల పాలనలో తెలంగాణ ను పదేళ్ళ వెనక్కి నెట్టారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ని తన అపరిపక్వత కారణంగా దిగజార్చి కేసీఆర్‌పైన నెపాన్ని మోపి తప్పించుకోవాలనుకుంటున్నాడు. చేతకాని ముఖ్యమంత్రులను గద్దె దించడమే ఇప్పటివరకూ చూసాం కానీ నమ్మకద్రోహం చేసిన ముఖ్యమంత్రి ని పిచ్చి కుక్కలా తరిమే రోజు ఇంకెంతో దూరం లేదు.



-వీరమల్ల ప్రకాశ్, రాజకీయ విశ్లేషకులు

# అసెంబ్లీలో ఉత్తమ ఎమ్మెల్యే అవార్డులు

- సీనియర్ జర్నలిస్టు, సీనియర్ పార్లమెంటేరియన్‌తో కమిటీ
- అసెంబ్లీ కమిటీలకు రూట్ క్లియర్
- 5,6 కమిటీల ప్రకటనకు ఆమోదం
- నేడు ప్రకటించే అవకాశం?
- స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌తో సీఎం బాబు భేటీ

(మార్తి సుబ్రహ్మణ్యం)

శాసనసభా సమావేశాల్లో అత్యున్నత ప్రతిభ, ఆకర్షణీయమైన ప్రసంగాలు చేసిన సభ్యులకు ఉత్తమ ఎమ్మెల్యే అవార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు విధి విధానాలను ఖరారు చేసినట్లు సమాచారం. సమావేశాల సందర్భంగా సీఎం చంద్రబాబును కలవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అపాయింట్‌మెంట్ కోరారు. అయితే స్పీకర్ స్థానానికి గౌరవం ఇస్తూ, సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా స్పీకర్ చాంబరుకు వచ్చారు. గతంలో కూడా ఆయన ఇలాంటి సంప్రదాయమే పాటించారు.



విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సీఎంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న భేటీ అయిన సందర్భంలో, సభా వ్యవహారాలపై చర్చజరిగింది. ఆ సందర్భంగా సమావేశాల్లో బాగా మాట్లాడుతున్న ఎమ్మెల్యేలను ప్రోత్సహించేందుకు అవార్డులు ఇద్దామని, లోక్‌సభలో కూడా ఇలాంటి సంప్రదాయం ఉందని స్పీకర్, సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.



దానితో లోక్‌సభలో ఎలాంటి పద్ధతులున్నాయో చూసి, ఆ మేరకు వ్యవహరించమని సీఎం, అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌కు సూచించారు. ఆ ప్రకారంగా అత్యున్నత ప్రతిభ కనబరచిన ఎమ్మెల్యేల ఎంపిక కోసం, ఒక కమిటీ వేయాలని నిర్ణయించారు. అందులో ఒక సీనియర్ జర్నలిస్టు, ఒక సీనియర్ పార్లమెంటేరియన్ సభ్యులుగా నియమించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు.

కాగా గత ఎనిమిది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీ కమిటీలపైనా సమవేశంలో చర్చ జరిగింది. సభ్యులు కమిటీలపై ఒత్తిడి చేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకవెళ్లారు. అసెంబ్లీ-కౌన్సిల్ కలసి ఉన్న కమిటీల ఏర్పాటుపై చర్చ జరిగిన సందర్భంలో, మండలి నుంచి వేస్తే, వైసీపీ వారికి స్థానం కల్పించాల్సిన ఉంటుందని భావించారు. దానితో అసెంబ్లీ కమిటీలు మాత్రమే వేయాలని నిర్ణయించారు. ఆ మేరకు 5 లేదా 6 కమిటీలకు జాబితా ఇప్పటికే రూపొందించారు. దానిని ఇప్పటికే సీఎంకు పంపించారు. దానిని నేడు ప్రకటించే అవకాశం ఉంది.



# ఏపీలో ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ పొడిగింపు

విజయవాడ, మహానాడు: ముంబై నటి జత్వానీ వేధింపుల కేసులో ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. కాంతిరాణా, సీతారామాంజనేయులు, విశాల్ గున్నీలపై సస్పెన్షన్ను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్టు తెలిపింది. రివ్యూ కమిటీ సిఫార్సు తర్వాత సెప్టెంబర్ 25 వరకు వారిపై సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొంది. వీరు నిబంధనలు ఉల్లంఘించారనే అభియోగాలు ఎదుర్కొంటున్నారు.

# తెలంగాణ ఇమేజ్‌ను పెంచిన ఐటీ, పరిశ్రమల శాఖ

- రాష్టానికి హైదరాబాద్ తలమానికం
- పెరుగుతున్న వలసలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించండి
- వేసవిలో విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు చేసుకోండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్: ఐటీ, పరిశ్రమల శాఖ సంవత్సర కాలంగా రకరకాల సమ్మిట్స్ నిర్వహించి భారీగా పెట్టుబడులు సాధించి తెలంగాణ రాష్ట్ర ఇమేజ్ ను పెంచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్లో ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఇంధన శాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి డిప్యూటీ సీఎం ఐటీ, పరిశ్రమల శాఖ సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు కార్పొరేట్ సంస్థలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్వాణ బాధ్యతను ఒక్కో కార్పొరేట్ కంపెనీకి CSR నిధులు భాగంగా అప్పగిస్తామని పరిశ్రమల శాఖ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు.

భారీ పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాకాలను దశలవారీగా విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో మెగా లెదర్ పార్కులు, మినీ లెదర్ పార్కుల ప్రగతిని సమీక్షించారు. లెదర్ పార్కులకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా విలువైన స్థలాలను కాపాడాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. మూడవ శ్రేణి పట్టణాలకు ఐటీ టవర్స్ విస్తరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.

రాష్టానికి హైదరాబాద్ తలమానికం అందుకు అనుగుణంగా మహానగరం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ప్రగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

రాష్ట్ర నలుమూలల నుంచి ఉపాధి, పెట్టుబడుల దృష్ట్యా పెద్ద ఎత్తున ప్రతి ఏటా వలసలు పెరుగుతున్నాయి అందుకు అనుగుణంగా రహదారులు, విద్యుత్తు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపల్, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఆ మేరకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తే పట్టణీకరణ వేగవంతం అవుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా



ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు.

గ్రీన్ పవర్ కు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇంధన శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సప్లై కాస్ట్ తగ్గించుకోవాలని, రెప్ప పాటు కూడా కరెంటు అంతరాయం లేకుండా చూసుకోవాలి, వేసవిలో పంటలు ఎండిపోకుండా విద్యుత్ ఉన్నత అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రాధాన్యత రంగమైన ఇంధన శాఖకు ఆ మేరకు బడ్జెట్లో కేటాయింపులు ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశాల్లో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, జయేష్ రంజన్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ మార్ సుల్తాన్య, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, పరిశ్రమల శాఖ అధికారులు విష్ణువర్ధన్ రెడ్డి, మెట్రో వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువ పోరు అంటూ వై'చీప్ పాలిట్రిక్స్'

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం



మంగళగిరి, మహానాడు: యువతకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి ఇప్పుడు చీప్ గా యువ పోరు అంటూ వీధి నాటకాలకు తెరతీశాడు జగన్ రెడ్డి అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2 నెలల క్రితం వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి విద్యార్థి సమస్యలపై రోడ్డు ఎక్కాల్సి వస్తుందని చెప్పినప్పుడు మాట్లాడాడు.. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఏ విద్యార్థి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతోనే మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని అమలు పరుస్తామని, అలాగే లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబట్టు కుంటామని, మీకు ఏవిధమైన సమస్యలు ఉన్నా వాటిని సానుకూలంగా తీసుకుని నేరవేర్చుతామని కూటమి ప్రభుత్వం చెప్పిందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు చేసిన అన్యాయం మీద ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లోనే లోకేష్ చేస్తున్న ప్రక్షాళనకు టైం, ప్లేస్ చెబితే చర్చిద్దామని సవాలు విసిరితే ఎవరు స్పందించ లేదు. శాసన మండలి లో ప్రశ్నోత్తరాలలో సభ్యులు అడిగిన దానికి సమాధానంగా వైసీపీ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో రూ.800 కోట్లు విడుదల చేశారు. అంతేకాక కోడిగుడ్లు, చిక్కీలకు రూ.352 కోట్లు విడుదల చేశారు. కాని పదే పదే అబద్ధాలు చెబుతూ.. అక్రమ సంపాదనతో సంపాదించిన పేపర్లో, సాక్షి మీడియాలో అబద్దాలు వడ్డించే ప్రయత్నం చేస్తూ రాస్తూ ఉన్నారు. విశాఖలో ఒక ర్యాలీలో పాల్గొన్న కొంత మంది విద్యార్థులు ప్లక్ కార్డులు పట్టుకుని ఉంటే వారు కూటమికే జై కొట్టే విద్యారంగాన్ని ప్రక్షాళన చేసిన నాయకుడు లోకేష్.

వైసీపీ ప్లకార్డులు పట్టుకున్న.. వారి మనస్సులో మాత్రం 9 నెలల్లో విద్యా రంగాన్ని గాడిలో పెట్టి ముందుకు నడిపిస్తున్నా కూటమి ప్రభుత్వానికి వాళ్లు జై కొట్టారంటే వారికి నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం కల్పించింది. వైసీపీ ప్రభుత్వం నాడు పెట్టిపోయిన బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేస్తుంది అనేది జగమెరిగిన సత్యం.. కాని ఏమి ఎరగనన్నట్లు జగన్ రెడ్డి ఆత్మవంచనకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు.





హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా నిజామాబాద్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్న గౌడ్, మట్టు చౌదరి రూపొందించిన ప్రత్యేకలఘు చిత్రం అందర్నీ ఆకట్టుకుంటోంది. నాలుగు నిమిషాల నిడివి గల ఈ లఘు చిత్రం దక్షిణ కన్నడ జిల్లాలో చిత్రీకరించారు. అక్కడ పారే సెలయేరులు, నదుల్లో పడవలపై విన్యాసాలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. "హ్యాపీ బర్త్డే కవితక్క" అని పేర్కొని బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండాలు రెపరెపలు ఆహ్లాదకరమైనటువంటి ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో రెపరెపలాడించారు.
ఆద్యంతం ప్రతి సీను ఆకట్టుకునే విధంగా చిత్రీకరించిన ఈ లఘు చిత్రాన్ని బుధవారం నాడు సాయంత్రం ప్రసాద్ లాబ్స్ లో ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, గెల్లు శ్రీనివాస్ యాదవ్, పర్వతనేని శ్రీధర్ రావు, మేడే రాజీవ్ సాగర్, తదితరులు హాజరయ్యారు.



# ఆదినారాయణ యాదవ్‌పై చర్యలు తీసుకోండి

- గిరిజన భూముల కబ్జాపై సీఎం బాబును కలిసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి: ముదిగుబ్బ మండలంలో అడవి బ్రాహ్మణపల్లి తండా గ్రామంలో గిరిజన రైతులకు చెందిన భూ కబ్జాల విషయమై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఫిర్యాదు చేశారు,

ఈ సందర్భంగా రామకృష్ణ సీఎం చంద్రబాబుతో మాట్లాడుతూ ముదిగుబ్బ మండల పరిధిలోని ఏబిపల్లి తాండ గ్రామంలో మండల ఎంపిపి ఆదినారాయణ యాదవ్ వందల ఎకరాలు భూములు కబ్జా చేసి, గిరిజన రైతులను మోసం చేశాడని చంద్రబాబుకు వివరించారు, ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిపిఐ రామకృష్ణ తో మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ నుంచి తగిన నివేదికలు తెప్పించుకుని, త్వరలోనే ఈ విషయంపై చర్యలు తీసుకుంటామని రామకృష్ణకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తో పాటు సిపిఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు,ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ అయిన జెల్సి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# 'జయకేతనం' పేరిట జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ

- సభకు నామకరణం చేసిన పవన్ కల్యాణ్
- సభాప్రాంగణంలో మూడు ముఖద్వారాలకు మహానుభావుల పేర్లు
- పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో రేపు మధ్యాహ్నం 3 గంటలకు సభ
- సభా వేదిక నుంచి యువత, రైతు, మహిళా ప్రతినిధులకు మాట్లాడే అవకాశం
- ఆంధ్ర, తెలంగాణాలతో పాటు మిగతా రాష్ట్రాల నుంచి జనసైనికులు, వీరమహిళలు రాక..
- లక్షలాది జనం అంచనాలతో సభ ఏర్పాట్లు

అమరావతి, మహానాడు: జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద 14న (శుక్రవారం) జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సభకు 'జయకేతనం' అని జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కల్యాణ్ బుధవారం నామకరణం చేశారు. ఈ విషయాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ వద్ద జనసేన పార్టీ నిర్వహిస్తున్న 'జయకేతనం' సభ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోనుంది. ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి జనసైనికులు, వీర మహిళలు తరలిరానున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా జనసైనికులు, ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుల నుంచి సైతం పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నట్లు పార్టీ అధిష్టానవర్గాలు వెల్లడించాయి. పవన్ కల్యాణ్ నాయకత్వంలో జరిగే ఈ సభ స్థానిక చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా జరగనుంది.





## ముఖద్వారాలకు ముగ్గురు పేర్లు

పిఠాపురం ప్రాంతానికి విశేష సేవలందించిన మహానుభావులను స్మరించుకునే విధంగా సభాప్రాంగణంలోని మూడు ముఖద్వారాలకు ముగ్గురు పేర్లు పెట్టారు. తొలి ద్వారానికి పిఠాపురం మహారాజు శ్రీ రాజా సూర్యరావు బహదూర్ పేరు పెట్టారు. ఆయన విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు ఎనలేని కృషి చేసిన చరిత్ర ఉంది. రెండో ముఖ ద్వారానికి అన్నసమర్పణతో పేరొందిన మహనీయురాలు డొక్కా సీతమ్మ పేరు పెట్టారు. ఇక మూడో ద్వారానికి విద్యాసంస్థలు స్థాపించి చరిత్ర సృష్టించిన మల్లాది సత్యలింగం నాయకర్ పేరు పెట్టడం జరిగింది. ఈ ముగ్గురు మహానుభావులు ఆయా ప్రాంతాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ అధిష్ఠానం పేర్కొంది.

## జయకేతనం పేరిట సభ

భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు జనసేనకు అఖండ విజయాన్ని అందించారని.. పోటీ చేసిన ప్రతి స్థానంలో జనసేన విజయం సాధించిందని, ఇది జనసైనికులు, వీర మహిళలు, నాయకుల నిస్వార్థ సేవలకు ఫలితమని.. అందుకే జయకేతనం అని సభకు పేరు పెట్టారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని, పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, పిఠాపురం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మొదలయ్యే ఈ సభ దాదాపు ఐదు గంటలపాటు సాగనున్నది. మన భాష, యాస, సంస్కృతిని ప్రతిబింబించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు ఉంటుంది. సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభకు ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నారు. వారికి ఎటువంటి ఇక్కట్లు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా తిరుగు ప్రయాణంలో భోజనానికి ఇబ్బంది కలకుండా ముఖ్యమైన నాలుగు రహదారుల్లో భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

ఈ సభలో యువతకు మాట్లాడే అవకాశం కల్పించాలని పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదేశించారు. అందుకు అనుగుణంగా పార్టీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తుంది. అదే విధంగా రైతు, మహిళా ప్రతినిధులు మాట్లాడతారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై జనసేన నాయకులు మాట్లాడతారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, అభివృద్ధి కార్యక్రమాలపై జనసేనాని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేయనున్నారు.


## 75 సీసీ కెమెరాలతో నిఘా..:

ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ ఈ సభకు హాజరవుతున్నందున ఆయన భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోలీస్ డిపార్టుమెంట్ తీసుకుంటుంది. పార్టీ పరంగా కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం 75 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. బందోబస్తు విషయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నారు.

# గ్రానైట్ వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తాం

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, మహానాడు: తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి నేతృత్వంలోని గ్రానైట్ వ్యాపారుల బృందం బుధవారం సచివాలయంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కార్యాలయంలో కలిసింది. గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించారు. విద్యుత్ ఛార్జీల తగ్గింపు, రాయల్టీ ఫీజు, సహా వివిధ రకాల పన్నులను తగ్గించాలని లేదంటే రాష్ట్రంలో ఈ రంగం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని మంత్రికి విజ్ఞప్తి చేశారు.



తమ సమస్యలను ఎంఎస్ఎంఈ మంత్రి హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేబినెట్ సహచరుల దృష్టికి తీసుకువెళ్ళి తమను ఆదుకోవాలని వారు కోరారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గ్రానైట్ వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, ఈ విషయాన్ని క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్ళి గ్రానైట్ వ్యాపారుల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 13, మార్చి 2025



విజయవాడ: తాజా రాజకీయ అంశాలపై తెలుగుదేశం పార్టీ అధినాయకత్వంతో భేటీ కోసం తమిళనాడు లోని అధికార డీఎంకే పార్టీ ప్రతినిధిగా ఆంధ్రప్రదేశ్ చేరుకున్న తమిళనాడు క్యాబినెట్ మినిస్టర్ ఎతిరాజులు వజ్రవేలు ని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ క్యాబినెట్ లో రహదారులు, పబ్లిక్ వర్క్స్, పోర్ట్స్ శాఖామంత్రిగా భాద్యతలు నిర్వహిస్తున్న ఈ.వి.వేలు మన తెలుగు మూలాలు కలిగిన కుటుంబంకి చెందినవారు.



# టీడీపీ ఆవిర్భావంతోనే మహిళా సాధికారత ప్రారంభం

మొదటి పేజీ తరువాయి..

మహిళలు చూపిన చొరవే కారణం.

29 వేలమంది రైతులు 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారు. ప్రపంచంలో ఇంత భూమి ఎక్కడా ఇవ్వలేదు. కానీ మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. ఇదే అసెంబ్లీలో భూమి ఇచ్చిన రైతులను అవహేళన చేశారు. ఐదేళ్లూ అమరావతి మహిళలు వీర వనితల్లా పోరాడారు. వారి ఇళ్లపై డ్రోన్‌లు ఎగరేసి పైశాచిక ఆనందం పొందారు. వీళ్లు మనుషులు కాదు. న్యాయ స్థానం టూ దేవస్థానం పేరుతో తిరుపతి వరకూ కార్యక్రమం నిర్వహిస్తే కనీసం వారికి భోజనానికి దొరక్కుండా ఇబ్బందులు సృష్టించారు. రోడ్డుపైనే తినాల్సిన పరిస్థితి కల్పించారు.

### మహిళలను అన్ని విధాలా ప్రోత్సహించాం

మహిళలను విద్యాపరంగా ప్రోత్సహించేందుకు 1983లో ఎన్టీఆర్ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. ప్రతి కిలోమీటరుకు ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి 3 కి.మీకు ఒక అప్పర్ ప్రైమరీ, ప్రతి 5 కి.మీకు హైస్కూల్, మండలానికో జూనియర్ కాలేజీ, ప్రతి డివిజన్ కో ఇంజనీరింగ్ కాలేజీ, ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేశాం. 1995లో నేను సీఎం అయ్యాక విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు పెట్టాలని నిర్ణయించాను. ఆ నిర్ణయాన్ని చాలామంది విమర్శించారు.

నాడు నేను తీసుకున్న రిజర్వేషన్ల నిర్ణయంతో ఆడబిడ్డలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. వరకట్నం సమస్యలు లేవు. నేడు ఆడపిల్లలకే ఎదురు కట్నాలు ఇస్తున్నారు. 1996లో గ్రూప్ వన్ కు సెలక్టయిన సూర్యకుమారి ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మిగా భావించి రూ.5 వేలు బ్యాంకులో డిపాజిట్ చేసి 18 ఏళ్ల తర్వాత ఆ డబ్బులను కానుకగా ఇచ్చాను.' అని గుర్తు చేశారు.

### 75 మంది మహిళలు ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి వస్తారు

మహిళలను చదువుల దిశగా ప్రోత్సహించేందుకు అనేక చర్యలు తీసుకున్నాం. 8, 9, 10వ తరగతి విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశాం. స్పీకర్‌గా ప్రతిభా భారతికి అవకాశం ఇచ్చి మహిళలందరినీ గౌరవించాం. నేడు దేశ రాష్ట్రపతి, ఆర్థికమంత్రి మహిళలే. మన ప్రభుత్వంలో ముగ్గురు మహిళా మంత్రులు ఉన్నారు. 175 ఎమ్మెల్యే స్థానాల్లో 21 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇటీవల దళిత యువతిని ఎమ్మెల్సీ చేశాం. ఎన్టీఆర్ 8 శాతంతో మొదలుపెట్టిన మహిళా రిజర్వేషన్లను నేను 33 శాతానికి చేర్చాను. ఇటీవల మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం లభించింది. రిజర్వేషన్లు అమలైతే చట్టసభకు 75 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉంటారు.


### మహిళలు సమర్థవంతంగా పని చేస్తారు

అమెరికా లాంటి దేశాల్లో కూడా నేటికీ మహిళలకు సమానత్వం లేదు. ఉమ్మడి ఏపీలో కండెక్టర్లుగా మహిళలను నియమించాం. వాళ్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు మహిళల పేరుమీదనే ఇచ్చాను. కట్టెల పొయ్యిపై నా తల్లి పడుతున్న కష్టం చూసి దీపం పథకం తెచ్చాను. దేశంలో అత్యధికంగా 65 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. పసుపు కుంకుమ కింద ఒక్కో డ్వాక్రా మహిళకు రూ. 10 వేల చొప్పున రూ.9,689 అందించాం.

స్త్రీ నిధి కింద రూ. 4,440 కోట్ల ఆర్థిక సాయం చేశాం. తల్లిబిడ్డా ఎక్స్ ప్రెస్, ఎన్టీఆర్ బేబీ కిట్స్, తల్లికి వందనం, అన్న అమృత హస్తం, బాలామృతం, బాలికలకు రక్ష, పెళ్లికానుక, గిరి గోరుముద్దలు, ఫుడ్ బాస్కెట్, మహిళలకు 11 రకాల ఉచిత వైద్య పరీక్షలు, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు మరుగుదొడ్లు, సామూహిక శ్రీమంతాలు నిర్వహించాం. మహిళల ఆరోగ్యం, భద్రత కోసం అనేక కార్యక్రమాలు తెచ్చాం. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం .

### ఆడవారికి పెత్తనం ఇస్తున్నారని నాపై విమర్శలు చేశారు

డ్వాక్రా సంఘాల స్థాపనతో మహిళల జీవితాల్లో వెలుగులు తెచ్చాం. 8 నుంచి 10 మంది సంఘంగా ఏర్పడి రూపాయి వారు పొదుపు చేస్తే



నేను రూపాయి ఇచ్చేవాణ్ణి. ఆడవారికి పెత్తనం ఇస్తున్నానంటూ నన్ను చాలామంది విమర్శించారు. ఈ 30 ఏళ్లలో డ్వాక్రా, మెప్మా సభ్యులు లేని ఇల్లు లేదు. రాజకీయ నేతలు, అధికారులంతా వారిపైనే ఆధార పడుతున్నారు. డ్వాక్రా తెచ్చినందుకు గర్వపడుతున్నాను. ప్రకృతి వ్యవసాయంలో మహిళలు ముందున్నారు. డ్వాక్రా మహిళలపై ఉన్న నమ్మకంతోనే 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. 2014-2019 మధ్య డ్వాక్రా మహిళలకు రూ. 8,500 కోట్లు రుణమాఫీ చేశాం.

### ఈ 9 నెలల్లో మహిళకు ఆర్థిక చేయూత అందించాం

ఈ 9 నెలల్లో 7,338 స్వయం సహాయక సంఘాలను, 18 జిల్లా అర్బన్ సమాఖ్యలను ఏర్పాటు చేశాం. 4,91,221 మంది డ్వాక్రా గ్రూపులకు రూ.4,217 కోట్ల స్త్రీ నిధి రుణాలు ఇచ్చాం. బ్యాంకు లింకేజీ ద్వారా 51 లక్షల మందికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.29,486 కోట్లు పట్టణ ప్రాంతాల్లో రూ. ఒక లక్షా 4 వేల 578 కోట్లు అలాగే మెప్మా గ్రూపులకు రూ. 13,860 కోట్లు ఇచ్చాం. 44 ,144 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ. 238 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చాం. మహిళా వీధి వ్యాపారులకు రూ. 235 కోట్లు అందించాం.

డిజిటల్ మార్కెట్ లో 9241 మందికి శిక్షణ ఇచ్చాం. నెల్లూరు జిల్లాలో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ కింద రూ.9 లక్షలు ఖర్చు చేశాం. విశాఖ, విజయవాడ, మంగళగిరి, ఒంగోలు, పిఠాపురం, కుప్పం, శ్రీకాకుళం లోనూ త్వరలో ప్రారంభిస్తున్నాం. రాష్ట్రంలోని 10 పట్టణాల్లో టిడ్కో లైవ్ లీ హుడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. రూ. లక్ష కంటే ఎక్కువ ఆదాయం ఉండే లక్ పత్ దీదీ కార్యక్రమంలో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 10 లక్షలమంది మహిళలు పట్టణ ప్రాంతాల్లో 20 లక్షలమంది మహిళలు లక్షాధికారులుగా ఉన్నారు. కోటీ 16 లక్షల డ్వాక్రా సభ్యుల్లో 30 లక్షల మంది లక్ పత్ దీదీ కింద ఉన్నారంటే గర్వంగా ఉంది. రాష్ట్రంలో 2 కోట్ల 50 లక్షల మంది మహిళలు ఉండగా వారిలో కోటీ 16 లక్షలమంది డ్వాక్రా సంఘాల్లో ఉన్నారు. 2 లక్షల 74 వేల 680 మెప్మా సంఘాలు ఉండగా వాటిలో 28 లక్షల 10 వేల 708 మంది సభ్యులుగా ఉన్నారు. వారంతా రూ. 13 వేల 860 కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా సాయం పొందారు. వచ్చే ఏడాదికి 15 వేల కోట్ల రుణాలు అందించడం టార్గెట్ గా పెట్టుకున్నాం.

సెర్ప్ కింద డ్వాక్రాలో గ్రామీణ ప్రాంతాల్లో 8 లక్షల 48 వేల 497 సంఘాలు ఉండగా వీటిలో 88 లక్షల 31 వేల 116 మంది సభ్యులు ఉన్నారు. వారంతా రూ. 33 వేల 942 కోట్లు రుణాలు తీసుకున్నారు. వచ్చే ఏడాదికి రూ. 50 వేల కోట్లు రుణాలు టార్గెట్ పెట్టుకున్నాం. రెండూ కలిపి చూస్తే 11 లక్షల 23 వేల 177 సంఘల్లోని కోటీ 16 లక్షల 41 వేలమంది సభ్యులకు...రూ. 65 వేల కోట్ల రుణాలు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నాం. సఖి నివాస్ కింద 23 వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేశాం. 4,500మంది అందులో నివాసం ఉంటున్నారు. పబ్లిక్ ప్లేస్ లలో 304 బేబీ ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. 5 లక్షల 544 మందికి బాలసంజీవని పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతున్నాం. ఎన్టీఆర్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ల ద్వారా కుట్టు మిషన్లు, బ్యూటీ థెరపీ, నర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ట్రైనింగ్ ఇస్తున్నాం.

### పింఛన్లలోనూ మహిళలే అధికం

63 లక్షల 36 వేల 932 మందికి పెన్షన్లు ఇస్తుండగా అందులో 50 శాతంపైగా మహిళలే. 37 లక్షల 39 వేల 522 మంది మహిళలు పెన్షన్లు అందుకుంటున్నారు. ఒక్క మహిళలకే పెన్షన్ల కింద నెలకు రూ.1,543 కోట్లు ఖర్చు చేస్తున్నాం. లక్షా 77 వేల 523 మంది ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇస్తున్నాం. గతంలో ఎవ్వరూ ఇలా ఇవ్వలేదు. ఒకప్పుడు భర్త చనిపోతే వితంతు పెన్షన్ అందేదికాదు.

ఒంటరి మహిళలకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో వితంతు పెన్షన్లు ప్రవేశపెట్టాం. వీరికి నెలకు రూ. 72 కోట్లు వ్యయం చేస్తున్నాం. భర్త చనిపోయిన నెలలోనే పెన్షన్ ఇచ్చిన ఘనత టీడీపీదే. 15 లక్షల 82 వేల 389 మంది వితంతువులకు రూ. 685 కోట్లు ఆర్థిక సాయం చేస్తున్నాం. 10 లక్షలమంది మహిళలకు ఉపయోగపడేలా..రూ. 4,400 కోట్ల రుణాలు, సబ్సిడీలు ఇచ్చాం. ఒకే రోజున 3 లక్షల 80 వేల లావాదేవీలు, రూ. 5 కోట్ల విలువైన ఉత్పత్తులు, 35,220 డ్వాక్రా ఉత్పత్తులను ఆన్ లైన్ లో మార్కెట్ చేశాం.

### మహిళలతో 200 అవులెట్‌ల ఏర్పాటు

డ్వాక్రా ఉత్పత్తులు ప్రపంచమంతా అమ్మకాలు సాగిస్తున్నాయి. అరకు కాఫీ అంటే నాకు చాలా ఇష్టం. నేడు గిరిజన ప్రాంతాల్లో తయారుచేసే కాఫీకి అంతర్జాతీయంగా పేరొచ్చిందంటే 30 ఏళ్ల క్రితమే మేం తీసుకున్న చర్యలే కారణం. ఇటీవల ప్రధాని మోదీ అరకు కాఫీపై పెట్టిన ట్వీట్ ప్రజల్లోకి బాగా వెళ్లింది. నాంది ఫౌండేషన్ కింద అరకు కాఫీ ప్యారిస్ లో పెట్టారు. దాన్ని మహేంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహేంద్రా హ్యాండిల్ చేస్తున్నారు. ఇటీవల మన తెలుగు వ్యక్తి వర్మ....నేచర్ అరకు కాఫీని ప్రపంచమంతా ప్రమోట్ చేస్తున్నాడు. 200 వరకూ అరకు కాఫీ అవుట్ లెట్స్ పెట్టేందుకు డ్వాక్రా సంఘాలతో ఎంవోయూ చేసుకున్నారు. అరకు కాఫీ, ఫిల్టర్ కాఫీ, చాక్లెట్లు వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్ పెట్టారు. మన అసెంబ్లీలో కూడా పెట్టాలని స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ను కోరుతున్నాను. అరకు కాఫీని ఆర్గానిక్ కాఫీగా ప్రమోట్ చేస్తాం.

### ఎక్కడున్నా పట్టుకొచ్చి శిక్షిస్తాం

మహిళా భద్రతకు 13 రకాల ఫీచర్స్‌తో శక్తి యాప్ తెచ్చాం. 164 శక్తి టీమ్స్ ఏర్పాటు చేశాం. డ్రగ్స్, గంజాయి లేని రాష్ట్రంగా ఏపీని తయారుచేస్తాం. చి మహిళా భద్రత, హక్కులు, గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. మారుమూల పల్లెలో ఉండే ఆడబిడ్డ పట్టణాలకు వచ్చి గౌరవంగా ఉద్యోగం చేసుకునేలా చేస్తాం. గత ప్రభుత్వంలో ఒక్కసారైనా ప్రజా సమస్యలపై చర్చించలేదు. ఇది గౌరవ సభ కాదు కౌరవ సభ ...నేను ముఖ్యమంత్రి అయ్యాక సభను హుందాగా నడుపుతానని చెప్పాను. ఎవ్వరైనా ఆడబిడ్డల జోలికొస్తే అలాంటి సైకోలను వదిలిపెట్టను. సోషల్ మీడియాలో ఇష్టానుసారం మాట్లాడితే ప్రపంచంలో ఎక్కడున్నా పట్టుకొచ్చి శిక్షిస్తాం. చిత్తూరులో ఒక ఇంటిలో దొంగతనం కేసును రెండున్నర గంటల్లో ఛేదించిన పోలీసులను అభినందిస్తున్నాను.

### మహిళల కోసం 24 ఒప్పందాలు

మహిళలను పారిశ్రామివేత్తలుగా తయారుచేసేందుకు 24 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం జరిగాయి. అమూల్ వలే...మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు ఒక బ్రాండ్ తీసుకొచ్చి ప్రమోట్ చేస్తే అంతర్జాతీయంగా మంచి పేరు వస్తుంది. మన ఆడబిడ్డలు తయారుచేసే ఉత్పత్తులు ప్రపంచంలోని అన్ని మార్కెట్ లో పెడతాం. బనానా ఫైబర్ తో బ్యాగులు , శారీస్ , బొమ్మలు తయారు చేస్తున్నారు. గుర్రపు డెక్కతో కూడా బ్యాగులు తయారు చేస్తూ సంపద సృష్టిస్తున్నారు. ర్యాపిడో తో ఒప్పందం చేసుకున్నాం .

వెయ్యి ఎలక్ట్రిక్ వాహనాలను మహిళలే నడపనున్నారు. దీని ద్వారా మహిళలకు అదనపు ఆదాయం వస్తుంది. హెూం ట్రయాంగిల్ యాప్ ద్వారా మహిళలకు ఆన్ లైన్ ట్రైనింగ్ ఇప్పిస్తాం. నేషనల్ అప్రన్ షిప్ స్కీమ్ కింద 25 వేలమందికి ఎంపిక చేసి శిక్షణ ఇప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అలీప్ సంస్థ విజయవాడ, అనాకపల్లి, కుప్పంలో ఇండస్ట్రియల్ పార్క్ పెట్టనున్నారు. లక్షా 50 వేల మందికి కుట్టుమిషన్లు ఇప్పిస్తున్నాం. 42 వేలమంది ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ చెల్లిస్తున్నాం.

పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాం. 55 వేలమంది అంగన్వాడీ కార్యకర్తలు, 48వేల మంది అంగన్వాడీ ఆయాలకు గ్యాట్యుటీ పెంపుకు నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వ ఉద్యోగులు ఎంతమంది పిల్లలను కన్నా ప్రసూతి శెలవులు ఇస్తాం. ఈనెల ఉగాది పర్వదినం నాడు పీ4 ప్రారంభిస్తున్నాం. పీ3 ద్వారా సంపద సృష్టించాం. పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పీ4 తెస్తున్నాం. ఆర్థికంగా ఉన్నతిలో ఉన్న 10 శాతం మంది కింద ఉన్న 20 శాతం మందిని దత్తత తీసుకుని అండగా నిలవాలి. ప్రతి ఎమ్మెల్యే కనీసం వెయ్యి మంది డ్వాక్రా, మెప్మా సంఘాలను ఏడాదిలోగా పారిశ్రామిక వేత్తలుగా తయారుచేసే బాధ్యత తీసుకోవాలి.

### బాల్య వివాహాలను అరికడతాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపం కింద మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. 96 లక్షల 66 వేల 552 మందికి గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. రూ.753 కోట్లు ఇందుకోసం ఖర్చు చేస్తున్నాం. ఎందరు పిల్లలుంటే అందరికీ మే నెలలో తల్లికి వందనం ఇస్తాం. 2047 వరకూ మన దేశానికి ఇబ్బంది లేనప్పటికీ జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. సింగపూర్ వంటి దేశాలు ఇతర దేశాల్లోని నిపుణులను దిగుమతి చేసుకుంటున్నారు. ఒకప్పుడు ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హత లేదన్నాం. ఇప్పుడు ఇద్దరు పిల్లలకంటే తక్కువ ఉంటే పోటీకి అర్హులు కాదని బిల్లు తేవాల్సి ఉంది.

సంపదకు, జనాభాకు వైరుధ్యం ఉంది. డబ్బున్నవాళ్లంతా...ఇండస్ట్రీ పెట్టడం తేలిక...పిల్లలను కని పెంచడం కష్టం అంటున్నారు. ఒకప్పుడు ఎయిడ్స్ గురించి మాట్లడాలంటే సిగ్గుపడేవాళ్లు. బ్రేక్ సైలెన్స్ -టాక్ ఎబౌట్ ఎయిడ్స్ అని దేశంలో నేనే మొదట చెప్పాను. ప్రజల్లో చైతన్యం తెచ్చాం. చాలావరకూ ఎయిడ్స్ ను కంట్రోల్ చేశాం. ప్రతి ఆడబిడ్డ ఇద్దరు కంటే ఎక్కువమందిని కనాలి. ప్రతి ఆఫీస్ లో చైల్డ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. మహిళలకు శానిటరీ నాప్కిన్లు అందిస్తాం.

సిజేరియన్లు ఎక్కువయ్యాయి. వీటికితోడు ట్యుబెక్టమీ ఆపరేషన్లు కూడా వెంటనే చేయడంతో మహిళల ఆరోగ్యం దెబ్బతింటోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో 70 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. నార్మల్ డెలివరీస్ ను ప్రోత్సహించాలి. ప్రజల్లో చైతన్యం తెచ్చి బాల్య వివాహాలను కూడా పూర్తిగా అరికట్టాలి. డ్వాక్రా మహిళలు తీసుకునే రూ. 60 వేల కోట్ల రుణాల్లో 30 వేల కోట్లు ఉత్పత్తులపై పెడితే భారీగా ఆదాయం వస్తుంది. ప్రతి ఇంటి నుంచి ఒక ఎంటర్ ప్రెన్యూర్ ఉండాలి. ప్రోత్సహించాలేకానీ ఓ శక్తిగా డ్వాక్రా మహిళలు తయారవుతారు.

### వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఏపీ మా లక్ష్యం

గత పాలకుల విధ్వంసంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇది ప్రజా ప్రభుత్వం. వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఏపీ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. సరస్వతీ సిమెంట్స్ విషయంలో జగన్ రెడ్డి , విజయమ్మ ఒక అగ్రిమెంట్ చేసుకున్నారు. 2021లో 51.01 షేర్లు విజయమ్మకు ట్రాన్స్ ఫర్ చేయాలని అగ్రిమెంట్ చేసుకున్నారు. 2024లో విజయమ్మకు షేర్స్ ట్రాన్స్ ఫర్ కాగా వాటిని ఆమె కూతురికి ఇచ్చింది. దానిపై జగన్ రెడ్డి కేసు వేశాడు. విజయమ్మ మళ్లీ కోర్టుకు వెళ్లి అఫిడవిట్ వేసింది. ఆడబిడ్డలకు ద్రోహం చేయడం నేరం కాదా... ఇదో కేస్ స్టడీ.

ప్రజల్లో చైతన్యం తేవాలనే ఈ విషయం చెబుతున్నాను. తల్లి, చెల్లికి న్యాయం చేయని వ్యక్తి రాష్ట్రానికి ఏం చేస్తాడు.. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ఒక వెయ్యిమంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలి.

ఇది బాధ్యతగా తీసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చే చేయూ తను అందిపుచ్చుకుని డ్వాక్రా సభ్యులు ముందుకెళ్లాలి. వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఏపీ లక్ష్యంగా ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.

---

**వెంకటపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణం లో ఈ నెల 15 వ తేదీన జరుగనున్న శ్రీనివాస కల్యాణానికి సంబంధించిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం టీటీడీ అధికారులు, గుంటూరు జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఆయన సమన్వయం సమావేశం నిర్వహించారు.**



# జూన్ నాటికి 3 లక్షల గృహాలు

- పిఎంఎవై 1.0 పథకం గడువు మరో ఏడాది పొడిగింపు
- ఎస్సీ, ఎస్టీ, పివిటిజి, బిసీ గృహ లబ్ధిదారులకు అదనపు సాయం
- గృహ నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో మెటీరియల్ సరఫరాకు కృషి
- రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో వచ్చే జూన్ నెలాఖరులోగా 3 లక్షల గృహాల నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార అండ్ పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ఈమేరకు బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 2019-24 మధ్య కాలంలో రాష్ట్రానికి మొత్తం 18.04 లక్షల గృహాలు మంజూరైతే గత ప్రభుత్వం కేవలం 5.87 లక్షల గృహాలను మాత్రమే పూర్తి చేసి, 12.20 లక్షల గృహ నిర్మాణాలను అసంపూర్తిగా విడిచిపెట్టేసిందని పేర్కొన్నారు. అదే విధంగా 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం ఎస్సీగృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.50,000, ఎస్టీలకు రూ.75,000 అదనపు ఆర్థిక సాయం అందించేదని, కానీ గత ప్రభుత్వం ఈ అదనపు సాయాన్ని రద్దు చేయడమే గాక యూనిట్ విలువను రూ.1.80 లక్షలకు తగ్గించేసిందన్నారు. ఈ మొత్తంలో కేవలం రూ.30,000 మాత్రమే గత ప్రభుత్వం అంద జేయడం జరిగిందని తెలిపారు. గృహ నిర్మాణానికి కేటాయించిన నిధులను కూడా గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో వేరే పథకాలకు మళ్లించడంతో రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకాలు పూర్తిగా కుంటు పడ్డాయని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు వీటిలో 5.00 లక్షల గృహాలను ఈ ఏడాది జూన్ లోపు పూర్తి చేయ నున్నామని, మిగిలిన గృహాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయనున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 పథకం అమలు గడువు ముగిసి పోవడంతో, ఆ గడువును పొడించాలని తమ ప్రభుత్వం చేసిన కృషి సఫలీకృతం అయిందని, వచ్చే ఏడాది మార్చి వరకూ కేంద్ర ప్రభుత్వం ఈ గడువును పొడిగించిందని ఆయన తెలిపారు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని, త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు.

# 17 నుండి ఏప్రిల్ 1 వరకూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు

- ఉదయం 9.30 గం.ల నుండి మధ్యాహ్నం 12.45గం.ల వరకూ పరీక్షలు
- 3వేల 450 పరీక్షా కేంద్రాలు.. హాజరుకానున్న 6లక్షల 19వేల 275 మంది విద్యార్థులు
- పరీక్ష రోజు పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు
- కేంద్రాల పరిధిలో జిరాక్సు, నెట్ సెంటర్లను మూసి ఉంచాలి
- ఫేక్ న్యూస్, వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు
- రాష్ట్ర స్థాయిలో 08662974540 నంబరు కంట్రోల్ రూమ్
- చీఫ్ సూపరెంటెండెంట్ తప్ప ఎవరి మొబైల్ ఫోన్ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించొద్దు
- కలెక్టర్లు, ఎస్పీల స్థాయిలో జిల్లా స్థాయి కో ఆర్డినేషన్ సమావేశం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



**అమరావతి, మహానాడు:** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకూ నిర్వహించే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేని రీతిలో సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, విద్యా తదితర శాఖల అధికారులను ఆదేశించారు. పదవ తరగతి పరీక్షలపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి వారితో వీడియో సమావేశం ద్వారా సన్నాహక ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.చీఫ్ సూపరింటిండెంట్ మినహా ఎవరి మొబైల్ ఫోన్ ను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు.ఎవరైనా మొబైల్ ఫోన్లు తీసుకువస్తే వాటిని పరీక్షా కేంద్రాల ప్రధాన గేటువద్దే వాటిని సేకరించి భద్రపర్చి పరీక్ష అనంతరం వాటిని తిరిగి అప్పగించాలన్నారు.పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించాలని చెప్పారు.అదే విధంగా పరీక్షా కేంద్రాల పరిధిలోని జిరాక్సు,నెట్ సెంటర్లన్నీ మూసి ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లను సిఎస్ విజయానంద్ ఆదేశించారు.

పరీక్షలు జరిగే సమయంలో వివిధ సోషల్ మీడియా సహా ఇతర ప్రసార మాధ్యమాల్లో పేపరు లీకు వంటి వదంతులు లేదా ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ స్పష్టం చేశారు.ఎక్కడైనా అలాంటివి వ్యాప్తి జరిగితే వెంటనే విచారణ చేసి తగిన స్పష్టత ఇవ్వాలని నకిలీ వార్తలు ప్రసారం చేసినట్టు తేలితే అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇటీవల బిఇడి పరీక్షల నిర్వహణ సమయంలో పేపర్ లీక్ వంటి వదంతులు వచ్చాయని, అలాంటి వాటిపై పూర్తి అప్రమత్తంగా ఉండి పరీక్షల సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలక్టర్లు,ఎస్పిలను ఆదేశించారు.రానున్న10వ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించేలా వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించుకోవాలని చెప్పారు.సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలక్టర్లను సిఎస్ విజయానంద్ ఆదేశించారు.

అంతకు ముందు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు 10వ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ మొత్తం 3వేల 450 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 163 సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలుగా గుర్తించి అక్కడ ప్రత్యేకమైన సిసిటివి కెమెరా సర్వైలెన్స్ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.10వ తరగతి పరీక్షలకు మొత్తం 6లక్షల 19వేల 275 మంది విద్యార్థులు హాజరు కానుండగా వారిలో 3లక్షల 15వేల 697 మంది బాలురు, 3లక్షల 3వేల 578 మంది బాలికలు హాజరు కానున్నారని తెలిపారు.కర్నూల్,అనంతపురం,ప్రకాశం జిల్లాల్లో ఎక్కువ మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు చెప్పారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 156 ఫ్లైయింగ్ స్క్వాడ్స్,682 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని అన్నారు.అలాగే ప్రతి జిల్లాకు ప్రత్యేక నోడలు అధికారులను నియమించామని తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో 08662974540 నంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని జిల్లాల్లో కూడా ప్రత్యేక కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని కలక్టర్లకు సూచించారు.పరీక్షల నిర్వహణకు సంబంధించిన కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ ను ఇప్పటికే జిల్లాలకు పంపడం జరిగిందని అన్నారు.వేసవి దృష్ట్యా అన్ని పరీక్షా కేంద్రాల్లో తగిన తాగునీటి సౌకర్యం కల్పించాలని,ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స వంటి సేవలకు ఒక ఎఎన్ఎంను అందుబాటులో ఉంచాలని సూచించారు.పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాకు ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

అదే విధంగా మార్చి 17 నుండి 28 వరకూ 10వ తరగతి(ఏపెన్ స్కూల్)పబ్లిక్ పరీక్షలు ప్రతి రోజు ఉ.9.30 గం.ల నుండి మధ్యాహ్నం 12.30గం.ల వరకూ జరగనున్నాయని ఈపరీక్షలకు 30వేల 334 మంది విద్యార్థులు హాజరు కానున్నారని డైరెక్టర్ విజయ రామరాజు చెప్పారు.ఈపరీక్షలను కూడా 471 రెగ్యులర్ పరీక్షా కేంద్రాల్లోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.రానున్న పరీక్షలను సక్రమంగా సజావుగా నిర్వహించేందుకు వీలుగా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు విజయ రామరాజు వివరించారు.

ఈసమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,సిసిఎల్ఏ జి.జయలక్ష్మి,పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జెసిలు, డిఇఓలు,సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో వర్చువల్ గా పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 13, మార్చి 2025



# నాగ్ పూరీకి ఛాన్స్ ఇస్తాడా?



మన్మధుడు.. కింగ్.. నాగార్జున సోలో హీరోగా సినిమా రిలీజై ఏడాది దాటింది. గత ఏడాది సంక్రాంతికి 'నా సామిరంగ'తో పలకరించిన నాగ్.. తిరిగి సోలో సినిమా చేయలేదు. కూలీ, కుబేర లాంటి చిత్రాల్లో ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నారు. తమిళ దర్శకుడు నవీన్‌తో సినిమా అన్నారు కానీ.. అది ఇంకా ఒక కొలిక్కి వచ్చినట్లు లేదు. మోహన్ రాజాతో అనుకున్న సినిమా ఏమైందో కూడా తెలియదు. మరోవైపు నాగ్‌తో ఓ సినిమా చేయడానికి సీనియర్ దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రయత్నిస్తున్నాడన్న వార్త ఇటీవల చర్చనీయాంశంగా మారింది. , డబుల్ ఇస్మార్ట్ చిత్రాలతో షాక్ మీద షాక్ తిన్న పూరి.. కొన్ని నెలలుగా కొన్నిస్క్రిప్టుల మీద పనిచేస్తున్నాడు. రెండు కథలు రెడీ అయ్యాక హీరోలను సంప్రదించి నరేషన్ ఇచ్చే ప్రయత్నంలో ఉన్నాడు. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్‌కు కూడా ఇటీవల ఒక కథ చెప్పినట్లు సమాచారం. అక్కడ్నుంచి ఏం సమాధానం వచ్చిందో తెలియదు. కాగా ఇప్పుడేమో నాగ్ పేరు తెరపైకి వచ్చింది. కానీ గత కొన్నేళ్లుగా పూరి ట్రాక్ రికార్డు చూశాక నాగ్ సినిమా చేస్తాడా అన్నది ప్రశ్నార్థకం. ఐతే ఈ న్యూస్ బయటికి వచ్చినప్పటి నుంచి నాగ్ ఫ్యాన్స్ మాత్రం సోషల్ మీడియాలో ఆసక్తికర కామెంట్లు పెడుతున్నారు. శివమణి చిత్రంలో నాగ్‌ను సరికొత్తగా ప్రెజెంట్ చేసిన ఘనత పూరి సొంతం. అప్పట్లో ఆ చిత్రం సెన్సేషన్ క్రియేట్ చేసింది. అందులో నాగ్ క్యారెక్టరైజేషన్.. యాటిట్యూడ్ వేరే లెవెల్లో ఉంటుంది.

వీరి కలయికలో తర్వాత 'సూపర్' సినిమా వచ్చింది. ఏదైతే అయింది ఓకే చేసేయండి నాగ్ సార్ అంటూ అభిమానులు పోస్టులు పెడుతుండడం విశేషం. ఇప్పుడు పూరిది చాలా క్రిటికల్ పొజిషన్. హిట్టు కొట్టి తీరాలి. అందుకోసం కొత్త రైటింగ్ టీంతో ఆయన పనిచేస్తున్నాడు.

# మోడ్రన్ అవతార్‌లో కళ్యాణ్‌రామ్



నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ అర్జున్ S/O వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ యాక్షన్-ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌తో గ్రేట్ ఇంపాక్ట్ ని క్రియేట్ చేసిన ఈ మూవీ ప్రీ-టీజర్‌ను మార్చి14న విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.

ఈ పోస్టర్‌లో కళ్యాణ్ రామ్ మోడరన్ అవతార్‌లో కనిపించారు. ఫ్రెంచ్ గడ్డం, షేడ్స్‌తో, భారీ మైనింగ్ ల్యాండ్‌స్కేప్ లో డైనమిక్‌గా వాక్ చేస్తూ రావడం అదిరిపోయింది. ఈ ప్రీ-టీజర్‌లో అఫీషియల్ టీజర్ విడుదల తేదీని కూడా రివిల్ చేస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ రామ్ ప్రసాద్ అద్భుతమైన విజువల్స్ అందించగా, అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూర్చారు. ఎడిటింగ్ తమ్మిరాజు, స్క్రీన్‌ప్లే శ్రీకాంత్ విస్సా అందించారు.

# చుక్క రక్తం లేకుండా కమర్షియల్ సినిమా తీశా : రామ్ జగదీష్



నాని వాల్ పోస్టర్ సినిమా ప్రెజెంట్ చేస్తున్న మూవీ 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ అలానే ప్రేమలో పాట కూడా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ప్రశంసలు అందుకున్నాయి. ఈ చిత్రం మార్చి 14న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ జగదీష్ సినిమా విశేషాలు విలేకరుల సమావేశంలో పంచుకున్నారు.

### జగదీష్ ఈ కథ చేయడానికి మీకు స్ఫూర్తి?

ఈ కథ ఫోక్సో యాక్ట్ నేపథ్యంలో ఉంటుంది. నిజజీవితంలో ఇలాంటి ఒక కేసుని నేను పరిశీలించాను. ఆ కేసు గురించి తెలుసుకున్నప్పుడు నిజంగా ఇలా కూడా ఉంటుందా అని సందేహంగా అనిపించింది. ఇలాంటి కేసులు ఇంకా చాలా ఉన్నాయని తెలిసింది. ఆ కేసులు అన్నిటి మీద కూడా రీసెర్చ్ చేశాను. ఏపీ తెలంగాణలో వందల కేసులు ఉన్నాయి. ఇవన్నీ స్క్రీన్ మీద అడ్రస్ చేస్తే బాగుంటుంది కదా అనిపించింది. ఈ కథ కోసం చాలా కేసు ఫైల్స్ చదివాను. అన్ని కేస్ ఫైల్స్ లో ఉన్న మెటీరియల్ తో ఒక మంచి కథ చెప్పొచ్చు కదా అనిపించింది. అవన్నీ ఒక కథగా చేసి స్క్రీన్ పై చూపించడం జరిగింది.

### నానికి కథ చెప్పడం ఎలా అనిపించింది?

నానికి కథ చెప్పడం వెరీ హ్యాపీ మూమెంట్. ఆయనకి కథ చెప్పడానికి దాదాపు 8 నెలలు వెయిట్ చేశాను. ఫైనల్ గా ఆయన కథ వినే మూమెంట్ వచ్చింది. ఆయన కథ విన్న విధానం చూసి నాకు చాలా ఆనందంగా అనిపించింది. దాదాపు రెండున్నర గంటల కథని సింగిల్ సిటింగ్ లో విన్నారు. కథ మొత్తం విని నిల్చుని షేక్ హ్యాండ్ ఇచ్చి 'వెల్కమ్ టు వాల్ పోస్టర్ సినిమా' అన్నారు. అది నా జీవితంలో హై మూమెంట్. అది నిజంగా గ్రేట్ ఎక్స్‌పీరియన్స్.

### చాలా కోర్ట్ రూమ్ డ్రామాలు వచ్చాయి కదా ఈ సినిమా ఎంత ప్రత్యేకంగా ఉండబోతుంది?

చాలా కోర్ట్ రూమ్ డ్రామాలు చూసాం. కానీ ఒక లవ్ స్టోరీ ని కోర్ట్ రూమ్ డ్రామాగా ఎప్పుడు చూడలేదని భావిస్తున్నాను. ఇందులో లవ్ స్టోరీ, కోర్ట్ రూమ్ డ్రామా చాలా ప్రత్యేకంగా ఉంటాయి.

### ఫోక్సో చట్టం ఈ కథలో ఏమేరకు ఉంటుంది?

ఫోక్సో చాలా ముఖ్యమైన యాక్ట్. నిజానికి ఆ చట్టం గురించి బయట ప్రపంచానికి చాలా తక్కువ తెలుసు. దాని గురించి కొంచెం డీటెయిల్ గా చెప్తే బాగుంటుందని అనిపించింది. అది ఈ సినిమాలో చూస్తారు.

### ప్రియదర్శి క్యారెక్టర్ గురించి?

ఈ సినిమా ఐడియా మొదటగా ప్రియదర్శికే చెప్పాను. ఆయనకి చెప్పిన తర్వాత ఈ సినిమాని నేనే చేస్తాను. ఇంకా ఎవరికీ చెప్పొద్దు అన్నారు. ఆయనకే చెప్పాను. ఆయనతోనే చేశాను. ప్రియదర్శితో నాకు చాలా క్లోజ్ అసోషియేషన్. చాలా ఫ్రెండ్లీ గా వుంటాం. తనతో అన్నీ షేర్ చేసుకోగలను.

### శివాజీ క్యారెక్టర్ గురించి?

శివాజీ మంగపతి క్యారెక్టర్ లో కనిపిస్తారు. ప్రతి ఫ్యామిలీలో అలాంటి ఒక క్యారెక్టర్ ఉంటుంది. ఇలాంటి ఒక సంఘటన జరిగినప్పుడు ప్రతి ఒక్కరు మంగపతి అవుతారు. రియల్ లైఫ్ క్యారెక్టర్ లా ఉంటుంది. ఇది కమర్షియల్ సినిమానే. సినిమా చూసి ఒకతను చుక్క రక్తం లేకుండా కమర్షియల్ సినిమా చూపించావ్ అన్నారు. ఆ మాట నాకు చాలా నచ్చింది. ఇది కమర్షియల్ సినిమానే. సినిమా చూసి ఒకతను చుక్క రక్తం లేకుండా కమర్షియల్ సినిమా చూపించావ్ అన్నారు. ఆ మాట నాకు చాలా నచ్చింది.

# క్లీన్ కమర్షియల్ మూవీ 'డిల్‌రూబా'

## - హీరో కిరణ్ అబ్బవరం

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. "దిల్ రూబా" చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం




వహిస్తున్నారు. "దిల్ రూబా" సినిమా ఈనెల 14న హెూలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ - నా ప్రతి సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్ సుధీర్, డీవోపీ డేనియల్ విశ్వాస్ తప్పకుండా ఉంటారు. వీళ్లు ఉంటే నాకు చాలా ధైర్యంగా ఉంటుంది. "దిల్ రూబా"కు సామ్ సీఎస్ ఇచ్చిన మ్యూజిక్ అద్భుతంగా వచ్చింది. ఆయన మ్యూజిక్ కోసమైనా మీరు "దిల్ రూబా" చూడాలి. మా మూవీతో సారెగమా వారు అసోసియేట్ కావడం సంతోషంగా ఉంది. నేను ఇండస్ట్రీలోకి వచ్చి ఐదేళ్లవుతోంది. పది సినిమాలు చేశాను. కిరణ్ కష్టపడుతున్నాడు అని మీరంతా నా సినిమాల పట్ల ఆదరణ చూపిస్తున్నారు. ఇదే ప్రేమను కాపాడుకుంటూ ఇకపైనా సినిమాలు చేస్తా. నా మొదటి సినిమా రిలీజ్ కాకముందే పది మంది కిరణ్ అన్న అభిమానులం అని నా వెంట ఉండేవారు. ఇప్పుడా పది మంది వందలు, వేలు అయ్యారు. నా ఫ్యాన్స్ గురించి మాట్లాడాలంటే ఎమోషన్ అవుతాను.

మీ అభిమానం కాపాడుకుంటూ గర్వపడేలా సినిమాలు చేస్తానని చెబుతున్నా. సినిమా ఇండస్ట్రీలోకి హెూప్ తో వచ్చే ఎంతోమంది ఇక్కడి కష్టాలు పడలేక తిరిగి వెళ్లిపోవడం చూశా. కానీ మీరు ధైర్యంగా ఉండండి తప్పకుండా మీరూ నాలాగ సంతోషంగా ఉండే రోజు వస్తుంది. నేను ఇంకా సక్సెస్ అయితే ఏటా వందమంది ఔత్సాహికులకు సాయం చేయాలనుకుంటున్నా. నా ప్రతి సినిమాలో 40 నుంచి 50 మంది కొత్త వాళ్లకు అవకాశాలు కల్పిస్తున్నా. ఇకపైనా ఆ ప్రయత్నం కొనసాగిస్తా. మొదట్లో "దిల్ రూబా"ను ఎలా రిసీవ్ చేసుకుంటారో అని భయపడిన మాట నిజం. అయితే ఇప్పుడు మా టీమ్ అంతా చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాం. ఈ నెల 14న కాదు 13 సాయంత్రమే "దిల్ రూబా" ప్రీమియర్స్ తో మా సక్సెస్ జర్నీ స్టార్ట్ కాబోతోంది. హెూలీ పండుగను మా మూవీతో కలిసి థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకోండి. ఇంత క్లీన్ గా కమర్షియల్ సినిమా తీయగలరా అని దిల్ రూబా చూశాక మీరే అంటారు. ఇది న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా. సినిమా ఎంత పెద్ద సక్సెస్ అనేది ఇప్పుడే చెప్పలేను కానీ మీ టైమ్ ను వృథా చేయను, మీకు ఎంటర్ టైన్ మెంట్ గ్యారెంటీ అని మాత్రం ఇవ్వగలను. అన్నారు.

# 'కన్నప్ప' నుంచి ప్రేమ పాట

డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'పై పాజిటివ్ బజ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. శివా శివా శంకర పాట, రీసెంట్‌గా రిలీజ్ చేసిన రెండో టీజర్‌తో సినిమా మీద అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ మూవీని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో మరింతగా ప్రమోషనల్ కార్యక్రమాలను పెంచేశారు. ఈ సందర్భంగా ఓ బ్యూటీఫుల్ లవ్ మెలోడీ సాంగ్‌ను రిలీజ్ చేశారు. విష్ణు మంచు, ప్రీతి ముకుందన్ కనిపించే 'సగమై.. చెరిసగమై' అంటూ సాగే ఈ పాటను తాజాగా విడుదల చేశారు. ఈ పాటను రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. స్టీఫెన్ దేవస్సీ బాణీ హృదయాన్ని హత్తుకునేలా ఉంది. శ్రీమణి సాహిత్యం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ సాంగ్ చిత్రీకరించిన తీరు, ఇక ప్రభు దేవా, బృందా కొరియోగ్రఫీ చేసిన విధానం, విష్ణు మంచు-ప్రీతి ముకుందన్‌ను చూపించిన తీరు, వారిద్దరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది. శివ భక్తుడైన కన్నప్ప పురాణ కథను వెండితెరపై ఆవిష్కరించబోతోన్నారు. విష్ణు మంచు కన్నప్పగా, అక్షయ్ కుమార్ శివుడిగా, ప్రభాస్ రుద్రుడిగా, కాజల్ పార్వతీ మాతగా ఈ చిత్రంలో కనిపించనున్నారు. మోహన్ బాబు, మోహన్‌లాల్, బ్రహ్మానందం వంటి అద్భుతమైన తారాగణంతో తెరకెక్కిన కన్నప్ప చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



# శ్రీలీల ఇది నిజమేనా?



ఏ ఇండసట్రీలోనైనా సరే ఓ అమ్మాయి.. అబ్బాయి కలిసున్నట్లైతే ముందు డేటింగ్ అంటూ పుకార్లు షికార్లు చేస్తాయి. అదే విధంగా శ్రీలీల బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ డేటింగ్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తున్నాయి. ఆర్యన్ ఇంట్లో ఇటీవల జరిగిన ఓ పార్టీకి నటి శ్రీలీల హాజరుకావడంతో ఈ పుకారు జోరు కాస్త పెరిగింది. పలు ఫంక్షన్లకు కార్తీక్ ఆర్యన్, శ్రీలీల కలిసి హాజరకావడం ఈ ప్రచారానికి ఊతమిస్తోంది. అయితే, ఇటీవల జరిగిన ఐఫా వేడుకల్లో కార్తీక్ ఆర్యన్ తల్లి మాలా తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ ఆమెను సరదాగా ఇంటర్వ్యూ చేశారు. కార్తీక్, శ్రీలీల అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని 'ఎలాంటి కోడలు రావాలని మీరు కోరుకుంటున్నారు' అని ప్రశ్నించారు. దీనికి మాలా తివారీ స్పందిస్తూ.. ఓ మంచి డాక్టర్ మా ఇంటికి కోడలుగా రావాలని తమ కుటుంబం భావిస్తోందని చెప్పారు. ఈ వ్యాఖ్యలు శ్రీలీలను ఉద్దేశించే చేశారని సినీవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే శ్రీలీల ఎంబీబీఎస్ చదువుతోంది. వైద్య విద్యతో పాటే ఇండస్ట్రీలో కొనసాగుతుండడం సంతోషంగా ఉందని పలు సందర్భాలలో శ్రీలీల చెప్పుకొచ్చారు. తాజాగా కార్తీక్ ఆర్యన్ తల్లి చేసిన వ్యాఖ్యలు వారిద్దరి బంధానికి తమ ఆశీస్సులు ఉన్నాయని చెప్పకనే చెప్పినట్టైంది. కాగా, దక్షిణాదిలో హీరోయిన్‌గా గుర్తింపుతెచ్చుకున్న శ్రీలీల.. అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమాలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144